


RNI NO:TELTEL/ 2023/89546

# సూర్య రేఖ

తెలుగు దినపత్రిక



## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం

సంప్రదించవలసిన నెం : 9397303326



రంగారెడ్డి | సంపుటి : 2 | సంచిక : 455 | పేజీలు : 12 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | మంగళవారం 5 ఆగస్టు 2025 | వెల : 4/-




## తొలి మధ్యవర్తి శ్రీకృష్ణ భగవానుడే..

- మధ్యవర్తిత్వం ద్వారా సమస్యను సెటిల్ చేసుకోండి: సుప్రీంకోర్టు
- సమస్య పరిష్కారం కోసం ఓ కమిటీని ప్రతిపాదిస్తున్నాం
- ఆ కమిటీ రాష్ట్ర ప్రభుత్వానికి ఆలయ ట్రస్టు బోర్డుకు మధ్యవర్తిత్వం వహిస్తుంది



## తీవ్ర చిక్కుల్లో అనిల్ అంబానీ

- బ్యాంక్‌లకు ఈడీ నోటీసులు
- మనీలాండరింగ్ కేసులో దర్యాప్తు చేపట్టిన ఈడీ
- మొత్తం 12-13 బ్యాంకులకు దర్యాప్తు సంస్థ నుంచి నోటీసులు
- వీటిల్లో పబ్లిక్ సెక్టార్‌తోపాటు ప్రైవేటు సెక్టార్ బ్యాంకులు



## ఐదేళ్లలో రూ.7.08లక్షల కోట్ల జీఎస్టీ ఎగవేత..

- లోక్‌సభలో గణాంకాలను వెల్లడించిన మంత్రి..!
- దాదాపు రూ.1.79లక్షల కోట్ల ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ మోసాలు
- 2024-25 ఆర్థిక సంవత్సరంలోనే రూ.2.23 లక్షలకోట్లకుపైగా జీఎస్టీ ఎగవేత

# ప్రపంచ స్థాయి గ్లోబల్ జీసీసీ రాజధానిగా హైదరాబాద్

- లైఫ్ సైన్సెస్ రంగంలో చారిత్రక మైలురాయిగా హైదరాబాద్
- లైఫ్ సైన్సెస్ కేపిటల్‌గా హైదరాబాద్‌కు గుర్తింపు ఉంది
- దేశ ఆర్థిక వ్యవస్థలో పది శాతం తెలంగాణ నుంచే అందిస్తాం
- హైదరాబాద్ నుంచే నలభై శాతం ఫార్మా ఉత్పత్తులు వస్తున్నాయి
- హైదరాబాద్‌లోనే అత్యధిక వ్యాక్సిన్ల తయారీ ఉంది
- హైదరాబాద్‌లో ఫార్మా కంపెనీలకు ప్రత్యేక జీనోమ్ వ్యాలీ ఉంది



హైదరాబాద్

తెలంగాణ లైఫ్ సైన్సెస్ రంగంలో ఈరోజు చారిత్రక మైలురాయిగా నిలిచిపోతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్ఘాటించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 20 నెలల్లోనే చేసిన ప్రయత్నాల ఫలితంగానే ఈ రోజు హైదరాబాద్ నగరం ప్రపంచ స్థాయి గ్లోబల్ జీసీసీ రాజధానిగా ఎదిగిందని వ్యాఖ్యానించారు. ఇందుకు ఇవాళ్టి ఈ కార్యక్రమమే తిరుగులేని నిదర్శనమని నొక్కిచెప్పారు. తమ ప్రభుత్వ చిత్తశుద్ధి, దృష్టికోణం, కృషి ఫలితంగానే ఇది సాధ్యమైందని చెప్పుకొచ్చారు. ఈ విజయం సాధించడంలో అహర్నిశలు శ్రమించిన మంత్రి శ్రీధర్ బాబుకి, జయేష్ రంజన్‌కి, పాలుపంచుకున్న అధికారులందరికీ హృదయపూర్వక అభినందనలు తెలిపారు సీఎం రేవంత్‌రెడ్డి. ఇది తెలంగాణ రైజింగ్ 2047 దిశగా తాము వేసిన మరొక ముఖ్యమైన అడుగని ఉద్ఘాటించారు. సోమవారం గచ్చిబౌలిలో ప్రముఖ లిల్లీ ఫార్మా కంపెనీని ప్రారంభించారు. అమెరికాకు చెందిన ఫార్మా కంపెనీని సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. తెలంగాణను - మిగతా3లో



## తెలంగాణలో భారీ వర్షాలు

- హెచ్చరించిన వాతావరణశాఖ
- ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ను జారీ
- 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు
- రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల మోస్తరు వర్షాపాతం నమోదయ్యే అవకాశాలు

హైదరాబాద్

తెలంగాణలోని పలుచోట్ల ఈ నెల 8 వరకు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. ఉపరితల ఆవర్తనం నైరుతి బంగాళాఖాతం, ఉత్తర తమిళనాడు తీరం వెంట - మిగతా3లో



## త్వరలో అసెంబ్లీ సమావేశాలు

- ప్రధానంగా కాళేశ్వరం కమిషన్ నివేదికపైనే అసెంబ్లీలో చర్చించే అవకాశం
- కాళేశ్వరంపై అవతవకలపై ఏర్పాటు చేసిన కమిషన్..
- తుది నివేదికను కొన్ని రోజుల క్రితం ప్రభుత్వానికి అందించింది.
- 650 పేజీల కాళేశ్వరం నివేదికను 60 పేజీల సారాంశంగా తయారు చేసింది
- క్యాబినెట్‌కు సమర్పించిన ఈ సంక్షిప్త నివేదికలో 32 సార్లు కేసీఆర్, 19 సార్లు హరీశ్‌రావు, 5 సార్లు ఈటల రాజేందర్ ప్రస్తావన వచ్చినట్లు సమాచారం.

## అరెస్ట్ చేయొచ్చు..



- కేసీఆర్ సంచలన వ్యాఖ్యలు
- కాళేశ్వరం ప్రాజెక్ట్ పనికిరాదన్నవాడు అజ్ఞాని
- అది కాళేశ్వరం కమిషన్ కాదు.. కాంగ్రెస్ కమిషన్
- కాళేశ్వరంపై కేబినెట్‌లో ఏం నిర్ణయం తీసుకుంటారో వేచి చూద్దాం
- కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపు

సిద్దిపేట

సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరుగుతున్న కేబినెట్ సమావేశంలో భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై కమిషన్ నివేదికను పవర్ పాయింట్ ద్వారా ప్రజెంటేషన్ చేశారు. అదే సమయంలో మెదక్ జిల్లా ఎర్రవల్లిలోని తన ఫామ్ హౌస్‌లో పార్టీ ముఖ్య నేతలతో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ కీలక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. అది కాళేశ్వరం కమిషన్ కాదు.. కాంగ్రెస్ కమిషన్ అని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్ ఊహించినదేనని స్పష్టం చేశారు. దీనిపై ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కొంత మంది బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేయవచ్చు.. భయపడ వద్దని వారికి సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ పనికిరాదన్నవాడు అజ్ఞాని అని ఆయన అభివర్ణించారు. కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని బీఆర్ఎస్ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని సూచించారు. కాళేశ్వరంపై కేబినెట్‌లో ఏం నిర్ణయం - మిగతా3లో

# జూబ్లీహిల్స్ కోసం గులాబీ వ్యూహాలు





- జూబ్లీహిల్స్ నియోజకవర్గం బీఆర్ఎస్‌కు సిట్టింగ్ సీటు కావడంతో ప్రతిష్టాత్మకంగా మారింది
- ఎన్నికలు ఎప్పుడొచ్చినా గెలిచేందుకు గులాబీ పార్టీ తన వ్యూహాలకు పదును పెట్టాల్సి ఉంటుంది.
- గత అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్ పరిధిలో గణనీయంగా సీట్లు గెలవడంతో గులాబీ పార్టీకి రాబోయే జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక గెలవడం అనివార్యంగా మారినట్లుంది.

హైదరాబాద్

త్వరలో ఉప ఎన్నిక జరిగే జూబ్లీహిల్స్ నియోజకవర్గం బీఆర్ఎస్‌కు సిట్టింగ్ సీటు కావడంతో ప్రతిష్టాత్మకంగా మారింది. ఎన్నికలు ఎప్పుడొచ్చినా గెలిచేందుకు గులాబీ పార్టీ తన వ్యూహాలకు పదును పెట్టాల్సి ఉంటుంది. ఇక్కడి నుంచి 2018, 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ తరుపున దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ విజయం సాధించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్ పరిధిలో గణనీయంగా సీట్లు గెలవడంతో గులాబీ పార్టీకి రాబోయే జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక గెలవడం అనివార్యంగా మారినట్లుంది. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఉన్న ఆరు డివిజన్లు ఉన్నాయి. వాటిలో రహ్మత్ నగర్, వెంగళరావు నగర్, షేక్‌పేట, బోరబండ, యూసుఫ్ గూడ, ఎర్రగడ్డలున్నాయి. నియోజకవర్గంలో పెద్ద సంఖ్యలో ముస్లిం మైనార్టీ ఓటర్లున్నారు. వారే విజయావకా శాలను ప్రభావితం చేస్తారని గత ఎన్నికల్లో ఓటింగ్ సరళిని పరిశీలిస్తే తెలుస్తోంది. దాదాపుగా 32 శాతానికి పైగా వారు న్నారు. 2014 ఎన్నికల్లో ఎంఐఎం తరుపున పోటీ చేసిన నవీన్ యాదవ్ 41,656 ఓట్లు సాధించారు. దాదాపుగా 25.19శాతం ఓట్ల ను పొంది రెండో స్థానంలో నిలిచారు.ఎంఐఎం పార్టీ 2009 అసెంబ్లీ ఎన్నికల్లో 23.96 శాతం, 2014 పార్లమెంట్ ఎన్నికల్లో సైతం 19.6 శాతం ఓట్లను పొందింది. - మిగతా3లో

## రాష్ట్రపతితో గంటల వ్యవధిలో మోదీ, అమిత్ భేటీలు.. అందుకేనా?



- ఈ వరుస భేటీలపై ఎలాంటి అధికారిక ప్రకటనా వెలువడకపోయినప్పటికీ.. పలు ఊహాగానాలు
- జమ్మూకశ్మీర్‌కు రాష్ట్రహోదా పునరుద్ధరణ కోసమేనంటూ సోషల్‌మీడియాలో ప్రచారం
- ఆర్టికల్ 370ని రద్దుచేసి ఆరేళ్లు పూర్తవుతున్న తరుణంలో జరిగిన భేటీలతో ఈ తరహా చర్చ

## నల్గొండను విద్యా హబ్‌గా తీర్చిదిద్దుతాం

- నల్గొండ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూలు రాష్ట్రంలోనే మొదటి స్కూల్ కావాలి
- 9 నెలల్లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణాన్ని పూర్తి చేయాలి
- రాష్ట్ర రోడ్లు, భవనాలు,సినిమాటోగ్రఫి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి.



నల్గొండ:

నల్గొండ జిల్లాను విద్యా హబ్ గా తీర్చిదిద్దుతామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి తెలిపారు. అన్ని వర్గాల విద్యార్థులకు ఉత్తమమైన చదువులను అందించాలన్న లక్ష్యంతో నల్గొండ జిల్లా కేంద్రంలో చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల రాష్ట్రంలోనే మొదటిది కావాలన్నారు. 9 నెలల్లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆయన ఆదేశించారు.సోమవారం నల్గొండ జిల్లా కేంద్రం సమీపంలోని గంధం వారి గూడెంలో 200 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల పనులకు - మిగతా3లో

# తొలి మధ్యవర్తి శ్రీకృష్ణ భగవానుడే

**న్యూఢిల్లీ:** 150 ఏళ్లకు పైగా చరిత్ర కల్గిన పురాతన బాంకే బిహారీ ఆలయానికి సంబంధించి ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం-ఆలయ ట్రస్టుల మధ్య నెలకొన్న వివాదాన్ని ఉన్నత స్థాయి కమిటి మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవాలని సుప్రీంకోర్టు సూచించింది. బృందావన్‌లో ఉన్న బాంకే బిహారీ కృష్ణ దేవాలయం అంశానికి సంబంధించి సోమవారం జస్టిస్ సూర్యకాంత్, జోయ్‌మాల్యా బాగ్చిలతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ప్రధానంగా రూ. 500 కోట్లను ఆలయ నిధులతో దేవాలయ అభివృద్ధి పనులను చేపట్టడానికి యూపీ ప్రభుత్వం సిద్ధం కాగా, ఆలయ ట్రస్టు అభ్యంతరం వ్యక్తం చేయడంపై ఇది సుప్రీంకోర్టు వరకూ వెళ్లింది. ఆలయ నిధులను అభివృద్ధికి వాడటానికి మే 15వ తేదీన సుప్రీంకోర్టు అనుమతి ఇవ్వగా, తాజా తీర్పులో ఆ వివాదాన్ని ఓ కమిటీ ఏర్పాటు చేసి దాని ద్వారా సెటిల్ చేసుకోవాలని ధర్మాసనం పేర్కొంది. అదే సమయంలో గత తీర్పును ఉపసంహరించు కోవాలని ధర్మాసనం మౌఖికంగా ప్రతిపాదించింది ప్రస్తుత ధర్మాసనం.

**తొలి మధ్యవర్తి శ్రీకృష్ణ భగవానుడే..**

బాంకే బిహారీ ఆలయం-యూపీ ప్రభుత్వం వివాదంపై జస్టిస్ సూర్యకాంత్, జోయ్‌మాల్యా బాగ్చిలతో కూడిన సుప్రీంకోర్టు ఇలా వ్యాఖ్యానించింది. ' బృందావన్‌లోని బాంకే బిహారీ టెంపుల్‌కు తొలి మధ్యవర్తి శ్రీకృష్ణ భగవానుడే. ఈ వివాదాన్ని మధ్యవర్తిత్వం ద్వారా సెటిల్ చేసుకోండి. సమస్య పరిష్కారం కోసం ఓ కమిటీని ప్రతిపాదిస్తున్నాం. ఆ కమిటీ రాష్ట్ర ప్రభుత్వానికి ఆలయ ట్రస్టు బోర్డుకు మధ్యవర్తిత్వం వహిస్తుంది. గత సుప్రీంకోర్టు తీర్పులో కొంత భాగాన్ని నిలుపుదల చేద్దాం. హైకోర్టు మాజీ న్యాయమూర్తి లేక సీనియర్ రిటైర్డ్ జిల్లా జడ్జి ఇరు పక్షాలకు ధర్మకర్తగా ఉంటారు' అని స్పష్టం చేసింది.

**ఇదీ ఆలయ చరిత్ర..**

1862లో నిర్మించబడిన ఈ ఆలయం రాజస్తానీ శైలిలో నిర్మించబడింది

ఉత్తరప్రదేశ్‌లోని బాంకే బిహారీ ఆలయం బృందావన్‌లో ఉన్న శ్రీకృష్ణ భక్తులకు అత్యంత పవిత్రమైన స్థలాలలో ఒకటి. ఆధ్యాత్మికతతో నిండిన ప్రదేశం.




ఇక్కడ శ్రీ బాంకే బిహారీగా పూజించబడే కృష్ణుడు, బాలరూపంలో దర్శనమిస్తాడు.

ప్రత్యేకత: ఈ ఆలయంలో గంటలు మోగించరు, హారతులు ఇవ్వరు

ఇది భక్తి శ్రద్ధలకు అడ్డురాకుండా ఉండేందుకు అనాదిగా వస్తున్న ఆచారం.

ఏడాదిలో ఒక్కసారి మాత్రమే, అక్షయ తృతీయ రోజున మాత్రమే భక్తులు దేవుని పాదాలను దర్శించగలుగుతారు.

వివాదం ఇలా.. ఆలయ అభివృద్ధికి సంబంధించి యూపీ ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకురావడం ఆలయ ట్రస్ట్ అభ్యంతరం వ్యక్తం చేసింది. తద్వారా సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై గత మే నెలలో సుప్రీంకోర్టు తీర్పును వెలువరిస్తూ.. రూ. 500 కోట్లను కారిడార్ ప్రాజెక్ట్ కింద ఆలయ అభివృద్ధి కోసం వాడుకోవచ్చని స్పష్టం చేసింది.

యూపీ ప్రభుత్వంతో బాంకే బిహారీ టెంపుల్ ట్రస్టు మధ్య వివాదం ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ వివాదానికి కారణం రూ. 500 కోట్ల కారిడార్ ప్రాజెక్ట్. ఆలయ అభివృద్ధి కోసం ప్రభుత్వం ఈ ప్రణాళికను తీసుకురాగా, ఆలయ ట్రస్ట్ దీనిపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. దీనిపై మరోసారి విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు.. గత తీర్పును మౌఖికంగా నిలుపుదల చేస్తూ దీనిపై ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటుకు ప్రతిపాదించింది. దీన్ని హైకోర్టు లేదా, జిల్లా కోర్టు మాజీ జడ్జిల ద్వారా ఓ కమిటీ ఏర్పాటు చేసి మధ్యవర్తిత్వంతో వివాదాన్ని పరిష్కరించడమే సరైన మార్గంగా పేర్కొంది.

**ఆలయ వారసత్వం దెబ్బతింటుందనే..**

యూపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఆలయ అభివృద్ధి-నిధులు ఆర్డినెన్స్‌పై స్థానికంగా తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ఒకవైపు ఆలయ ట్రస్ట్ అభ్యంతరంతో పాటు స్థానిక ప్రజలు కూడా వ్యతిరేకత వ్యక్తం చేశారు. ఆలయ అభివృద్ధి పేరుతో మరమ్మత్తులు చేపడితే ఆలయ వారసత్వం, వాస్తవికత దెబ్బతింటుందని అభిప్రాయం వ్యక్తమైంది. ఇది సున్నితమైన అంశం కావడంతో పాటు ఆధ్యాత్మిక వైభవం, సంప్రదాయాల సమతుల్యతలపై అనేక ప్రశ్నలు లేవనెత్తింది.

# రాహుల్ గాంధీ భారత వ్యతిరేక మనస్తత్వం బయటపడింది

## 'సుప్రీం' మదలింపుపై బీజేపీ నేతల వ్యాఖ్యలు..

కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. లోక్‌సభలో ప్రతిపక్ష నేతను సర్వోన్నత న్యాయస్థానం మందలించింది. నిజమైన భారతదేశ పౌరుడు అయితే ఇలాంటి వ్యాఖ్య చేసి వుండేవారు కాదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. సోషల్ మీడియాకు బదులుగా పార్లమెంట్‌లో ఆయా అంశాలను ఎందుకు మాట్లాడలేదని నిలదీసింది. అయితే, సుప్రీంకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ రాహుల్ గాంధీ నిరాధాఅమైన వాదనలు చేసినందుకు సుప్రీంకోర్టు తీవ్రంగా మందలించిందన్నారు. వేల చదరపు కిలోమీటర్ల మేర భారత భూభాగాన్ని చైనా సైన్యం ఆక్రమించిందని రాహుల్ చేసిన ప్రకటన దేశానికి హానికరమని.. మన సాయుధ దళాల నైతికతను తగ్గిస్తుంద న్నారు. ఇలాంటి నిరాధారమైన ప్రకటనలు చేయొద్దని రాహుల్‌కు విజ్ఞప్తి చేస్తున్నామని.. అయినా తమ మాట వినడం లేదన్నారు. కనీసం సుప్రీంకోర్టు హెచ్చరించినందుకు సంతోషంగా ఉన్నానన్నారు. భారతీయుడిగా రాహుల్ ఇలాంటి వ్యాఖ్యలు చేకూడదని సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యలు చేసిందన్నారు. రాహుల్ గాంధీ భారత వ్యతిరేక మనస్తత్వాన్ని బయటపెట్టుకున్నారని ఆ పార్టీ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా మండిపడ్డారు. సైన్యం ధైర్య సాహసాలు ప్రదర్శించి చైనా సైన్యాన్ని వెనక్కి పంపిస్తే.. చైనా సైన్యం అరుణాచల్ ప్రదేశ్‌లో 2వేల చదరపు కిలోమీటర్ల భారత భూభాగాన్ని ఆక్రమించిందని చెప్పడం సరికాదన్నారు. నిజమైన భారతీయులైతే ఇలాంటి వ్యాఖ్యలు చేసేవారు కాదని



కోర్టు అనడం రాహుల్ గాంధీ విశ్వసనీయతపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయనన్నారు. కాంగ్రెస్ నాయకుడిగా ఎంత పరిణితి చెందిన వారని ఆయన ప్రశ్నించారు. చైనా సైన్యం ఆక్రమించిన రాహుల్ గాంధీ భారత వ్యతిరేక మనస్తత్వాన్ని బయటపెట్టడం ఇదే తొలిసారి కాదని విమర్శించారు. 2020 గల్వాన్ లోయలో జరిగిన ఘర్షణను ఉద్దేశించి రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో చైనా 2వేల చదరపు కిలోమీటర్ల భారత భూభాగాన్ని ఆక్రమించిందని, ప్రధాని నరేంద్ర మోదీ దాన్ని సరెండర్ చేశారని ఆరోపించారు. రాహుల్ చేసిన వ్యాఖ్యలపై 2022 డిసెంబర్‌లో ఉదయ్ శంకర్ శ్రీవాస్తవ అనే వ్యక్తి ఫిర్యాదు చేశాడు. ఆయన బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ మాజీ డైరెక్టర్. సైన్యంపై రాహుల్ గాంధీ అవమానకరమైన వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. అయితే, ఆరోపణలు రాజకీయంగా ప్రేరేపితమి రాహుల్ కొట్టిపడేశారు. ఆ తర్వాత 2023 జనవరిలో జమ్మూకశ్మీర్‌లోని శ్రీనగర్‌లోనూ, చైనా మన భూమిని ఆక్రమించిందని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై రాహుల్ గాంధీకి లక్నో కోర్టు సమన్లు జారీ చేసింది. దాన్ని అలహాబాద్ హైకోర్టు సమర్థించింది. ఆ తీర్పును సవాల్ చేస్తూ రాహుల్ గాంధీ సుప్రీంను ఆశ్రయించారు. రాహుల్‌పై లాయర్ వివేక్ తివారీ కేసు దాఖలు చేశారు. రాహుల్ పిటిషన్‌పై దీనిపై జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఏజీ మసీహ్‌ల బెంచ్ విచారణ జరిపింది.

విచారణ సందర్భంగా రాహుల్ గాంధీ వ్యాఖ్యలను సర్వోన్నత న్యాయస్థానం తప్పుపట్టింది. 2వేల చదరపు కిలోమీటర్ల భూమిని చైనా తీసుకుందని మీరు ఎలా తెలుసుకున్నారని ప్రశ్నించింది? మీరు నిజమైన భారతీయులైతే అలా మాట్లాడరు కదా? అని జస్టిస్ దత్తా ప్రశ్నించారు. మీరు అక్కడ ఉన్నారా? మీ దగ్గర ఏమైనా నమ్మదగిన ఆధారాలు ఉన్నాయా? అంటూ ప్రశ్నలు సంధించారు. రాహుల్ గాంధీ తరపున వాదించిన న్యాయవాది సింఘ్వీ వాదనలు వినిపించారు. ఆయన వ్యాఖ్యలను వక్రీకరించారని, సైన్యాన్ని అవమానించే ఉద్దేశం రాహుల్‌కు లేదని తెలిపారు. ఇరువర్గాల వాదనలు సుప్రీంకోర్టు, పరువు నష్టం కేసుపై స్టే ఇచ్చింది. అయితే, రాహుల్ గాంధీ లాంటి నేతలు జాగ్రత్తగా మాట్లాడాలని కోర్టు హెచ్చరించింది.

# రాష్ట్రపతితో గంటల వ్యవధిలో మోదీ, అమిత్ భేటీలు.. అందుకేనా?

**ఇంటర్నెట్‌డెస్క్:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కేంద్ర హోంమంత్రి అమిత్ షా గంటల వ్యవధిలో ఆదివారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో వేర్వేరుగా రాష్ట్రపతి భవన్‌లో సమావేశమైన సంగతి తెలిసిందే ఈ వరుస భేటీలపై ఎలాంటి అధికారిక ప్రకటనా వెలువడకపోయినప్పటికీ.. పలు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. జమ్మూకశ్మీర్‌కు రాష్ట్రహోదా పునరుద్ధరణ కోసమేనంటూ సోషల్‌మీడియాలో ప్రచారం ఊపందుకుంది. ఆర్టికల్ 370ని రద్దుచేసి ఆరేళ్లు పూర్తవుతున్న తరుణంలో జరిగిన భేటీలతో ఈ తరహా చర్చ మొదలైంది. బ్రిటన్, మాల్దీవుల పర్యటన తర్వాత రాష్ట్రపతి ని ప్రధాని మోదీ కలవడం ఇదే తొలిసారి. తర్వాత కొన్ని గంటలకు తర్వాత అమిత్ షా కూడా ముర్ముతో సమావేశమయ్యారు. హోంమంత్రి తర్వాత జమ్మూకశ్మీర్ నేతలను వచ్చి కలిశారు. జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక హోదాను కల్పించే 370 ఆర్టికల్‌ను కేంద్రం 2019 ఆగస్టు 5న రద్దు చేసింది. ఆ రాష్ట్రాన్ని రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించింది. సరిగ్గా ఆ తేదీకి రెండు రోజుల ముందే ఈ పరిణామాలు చోటుచేసుకోవడం గమనార్హం. కచ్చితమైన గడువు నిర్దేశించనప్పటికీ.. రాష్ట్రహోదా పునరుద్ధరణకు పలుమార్లు ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా ఇద్దరూ హామీ ఇచ్చారు. ఇక, బిహార్ ఓటర్ల జాబితాపై జరుగుతున్న



ప్రత్యేక సమగ్ర సవరణ ప్రత్యేక చర్చ కోసం పార్లమెంటులో విపక్షాలు పట్టుబడుతున్న నేపథ్యంలో అటు ప్రధాని.. ఇటు హోంమంత్రి రాష్ట్రపతిని కలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇదిలా ఉంటే.. జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక హోదా రద్దు రాజ్యాంగబద్ధమేనని 2023లో సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. "అప్పట్లో పరిస్థితుల దృష్ట్యా ఆర్టికల్ 370ని ప్రవేశపెట్టారు. అది తాత్కాలిక ఏర్పాటు మాత్రమే గానీ.. శాశ్వతం కాదు. దాన్ని రద్దు చేసే అధికారం రాష్ట్రపతికి ఉంది" అని స్పష్టం చేసింది. కాగా.. జమ్మూకశ్మీర్ కు గతేడాది జరిగిన ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్‌సీ)-కాంగ్రెస్ కూటమి విజయం సాధించగా.. కేంద్రపాలిత ప్రాంతంగా మారిన జమ్మూకశ్మీర్‌కు తొలి సీఎంగా ఒమర్ అబ్దుల్లా బాధ్యతలు స్వీకరించారు. అప్పటినుంచి రాష్ట్ర హోదా పునరుద్ధరణ కోసం ఆయన డిమాండ్ చేస్తూనే ఉన్నారు. "2014లో మీరు ఇక్కడికి వచ్చినప్పుడు నేను రాష్ట్రానికి సీఎంగా ఉన్నాను. నేను ఇప్పుడు ఒక కేంద్రపాలిత ప్రాంత సీఎంగా డిమోట్ అయ్యాను. అప్పుడు రైల్వేశాఖ సహాయమంత్రిగా ఉన్న వ్యక్తికి.. లెఫ్టినెంట్ గవర్నర్‌గా ప్రమోషన్ వచ్చింది. త్వరలో నాకు ప్రమోషన్ వస్తుందని ఆశిస్తున్నా. దీన్ని సరిదిద్దడానికి ఎక్కువ సమయం పట్టదనుకుంటున్నాను" అని మోదీని ఒమర్ నేరుగా ప్రశ్నించిన సంగతి తెలిసిందే.

## తీవ్ర చిక్కుల్లో అనిల్ అంబానీ




రిలయన్స్ గ్రూప్ అధినేత అనిల్ అంబానీని కష్టాలు వెంటాడుతున్నాయి. మనీలాండరింగ్ కేసులో ఆయనపై దర్యాప్తు చేపట్టిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ).. తాజాగా ఈ కేసులో పలు బ్యాంకులకు నోటీసులు జారీ చేసింది. లోన్ ఫ్రాడ్ కేసుకు సంబధించి పలు వివరాలు కోరింది. వీటిల్లో ఆయన కంపెనీలకు చెందిన రుణ మంజూరు పత్రాలు వంటివి ఉన్నాయి. మొత్తం 12-13 బ్యాంకులకు దర్యాప్తు సంస్థ నుంచి నోటీసులు వెళ్లినట్లు తెలుస్తోంది. వీటిలో వీటిల్లో పబ్లిక్ సెక్టార్‌తోపాటు ప్రైవేటు సెక్టార్ బ్యాంకులు ఉన్నాయి. ఇవి రిలయన్స్ హౌసింగ్ ఫైనాన్స్, రిలయన్స్ కమ్యూనికేషన్స్, రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ వంటి సంస్థలకు భారీగా అప్పులు ఇచ్చాయి. తాజాగా ఈడీ నోటీసులు అందుకొన్న జాబితాలో ఎస్‌బీఐ, యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యూకో బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, సింద్ బ్యాంక్ ఉన్నట్లు జాతీయ మీడియా పేర్కొంది. అనిల్ అంబానీ కంపెనీలకు ఇచ్చిన అప్పుల్లో మొండి బకాయిలుగా మారిన కేసుల్లో కొందరు బ్యాంక్ అధికారులను కూడా ఈడీ ప్రశ్నించే అవకాశం ఉంది. వీరిని లోన్ క్లియరెన్స్‌లకు సంబంధించి అనుసరించిన ప్రాసెస్, రికవరీ చర్యలను అడగనున్నట్లు తెలుస్తోంది. కాగా అనిల్ అంబానీకి చెందిన పలు కంపెనీలు రూ.17,000 కోట్లకు పైగా నిధులను అక్రమంగా తరలించినట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఈడీ దర్యాప్తు చేపట్టింది. ఈ కేసులో ఇటీవల అనిల్ అంబానీకి నోటీసులు ఇవ్వగా తాజాగా మరో ఆరుగురికి కూడా నోటీసులు కూడా ఇచ్చింది. గత వారం రూ.3,000 కోట్ల మనీలాండరింగ్ కేసులో అనిల్ అంబానీ గ్రూప్‌తో సంబంధం ఉన్న పార్థసారధి బిస్వాల్‌ను ఈడీ అరెస్టు చేసింది.

## ఐదేళ్లలో రూ.7.08లక్షల కోట్ల జీఎస్టీ ఎగవేత..



2024-25 ఆర్థిక సంవత్సరం వరకు ఐదు సంవత్సరాల్లో దాదాపు రూ.7.08లక్షల కోట్ల పన్ను ఎగవేతను కేంద్ర జీఎస్టీ ఫీల్డ్ అధికారులు గుర్తించారు. ఇందులో దాదాపు రూ.1.79లక్షల కోట్ల ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ మోసాలు ఉన్నాయని కేంద్రం తెలిపింది. ఆర్థిక సహాయ మంత్రి పంక్ చౌదరి లోక్‌సభలో వివరాలను వెల్లడించారు. డేటా ప్రకారం.. 2024-25 ఆర్థిక సంవత్సరంలోనే రూ.2.23 లక్షలకోట్లకుపైగా జీఎస్టీ ఎగవేతను సీజీఎస్‌టీ ఫీల్డ్ అధికారులు గుర్తించారని, 2025 ఆర్థిక సంవత్సరంలో 30,056 జీఎస్టీ ఎగవేత కేసులను గుర్తించినట్లు ప్రభుత్వం లోక్‌సభకు తెలిపింది. ఇందులో సగానికిపైగా ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌కు సంబంధించినవే ఉన్నాయని పేర్కొంది. ఈ కేసుల్లో రూ.58,772 కోట్ల పన్ను ఎగవేత జరిగిందని.. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.2.30 లక్షల కోట్ల జీఎస్టీ ఎగవేత, 2023 ఆర్థిక సంవత్సరంలో దాదాపుగా రూ.1.32లక్షల కోట్ల జీఎస్టీ ఎగవేతను గుర్తించారని, 2022 ఆర్థిక సంవత్సరంలో రూ.73,238కోట్లు, 2021 ఆర్థిక సంవత్సరంలో రూ.49,384 కోట్ల జీఎస్టీ ఎగవేత జరిగిందని అధికారులు గుర్తించారు. గడిచిన ఐదేళ్లలో సీజీఎస్టీ ఫీల్డ్ అధికారులు రూ.91,370 కేసుల్లో దాదాపు రూ.7.08 లక్షల కోట్ల జీఎస్టీ ఎగవేతను అధికారులు గుర్తించారన్నారు. ఈక ఆలంలో స్వచ్ఛంద డిపాజిట్ల ద్వారా వసూలు చేసిన పన్నులు రూ.1.29 లక్షల కోట్లకుపైగా ఉన్నాయి. 2021 ఆర్థిక సంవత్సరం నుంచి 2025 ఆర్థిక సంవత్సరం మధ్య 44,938 కేసుల్లో దాదాపు రూ.1.79 లక్షల కోట్ల ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పన్ను ఎగవేత వేసినట్లు కేంద్రం తెలిపింది. కేంద్ర ప్రభుత్వం, జీఎస్టీఎన్ పన్ను ఎగువేతను నివారించేందుకు వివిధ చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్రమంత్రి చౌదరి లోక్‌సభలో తెలిపారు. ఈ-ఇన్వాయిస్ ద్వారా డిజిటలైజేషన్, జీఎస్టీ రివ్యూ తదితర చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వం తీసుకునే చర్యలన్నీ పన్ను ఎగవేతదారులను పట్టుకోవడంలో సహాయపడుతాయని చౌదరి లోక్‌సభలో ఓ సభ్యుడు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. సవరించిన అంచనాలతో (%=జు%) పోలిస్తే వాస్తవ నికర కేంద్ర జీఎస్టీ వసూళ్లపై అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ.. 2024-25 ఆర్థిక సంవత్సరంలో నికర సీజీఎస్టీ వసూళ్లు సవరించిన అంచనాలలో 96.7 శాతమని చౌదరి అన్నారు. నికర సీజీఎస్టీలో సీజీఎస్టీ, ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ, పరిహార సెస్ ఉన్నాయని ప్రభుత్వం తెలిపింది. 2025 ఆర్థిక సంవత్సరంలో వాస్తవ వసూళ్లు రూ.10.26 లక్షల కోట్లకుపైగా ఉండగా, సవరించిన అంచనాలు దాదాపు రూ.10.62 లక్షల కోట్లు. 2024 ఆర్థిక సంవత్సరంలో నికర సీజీఎస్టీ వసూళ్లు రూ.9.57 లక్షల కోట్లకుపైగా ఉన్నాయి. సవరించిన అంచనాలు రూ.9.56 లక్షల కోట్లలో 100.1శాతం.

## ఎయిర్ ఇండియా విమానంలో..

## 'దురదృష్టవశాత్తూ' బొద్దింకలు

**న్యూఢిల్లీ:** ఎయిర్ ఇండియా విమానాలు ఏదో కారణంగా తరచూ వార్తల్లో నిలుస్తున్నాయి. తాజాగా శాన్ ఫ్రాన్సిస్కో నుండి కోల్‌కతా మీదుగా ముంబైకి నడిచే ఎయిర్ ఇండియా విమానం ఏ%×%180లో చిన్న చిన్న బొద్దింకలు కనిపించాయని ఇద్దరు ప్రయాణికులు ఫిర్యాదు చేసిన దరిమిలా వాటిని తొలగించినట్లు ఎయిర్‌లైన్ తెలిపింది. ఎయిర్ ఇండియా విమానంలోని ఇద్దరు ప్రయాణికులు తమ సీట్ల వద్ద బొద్దింకలు ఉన్నాయని ఫిర్యాదు చేసిన అనంతరం వారి సీట్లు మార్చామని ఎయిర్ ఇండియా తెలిపింది. 'శాన్ ఫ్రాన్సిస్కో నుండి కోల్‌కతా మీదుగా ముంబైకి వెళ్లే ఏ%×%180 విమానంలో, ఇద్దరు ప్రయాణికులు దురదృష్టవశాత్తూ చిన్న బొద్దింకల కారణంగా ఇబ్బంది పడ్డారు. దీంతో తమ క్యాబిన్ సిబ్బంది ఆ ఇద్దరు ప్రయాణికులను ఇతర సీట్లకు మార్చారు. అక్కడ వారు సౌకర్యవంతంగా కూర్చున్నారు. ఇంధన స్టాప్ సమయంలో, మా గ్రౌండ్ సిబ్బంది వెంటనే శుభ్రపరిచే ప్రక్రియను నిర్వహించారు' అని ఎయిర్ ఇండియా ఒక ప్రకటనలో తెలిపింది. విమానంలో తమ పరిశుభ్రతా చర్యలు కొనసాగుతున్నప్పటికీ, కీటకాలు కొన్నిసార్లు గ్రౌండ్ ఆపరేషన్ల సమయంలో విమానంలోకి ప్రవేశిస్తుంటాయి. ఇటువంటివి జరగకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటామని ఎయిర్‌లైన్ తెలిపింది, ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి హృదయపూర్వకంగా క్షమాపణలు కోరుతున్నామని పేర్కొంది.

## ఓటర్ల జాబితా నుంచి పేర్లను

## ఈసీ తొలగిస్తున్నది: ప్రశాంత్ కిషోర్

**పాట్నా:** ఓటర్ల జాబితా నుంచి ఓటర్ల పేర్లను ఎన్నికల సంఘం (ఈసీ) తొలగిస్తున్నదని జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిషోర్ (%ూత్ఖుంష్ఘుత్ ఖఱంష్ట్రశీ%) ఆరోపించారు. అయితే ఓటర్ జాబితాలో పేర్లు ఉన్న వారు రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, సీఎం నితీశ్ కుమార్‌ను తొలగించడానికి సరిపోతారని అన్నారు. ఆదివారం ఏఎన్‌ఐతో ప్రశాంత్ కిషోర్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్‌పై మండిపడ్డారు. మాట్లాడటానికి ఏ సమస్యలు ఆయనకు కనిపించలేదని, అందుకే ముసాయిదా ఓటర్ల జాబితాలో తన పేరు లేదని తేజస్వీ యాదవ్ అంటున్నారని విమర్శించారు. కాగా, ఓటర్ల జాబితా నుంచి పేర్లను ఈసీ తొలగిస్తున్నదని, ఇందులో ఎలాంటి సందేహం లేదని ప్రశాంత్ కిషోర్ ఆరోపించారు. అయితే ఎంతమంది పేర్లు తొలగిస్తారని ప్రశ్నించారు. అయినప్పటికీ బీహార్‌లో బీజేపీ, నితీశ్ కుమార్‌ను తొలగించడానికి జాబితాలో ఉన్న ఓటర్లు సరిపోతారని తెలిపారు. జాబితాలో పేర్లు లేని వారు ఈసీతో పోరాడుతారని అన్నారు. మరోవైపు ఢిల్లీలో బీహార్ ప్రజలను రాహుల్ గాంధీ 'ఎగతాళి' చేస్తున్నారని ప్రశాంత్ కిషోర్ ఆరోపించారు. అలాగే పలు రాష్ట్రాల్లో బీహారీలపై దాడి జరిగినప్పుడు ఆయన ఖండించకపోగా ఉదాసీనత చూపిస్తున్నారని విమర్శించారు.

సూర్య



# నల్గొండను విద్యా హబ్‌గా తీర్చిదిద్దుతాం

-మొదటిపేజీ తరువాయి

మంత్రి భూమి పూజ నిర్వహించారు.నల్గొండ జిల్లాలోని విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించి చేపట్టిన బృహత్తర పాఠశాల యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాల అని, రాష్ట్రవ్యాప్తంగా రాష్ట్ర ప్రభుత్వం 20,000 కోట్ల రూపాయలతో ఇలాంటి పాఠశాలలను డిజైన్ చేసి నిర్మించనున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రంలోనే నల్గొండ యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాల మొదటిదని ,ఇది రికార్డు కావాలన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ తో పోటీపడి ఈ పాఠశాల నిర్మాణాన్ని అంతకన్నా బాగా తీర్చిదిద్దాలని చెప్పారు. రెసిడెన్షియల్ పాఠశాల పక్కనే మెడికల్ కాలేజ్, నర్సింగ్ కాలేజ్ ఉన్నాయని, నల్గొండ లో అన్ని హంగులతో మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం ఉందని, నల్గొండ జిల్లాను విద్యా హబ్ గా మార్చడానికి కృషి చేస్తున్నామని, ఇందులో భాగంగా మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయంలో ఇటీవలే ఎం ఫార్మసీ ,ఎల్ఎల్ బి కోర్సులు మంజూరు చేయించడం జరిగిందన్నారు. భవిష్యత్తులో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యా సంస్థలను ఏర్పాటు చేసి ఎడ్యుకేషన్ హాబ్ గా తీర్చిదిద్దుతామన్నారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమని, విద్యార్థులు చదువుపైనే దృష్టి సారించాలని, మధ్యలో బడి మానివేయవద్దని అన్నారు. రాష్ట్రంలో సుమారు 30 లక్షల మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలో విద్యనభ్యసిస్తున్నారని, వారందరినీ ఇలాంటి ఉత్తమమైన పాఠశాలల్లో చదివించి వారికి ఇక్కడే ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నామని, విద్య ,ఉపాధిలో తెలంగాణను దేశంలోనే నెంబర్ వన్ స్థానంలోనిలిపేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంతున్నదని తెలిపారు. ప్రస్తుతం నల్గొండలో బాలికలకు ఉద్దేశించి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల మంజూరు కాగా, బాలురకు కూడా ఇలాంటి పాఠశాల నిర్మాణానిక



చర్యలు తీసుకుంటామన్నారు. నాగార్జునసాగర్ శాసనసభ్యులు కుందూరు జయవీర్ రెడ్డి మాట్లాడుతూ తమ నియోజకవర్గం లో కూడా త్వరలోనే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల పనులకు భూమి పూజ చేయనున్నట్లు తెలిపారు.జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ నల్గొండ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను 25 ఎకరాలలో నిర్మించనున్నామని, ఈ పాఠశాలలో మంచి ఫ్యాకల్టీ తో పాటు, అన్ని వెసులుబాట్లు ఉంటాయని, పాఠశాల భవనాలు నిర్మాణం వేగవంతంగా పూర్తి చేసేందుకు అడ్వాన్స్ గా నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. నాగార్జునసాగర్ నియోజకవర్గానికి సంబంధించిన యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలకు మంచి స్థలాన్ని గుర్తించడం జరిగిందని, త్వరలోనే అక్కడ శంకుస్థాపన పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు ప్రొఫెషనల్ గా తయారవ్వడానికి అవకాశం ఉంటుందని, ఈ పాఠసాల విద్యార్థుల జీవితాల్లో ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.టి జి ఈ డబ్ల్యు ఎం ఐ డి సి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బాల ప్రసాద్, నల్గొండ లో నిర్మిస్తున్న యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాల వివరాలను తెలియజేశారు.అదనపు కలెక్టర్లు జె. శ్రీనివాస్ నారాయణ అమిత్, నల్గొండ ఆర్డీవో అశోక్ రెడ్డి, విద్యాశాఖ అధికారి బిక్షపతి, టి జి ఈ డబ్ల్యు ఐ డి సి డి ఈ శైలజ,మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, గుమ్మల మోహన్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

# ప్రపంచ స్థాయి గ్లోబల్ జీసీసీ రాజధానిగా హైదరాబాద్

-మొదటిపేజీ తరువాయి

వన్ ట్రిలియన్ డాలర్ ఎకానమిగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా తాము పనిచేస్తున్నామని ఉద్ఘాటించారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ ఎకానమీగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. ఎలీ లిల్లీ సంస్థ లీడర్ షిప్‌ను, ఉద్యోగులను హైదరాబాద్ నగరానికి సాదరంగా ఆహ్వానం పలుకుతున్నామని వెల్లడించారు. తెలంగాణపై నిరంతర నమ్మకం ఉంచి, అండగా నిలిచి అన్ని విధాలుగా మద్దతు ఇస్తున్నందుకు పారిశ్రామికవేత్తలు–పెట్టుబడిదారులు, ప్రపంచ శ్రేణి కార్పొరేషన్లకు, కంపెనీలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ రోజు ప్రారంభమైన ఎలీ లిల్లీ నూతన కేంద్రం%ా% ఆ సంస్థ గ్లోబల్ కార్యకలాపాలను మరింత వేగవంతం చేయడానికి ఉపయోగపడుతోందని పేర్కొన్నారు. ఈ టెక్నాలజీ, ఇన్నోవేషన్ సెంటర్, ప్రపంచవ్యాప్తంగా రోగులకు పరిష్కారాల కోసం పరిశోధనలో కీలక పాత్ర పోషిస్తోందని వెల్లడించారు సీఎం రేవంత్‌రెడ్డి.

**హైదరాబాద్‌లో టాలెంట్, లీడర్‌షిప్..**

'ఎలీ లిల్లీ సంస్థను హైదరాబాద్ నగరంలో ఏర్పాటు చేయడమంటే ఈ నగరం ఘనతను మీరు ప్రపంచానికి చాటి చెప్పినట్లే. హైదరాబాద్ నగరంలో టాలెంట్, లీడర్‌షిప్, విజన్, మంచి పాలసీ, మౌలిక సదుపాయాలు ఉన్నాయి. అందుకే ఎలీ లిల్లీ లాంటి గ్లోబల్ లీడర్‌కు ఇది అనుకూలమైన కేంద్రంగా మారింది. భారతదేశ లైఫ్ సైన్సెస్ రాజధానిగా హైదరాబాద్ ఇప్పటికే గుర్తింపు పొందింది. 2000కు పైగా లైఫ్ సైన్సెస్ కంపెనీలు ఇక్కడ ఉన్నాయి. 200కు పైగా ప్రఖ్యాత అంతర్జాతీయ సంస్థలు హైదరాబాద్ నగరం నుంచి తమ కార్యకలాపాలను నిర్వహిస్తున్నాయి. భారత్‌లో ఫార్మాస్యూటికల్ ఉత్పత్తిలో సుమారు 40 శాతం తెలంగాణలోనే జరుగుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తి అవుతున్న ప్రతి మూడు టీకాల్లో ఒకటి హైదరాబాద్‌లో అభివృద్ధి చేయడం లేదా తయారవుతుండటం మాకు గర్వకారణం. హైదరాబాద్‌లోని జీనోమ్ వ్యాలీ, భారతదేశంలోని అతిపెద్ద లైఫ్ సైన్సెస్ పరిశోధన – అభివృద్ధి సముదాయంగా నిలిచింది' అని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.



**బయోటెక్నాలజీ సంస్థలకు గమ్యస్థానంగా హైదరాబాద్..**

'ప్రపంచంలోని అగ్రశ్రేణి ఫార్మాస్యూటికల్, బయోటెక్నాలజీ సంస్థల కోసం హైదరాబాద్ అత్యంత ప్రాధాన్యం కలిగిన ప్రపంచ గమ్యస్థానంగా మారింది. ఈరోజు, ఎలీ లిల్లీ సంస్థ రాకతో, లైఫ్ సైన్సెస్ రంగంలో మేము మరో మెట్టుకు చేరుకున్నాం. మధుమేహం, అంకాలజీ, ఇమ్యునాలజీ, న్యూరోసైన్స్ రంగాల్లో ఎలీ లిల్లీ సంస్థ కృషి ఒక గేమ్ ఛేంజర్‌గా నిలిచిపోతుంది. ఎలీ లిల్లీ సంస్థ చేసిన కృషి మిలియన్ల మంది జీవితాలను ప్రభావితం చేయడంతో వారిని రక్షించడానికి తోడ్పడింది. నేను, మా ప్రభుత్వం అన్ని వేళలా మీకు అండగా ఉంటాం. పారదర్శకత, అభివృద్ధి, ఆవిష్కరణ లకు అనువైన వాతావరణం కల్పిస్తాం. హైదరాబాద్‌లో పని చేయబోయే ఎలీ లిల్లీ ఉద్యోగులు.. కేవలం హైదరాబాద్‌లో నివసించడం, పనిచేయడం మాత్రమే కాదు ఇప్పుడు మీరు మా కుటుంబ సభ్యులుగా మారారు. మీరు హైదరాబాద్ నుంచి గ్లోబల్ హెల్త్‌కేర్ భవిష్యత్తును తీర్చిదిద్దనున్నారు. మీ సహకారంతో, తెలంగాణను భారతదేశ లైఫ్ సైన్సెస్ రాజధానిగా మాత్రమే కాకుండా%ా%. ప్రపంచంలో ఆరోగ్య సంరక్షణ ఆవిష్కరణలకు నంబర్ వన్ హబ్‌గా తీర్చిదిద్దుతాం. మనమందరం కలిసి కొత్త ఆవిష్కరణలకు కృషి చేద్దాం, ప్రజల జీవితాలను మారుద్దాం, ప్రపంచ ఆరోగ్య సంరక్షణ భవిష్యత్తును పునర్: నిర్మిద్దాం' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# జూబ్లీహిల్స్ కోసం గులాబీ వ్యూహాలు

-మొదటిపేజీ తరువాయి

దీని తో రాబోయే ఉప ఎన్నికల్లో గెలిచేందుకు ముస్లిం ఓటర్లు కీలకం కావడంతో బీఆర్ఎస్ పార్టీ ఇప్పటికే ఆ ఓట్లపైన దృష్టి సారించింది. 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ తరుపున పోటీ చేసిన అజారుద్దీన్‌కు 1,64,212 ఓట్లు వచ్చాయి. ప్రస్తుతం అధికార కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం పైన దృష్టి పెట్టింది. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ విస్తృతంగా ప్రజల్లోకి వెళ్తున్నారు. సభలు, సమావేశాలను నిర్వహి స్తున్నారు. ఇటు బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ప్రచారం ప్రణాళికలు రచిస్తోంది. ఎమ్మె ల్సీలు దాసోజు శ్రవణ్ కుమార్, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డిలు డివిజన్ల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ముఖ్యనేతలు, కార్యకర్తలతో సమావేశమవుతున్నారు. గులాబీ పార్టీలోని ముస్లిం నేతలకు ఉప ఎన్నికల్లో కీలక బాధ్యతలు అప్పగించే అవకాశాలున్నాయని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. మాజీ డిప్యూటీ సీఎం మహమూద్ అలీ కూడా నియోజకవర్గంలోని ముస్లిం నేతలు, కార్యకర్తలతో సమావేశమవుతున్నారు. ము స్లింలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని, మంత్రి వర్గంలో ముస్లింలకు ప్రాధాన్యత లేదని ప్రసంగాల్లో నేతలు స్ప ష్టం చేస్తున్నారు.కేసీఆర్ హయాంలో ము స్లింల సంక్షేమం కోసం చేపట్టిన పథకాలను వివరిస్తున్నారు. ఇటు బీజేపీ, కాంగ్రెస్ పార్టీ లు రెండు ఒక్కటేనని బీఆర్ఎస్‌ను ఎదుర్కొనేందుకు రెండు పార్టీలు ప్రయత్నిస్తున్నా యని గులాబీ నేతలు చెప్తున్నారు.నియోజకవర్గంలో పార్టీ తరుపున అభ్యర్థి ఎంపికపై ఇప్పటికే పార్టీ అధిష్ఠానం ఓ నిర్ణయానికి వచ్చిందని సమాచారం. అభ్యర్థి ఎంపిక, నియోజకవర్గంలో ప్రజాభిప్రాయం సేకరణ కూడా చేపట్టినట్లుగా పార్టీ వర్గాలు చెప్తున్నాయి. మాగంటి కుటుంబీకుల నుంచే ఎన్నికల బరిలోకి దిగే అవకాశాలున్నట్లు కారు పార్టీ వర్గాలు అంటున్నాయి. దివంగత నేత మాగంటి గోపీనాథ్ సతీమణి సునీత మాగంటి



పేరు ప్రధానంగా వినిపిస్తోంది.జూబ్లీహిల్స్ బై ఎలక్షన్‌లో విజయం సాధించడం ద్వారా క్యాడర్‌లో ఉత్సాహం నింపాలని గులాబీ పార్టీ కార్యాచరణ రూపొందించుకుంటోంది. క్షేత్ర స్థాయిలో ఇప్పటికే పార్టీ ముఖ్యులు పర్యటిస్తూ ప్రచారాన్ని ఉధృతం చేస్తున్నారు.ఎన్నికల షెడ్యూల్ విడుదల కంటే ముందుగానే ప్రచార కార్యక్రమాలను డివిజన్ల వారీగా ఏర్పాటు చేసే ప్రణాళికలు కారు పార్టీ నేతలు రచిస్తున్నారు. ఇటు కేటీఆర్, హరీశ్ రావులు బై ఎలక్షన్ బాధ్యతలు తీసుకొని నియోజకవర్గంలో విస్తృతంగా పర్య టించేలా కార్యక్రమాలను రూపొందించే పనిలో కారు పార్టీ ఉన్నది. కేసీఆర్ కూడా నియోజకవర్గంలో ఒకటి, రెండు భారీ సభలు నిర్వహించే అవకాశాలున్నాయని పార్టీ వర్గాలు అంటున్నాయి.తెలంగాణ భవన్‌లో నియోజకవర్గానికి చెందిన ముఖ్య నేతలు, కార్యకర్తల సమావేశాలు వీలైనన్ని ఎక్కువగా నిర్వహించేందుకు ప్లాన్ చేస్తున్నట్లుగా పార్టీ నేతలు చెప్తున్నారు. దీనిలో భాగంగా ఆదివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశం కేటీఆర్ పాల్గొన్నారు. రాబోయే ఉప ఎన్నికల్లో విజయం సాధించడం ఎంత ముఖ్య మో ఆయన వివరించారు.

## తెలంగాణలో భారీ వర్షాలు..

-మొదటిపేజీ తరువాయి

సముద్రమట్టానికి 3.1 నుంచి 5.8 కిలోమీటర్ల వరకు విస్తరించి ఉందని.. తూర్పు–పశ్చిమ ద్రోణి తూర్పు మధ్య అరేబియా సముద్రం దక్షిణ భాగాల నుంచి దక్షిణ ఇంటీరియర్ కర్నాటక, తమిళనాడు మీదుగా మధ్య బంగాళాఖాతం తీర ప్రాంతంలోని ఉపరితల ఆవర్తనం వరకు కొనసాగుతుందని.. సగటున 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉందని.. ఎత్తుకు వెళ్లే కొద్దీ దక్షిణం వైపు వంగి ఉందని పేర్కొంది. సోమవారం జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల మోస్తరు వర్షాపాతం నమోదయ్యే అవకాశాలున్నాయని చెప్పింది. బుధవారం నాగర్ కర్నూల్, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని తెలిపింది. గురువారం మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో.. శుక్రవారం నల్గొండ, నాగర్ కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది.

## త్వరలో తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు

**హైదరాబాద్:** త్వరలో తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నారు. సోమవారం తెలంగాన కేబినెట్ సమావేశం నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటన అనంతరం అసెంబ్లీని నిర్వహించాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ప్రధానంగా అసెంబ్లీలో కాళేశ్వరం రిపోర్ట్‌పై చర్చించనున్నారు. కాళేశ్వరం నివేదికపై అసెంబ్లీలో చర్చలు అనంతరం దర్యాప్తు సంస్థలకు అప్పగించాలని కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నారు. ప్రధానంగా కాళేశ్వరం కమిషన్ నివేదికపైనే అసెంబ్లీలో చర్చించే అవకాశం ఉంది. కాళేశ్వరంపై అవతవకలపై ఏర్పాటు చేసిన కమిషన్.. తుది నివేదికను కొన్ని రోజుల క్రితం ప్రభుత్వానికి అందించింది. ఈ నేపథ్యంలో నేటి కేబినెట్ సమావేశంలో కూడా దీనిపైనే ప్రధానంగా చర్చించారు. మరోవైపు.. కాళేశ్వరంలో ఎక్కడా అవినీతి జరగలేదని బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారు. డిజైన్‌లో లోపాలు లేవని అంటున్నారు. అది కాంగ్రెస్ కమిసన్ అని వారు విమర్శిస్తున్నారు. వ్యాప్కో సంస్థ సూచనల మేరకు ప్రాజెక్టు నిర్మాణం జరిగినట్టు తెలిపారు. కాగా, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో పార్టీ నేతలు ఈరోజు సమావేశమయ్యారు. ఎర్రవల్లిలోని ఫామ్‌హౌజ్‌లో కేసీఆర్‌తో వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీష్ రావు, జగదీష్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, వేముల ప్రశాంత్ రెడ్డి భేటీ అయ్యారు. ప్రభుత్వానికి కాళేశ్వరం కమిషన్ అందించిన నివేదికపైనే ఈ భేటీలో బీఆర్ఎస్ నేతలు చర్చించినట్లు తెలుస్తోంది.

**కాళేశ్వరం కమిషన్ నివేదికపై చర్చ**

సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన క్యాబినెట్ సమావేశం ముగిసింది. ఈ భేటీలో కాళేశ్వరం కమిషన్ ఇచ్చిన నివేదికపై చర్చ జరిగింది. ప్రాజెక్టుకు సంబంధించి జస్టిస్ పీసీ ఘోష్ ఇచ్చిన నివేదికపై మంత్రివర్గంలో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ప్రభుత్వం నియమించిన అధ్యయన కమిటీ.. 650 పేజీల కాళేశ్వరం నివేదికను 60 పేజీల సారాంశంగా తయారు చేసింది. క్యాబినెట్‌కు సమర్పించిన ఈ సంక్షిప్త నివేదికలో 32 సార్లు కేసీఆర్, 19 సార్లు హరీశ్‌రావు, 5 సార్లు ఈటల రాజేందర్ ప్రస్తావన వచ్చినట్లు సమాచారం.

## అరెస్ట్ చేయొచ్చు..

-మొదటిపేజీ తరువాయి

తీసుకుంటారో వేచి చూద్దామని పార్టీ నేతలతో మాజీ సీఎం కేసీఆర్ పేర్కొన్నారు.

ఇంతకీ ఏం జరిగిందంటే..

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం, సుందిళ్ల, మేడిగడ్డ బ్యారేజీలను నిర్మించారు. అయితే 2023 అక్టోబర్‌లో మేడిగడ్డ బ్యారేజీలోని పిల్లర్లు కుంగాయి. ఇంతలో అసెంబ్లీ ఎన్నికలు వచ్చాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించింది. దీంతో రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం ఏర్పాటైంది. అనంతరం ఈ ప్రాజెక్ట్‌లో చోటు చేసుకున్న అవకతవకలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దాదాపు 15 నెలలపాటు ఈ కమిషన్ విచారణ జరిపింది. చివరకు జులై 31వ తేదీన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్.. తన నివేదికను నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జాకు అందజేసింది. ఆగస్టు 1వ తేదీన పలువురు మంత్రులు, ఉన్నతాధికారులు ఈ నివేదికను సీఎం రేవంత్ రెడ్డికి అందజేశారు. ఈ నివేదికపై ముగ్గురు అధికారులతో ఒక కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ఆదివారం సమావేశమై.. చర్చించింది. ఈ కమిటీ అందించిన నివేదికపై తెలంగాణ సచివాలయంలో ఈ రోజు.. అంటే సోమవారం జరిగిన కేబినెట్ భేటీలో ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. అదీకాక లక్షల కోట్ల రూపాయిలతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించారని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ స్పష్టం చేసింది. ఇంకా చెప్పాలంటే.. ఈ ప్రాజెక్ట్‌కు కర్మ, కర్త, క్రియ అంతా కేసీఆర్ అని చెప్పకనే చెప్పింది. ఈ నేపథ్యంలో కేసీఆర్ పార్టీ అగ్రనేతలో సమావేశమయ్యారు. దాదాపు ఆరు గంటలుగా ఈ సమావేశం జరుగుతోంది. ఈ సమావేశానికి కేటీఆర్, హరీష్ రావు, కేటిఆర్, జగదీష్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డితోపాటు పలువురు పార్టీ ముఖ్య నేతలు హాజరయ్యారు.

**కేసీఆర్ యాగంపై మాజీ మంత్రి కీలక వ్యాఖ్యలు**

ఇంకోవైపు కేసీఆర్ యాగం చేయనున్నారంటూ జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి స్పష్టం చేశారు.

## ఐదు రాష్ట్రాలు బాగుపడేది ఎప్పుడు

**న్యూఢిల్లీ :** బీమార్.. లేదా బీమారీ.. ఈ పదం ఎక్కువగా తెలంగాణలో వాడతారు. ఉర్దూ పదమైన బీమార్ అంటే.. రోగం అని అర్థం. కరలా, ఇతర వ్యాధులు ప్రబలిన సమయంలో దీనిని ఎక్కువగా వాడారు. అయితే ఇప్పుడు ఉత్తరాదికి చెందిన మూడు ఉమ్మడి రాష్ట్రాలను బీమార్ రాష్ట్రాలుగా పిలుస్తున్నారు. బిహార్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలు రాజకీయంగా దేశాన్ని శాసించే స్థాయిలో ఉన్నప్పటికీ, ఆర్థిక, సామాజిక పురోగతిలో వెనుకబడి ఉన్నాయి. అందుకే ఈ రాష్ట్రాలను ఆర్థికవేత్తలు (బీమార్ = అనారోగ్యం) రాష్ట్రాలుగా పేర్కొంటారు, ఇది వీటి అభివృద్ధి స్థాయిని సూచిస్తుంది.బీమార్ రాష్ట్రాలు జనాభా పరంగా దేశంలోనే అత్యధిక భాగాన్ని కలిగి ఉన్నాయి, కానీ ఆర్థిక సూచికల్లో వెనుకబడి ఉన్నాయి. ఈ రాష్ట్రాలలో పేదరికం, నిరుద్యోగం, పోషకాహార లోపం వంటి సమస్యలు ఇప్పటికీ ప్రబలంగా ఉన్నాయి. ఈ రాష్ట్రాలలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య అభివృద్ధి అంతరం ఎక్కువగా ఉంది. పట్టణ కేంద్రాలలో కొంత మెరుగైన సౌకర్యాలు ఉన్నప్పటికీ, గ్రామీణ ప్రాంతాలు ఇప్పటికీ విద్య, ఆరోగ్యం, మౌలిక సదుపాయాల కొరతను ఎదుర్కొంటున్నాయి. ఈ రాష్ట్రాలలో పారిశ్రామికీకరణ స్థాయి తక్కువగా ఉంది. ఈ కారణంగా స్థానికంగా ఉద్యోగ అవకాశాలు పరిమితం, యువత నిరుద్యోగ సమస్యను ఎదుర్కొంటోంది. ఈ రాష్ట్రాలలో మానవాభివృద్ధి సూచిక దేశ సగటు కంటే తక్కువగా ఉంది.బీమార్ రాష్ట్రాలు ఎందుకు ఇప్పటికీ అభివృద్ధిలో వెనుకబడి ఉన్నాయి? దీనికి చారిత్రక, రాజకీయ, మరియు సామాజిక కారణాలు ఉన్నాయి. స్వాతంత్ర్యానంతరం ఈ రాష్ట్రాలలో పెట్టుబడులు, మౌలిక సదుపాయాల అభివృద్ధి పరిమితంగా ఉండటం వల్ల పారిశ్రామికీకరణ వెనుకబడింది. బ్రిటిష్ పాలనలో కూడా ఈ ప్రాంతాలు పెద్దగా అభివృద్ధి చెందలేదు. ఈ రాష్ట్రాలలో గత కొన్ని దశాబ్దాలలో రాజకీయ అస్థిరత, అవినీతి, స్వలాభాపేక్షలు అభివృద్ధి పథకాల అమలును దెబ్బతీశాయి. అధిక జనాభా వృద్ధి రేటు వల్ల విద్య, ఆరోగ్యం, ఉద్యోగ అవకాశాలు అందించడంలో ప్రభుత్వాలు తడబడుతున్నాయి. ఈ రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థ ఇప్పటికీ వ్యవసాయంపై ఆధారపడి ఉంది, కానీ ఆధునిక వ్యవసాయ పద్ధతులు, సాగునీటి సౌకర్యాల కొరత వల్ల ఉత్పాదకత తక్కువగా ఉంది.ఈ బీమార్ రాష్ట్రాల నుంచి దక్షిణ భారత రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు వలసలు గణనీయంగా పెరిగాయి. ఈ వలసలకు ఆర్థిక పరిస్థితి ఒక కీలక కారణం. దక్షిణ రాష్ట్రాలలో ఐటీ, తయారీ, సేవా రంగాలలో ఉద్యోగ అవకాశాలు అధికంగా ఉన్నాయి.

# సంపాదకీయం

## మరో మైలురాయి చేరిన ఇస్రో

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) చరిత్రలో మరో అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. 2025 జూలై 30 బుధవారం సాయంత్రం 5:40 గంటలకు శ్రీహరి కోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం రెండవ లాంచ్ ప్యాడ్ నుండి జీఎస్ఎల్వీ -ఎఫ్16 రాకెట్ విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లింది. ఈ మిషన్ కేవలం భారతదేశ అంతరిక్ష శక్తిని చాటి చెప్పడమే కాకుండా ప్రపంచ శాస్త్రవేత్తల మధ్య సహకారానికి నిదర్శనం. సుమారు 1.5 బిలియన్ అమెరికన్ డాలర్ల అంచనా వ్యయంతో కూడిన ఈ భారీ అంతరిక్ష మిషన్ నాసా, ఇస్రో సంయుక్తంగా పనిచేయడం ద్వారా ఆర్థిక భారాన్ని, సాంకేతిక నష్టాలను పంచుకోవడానికి వీలు కల్పించింది. ఈ రాకెట్ 51.7 మీటర్ల ఎత్తు, సుమారు 420 టన్నుల బరువు కలిగి ఉంది. ఇస్రో చేపట్టిన 18వ జీఎస్ఎల్వీ రాకెట్ ప్రయోగం. పైగా ఇస్రో సొంత క్రయోజెనిక్ ఇంజిన్‌ను ఉపయోగించి చేసిన 12వ ప్రయోగం. సాధారణంగా భూమికి అత్యంత ఎత్తులో ఉండే కక్ష్యలలో ఉపగ్రహాలను ప్రవేశపెట్టడానికి ఉపయోగించే ఈ రాకెట్‌ను ఈ సారి సూర్య సమకాలిక ధ్రువ కక్ష్యలోకి పంపడం ద్వారా ఇస్రో తన సాంకేతిక సామర్థ్యాన్ని ప్రదర్శించింది. ఇది ఏ రకమైన మిషన్లకైనా రాకెట్లను ఉపయోగించగల ఇస్రో నైపుణ్యాన్ని తెలియజేస్తుంది. మూడు దశల ఈ రాకెట్ మొదటి దశ ఘన ఇంధనంతో, రెండవ దశ ద్రవ ఇంధనంతో, మూడవ దశ అధునాతన క్రయోజెనిక్ ఇంజిన్‌తో పనిచేసింది. గతంలో అనేక దేశాలు ఈ సాంకేతికతను భారతదేశంతో పంచుకోవడానికి నిరాకరించాయి. ఈ ఉపగ్రహం సాధారణ ఉపగ్రహంలా కాకుండా ప్రపంచంలోనే మొదటిసారిగా రెండు వేర్వేరు పౌనఃపున్యాలను (ఎల్-బ్యాండ్, ఎస్-బ్యాండ్) ఉపయోగించే రాడార్ వ్యవస్థను కలిగి ఉంది. ఈ రెండు పౌనఃపున్యాల వలన 'నిసార్' మేఘాలను కూడా ఛేదించి పగలు, రాత్రి తేడా లేకుండా భూమిపై, మంచుపై ఉన్న ప్రాంతాలను చాలా స్పష్టంగా చిత్రీకరించగలదు. ఈ మిషన్ ప్రపంచ వ్యాప్తంగా ఎంతో కీలకమైన సమాచారాన్ని అందిస్తుంది. ప్రకృతి వైపరీత్యాలపై విలువైన సమాచారాన్ని అందిస్తుంది. హిమాలయ పర్వతాలలో హిమానీ నదాలు, మంచు పలకల ఆరోగ్యంపై, నీటి లభ్యతను అంచనా వేయడానికి, హిమానీ నద సరస్సుల నుండి వచ్చే వరదలను అంచనా వేయడానికి సహాయపడుతుంది. అడవుల ఆరోగ్యం, వృక్షజాలం, కార్బన్ నిల్వలు, భూమిపై పచ్చదనాన్ని పర్యవేక్షించి వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి సహాయపడుతుంది. ఈ సమాచారాన్ని అందించి ప్రపంచ వ్యాప్తంగా విపత్తు ప్రతిస్పందన ప్రయత్నాలను మెరుగు పరుస్తుంది. ఈ మిషన్, అంతరిక్షంలో అంతర్జాతీయ సహకారానికి బలమైన చిహ్నం. ప్రపంచంలోని రెండు ప్రముఖ అంతరిక్ష సంస్థలు ప్రపంచ సవాళ్లను ఎదుర్కోవడానికి ఎలా కలిసి వచ్చాయో ఇది చూపిస్తుంది. పైగా ప్రపంచ అంతరిక్ష రంగంలో భారతదేశ స్థానాన్ని నమ్మకమైన, సమర్థవంతమైన భాగస్వామిగా బలపరుస్తుంది. గగన్‌యాన్ మానవ అంతరిక్ష ప్రయాణ కార్య క్రమం, భారతీయ అంతరిక్ష కేంద్రం అభివృద్ధి వంటి భవి ష్యత్ ప్రతిష్ఠాత్మక మిషన్లకు మార్గం సుగమం చేస్తుంది. నిసార్ ఉత్పత్తి చేసే డేటా ఉచితంగా అందుబాటులో ఉంటుంది. దీని ప్రయోజనాలు ప్రపంచ వ్యాప్తంగా శాస్త్రవేత్తలు, ప్రభు త్వాలు, విపత్తు నిర్వహణ సంస్థలచే పొందబడతాయి. వాతావరణ మార్పులు, పెరుగుతున్న ప్రకృతి వైపరీత్యాల నేపథ్యంలో 'నిసార్' వంటి మిషన్లు కేవలం శాస్త్రీయ విజయాలు మాత్రమే కాకుండా విధాన నిర్ణయాలు, ప్రమాద అంచనా, ప్రపంచ స్థిరత్వాన్ని పెంపొందించడానికి అనివార్యమైన సాధనాలు..?ఈ మిషన్ విజయవంతం కావడం భారతదేశానికి ఎంతో గర్వించదగిన క్షణం!

# కవితకు జీవశైలి ఇచ్చిన వడ్డేపల్లి



తెలుగు భాషా సాహిత్యంలో గేయ సాహిత్యానికి విలక్షణ శైలి, హృదయాన్ని తాకే భావ వృద్ధి, సంగీతానికి తగిన పద సౌందర్యాన్ని అందించిన అరుదైన రచయిత వడ్డేపల్లి కృష్ణ (ఆగస్టు 5, 1948 – సెప్టెంబర్ 6, 2024). లలిత గీతాల నుంచి భక్తి గీతాల వరకు, జానపద గేయాల నుంచి చలనచిత్ర పాటల దాకా అన్ని రంగాలలో తనదైన ముద్ర వేసిన వారు. ఆయన రచనలు వినిపించడమే కాదు, హృదయాన్ని పరవశింప జేసే శక్తిని కలిగి ఉన్నాయి. 1948 ఆగస్టు 5న ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని సిరిసిల్లలో ఒక చేనేత కుటుంబంలో జన్మించిన వడ్డేపల్లి కృష్ణ గారికి చిన్ననాటి నుంచి సాహిత్యం, సంగీతంపై మక్కువ ఉండేది. తల్లిదండ్రులు లక్ష్మమ్మ, లింగయ్యల అనుసంధానంలో పెరిగిన ఆయన చిన్ననాటి నుంచే కవిత్వానికి ఆకర్షితులయ్యారు. సినారె ప్రభావం స్పష్టంగా కనిపించే ఆయన పదబంధాలు, భావవ్యక్తీకరణ నైపుణ్యం కాలక్రమేణా గేయసాహిత్యానికి సజీవ ముద్రగా మారాయి. 1968లో "ప్రవంతి", "కృష్ణా పత్రిక"లలో పద్యాలు, గేయాలు ప్రచురితమవడం ద్వారా ఆయన రచనా జీవితం మొదలైంది. 'కవికల్యాణం', 'గడ్డిపువ్వు', 'గాంధీ', 'మూడుపూలు ఆరుకాయలు', 'సంక్రాంతి లక్ష్మి', 'స్వదేశీయం', 'వివేకానంద విజయం', 'ఆమ్రపాలి', 'బతుకమ్మ', 'జయజయహే తెలంగాణ', 'రమణీయ రామప్ప' వంటి అనేక సంగీత నృత్యరూపకాలు వ్రాసిన ఆయన, జాతీయ, ప్రాంతీయ నేపథ్యాలను భావప్రధానంగా మలచగల గుణాన్ని కలిగి ఉన్నారు. ఆకాశవాణి ద్వారా ప్రసారమైన ఆయన లలిత గీతాలు సామాన్య శ్రోతల నుండి సాహిత్య ప్రియుల దాకా విశేష ఆదరణ పొందాయి. "ఎందుకో ఈ కల్లలో", "వచ్చే సాయంకాలం మౌనమే పలుకేలా", "తల్లి నీ చూపే దేవుడయ్యేను" వంటి పాటలు శ్రోతల మధుర జ్ఞాపకాల్లో నిలిచి పోయాయి. 'చిత్రాలకు గీతాలు రచించిన ఆయన, చలన చిత్ర గేయ సాహిత్యంలో సాహిత్య విలువను నిలబెట్ట గలిగిన అరుదైన రచయితగా గుర్తింపు పొందారు. ఆయన టెలివిజన్ సీరియల్స్ కూడా రూపొందించారు, వాటిలో "భక్త కవి పోతన", "భారతీయ సంస్కృతి శిఖరాలు" ముఖ్యమైనవి. "గోభాగ్యం" లఘు చిత్రానికి జాతీయ స్థాయిలో స్పెషల్ జ్యూరీ అవార్డు కూడా అందుకున్నారు. అవగాహనతో కూడిన పద వినియోగం, శ్రావ్యమైన పద బలంతో కూడిన రచనలు ఆయన శైలికి ప్రధానంగా నిలిచాయి. ఆయన భక్తి గీతాలు ఆలయాల్లో, భజనల్లో ప్రతిరోజూ వినిపించేవే. ఆయన రచనలు కేవలం వినోదం గానీ, ఆధ్యాత్మిక అనుభూతికే పరిమితం కాకుండా, భావ వ్యక్తీకరణకు, తాత్వికతకు ఆవిష్కారంగా నిలిచాయి. సంగీతం, పద సౌందర్యం రెండింటికీ సమాన ప్రాముఖ్యత ఇస్తూ రచించగల శక్తి ఆయనకు ప్రత్యేకత నిచ్చింది. సాహిత్య సేవలకు గుర్తింపుగా ఆయనకు 'నంది అవార్డు', 'తెలుగు యూనివర్సిటీ గౌరవ సత్కారం', సినారె అవార్డు, మల్లాది స్మారక పురస్కారం, దాశరథి మెమోరియల్ అవార్డు, ఆత్రేయ అవార్డు, వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ పురస్కారం, రవీంద్రభారతి' లో గవర్నర్ సమక్షంలో అక్కినేని నాగేశ్వరరావుచే కవి సత్కారం వంటి అనేక పురస్కారాలు లభించాయి. ఆయనకు "గేయ కిరీటి", "లలితశ్రీ", "కవన ప్రజ్ఞ" వంటి బిరుదులు లభించాయి. నంది అవార్డ్స్ కమిటీ చైర్మన్‌గా, ఇంటర్నేషనల్ చిల్డ్రన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ జ్యూరీ సభ్యునిగా, "పాడుతా తీయగా" లాంటి కార్యక్రమాల జడ్జిగా కూడా ఆయన సేవలు అందించారు. వెయ్యికి పైగా లలిత గీతాలను రచించిన ఆయన, "కరీంనగర్ క్షేత్రాలు" అనే ఆడియో సీడీ ద్వారా భక్తి పరంగా ప్రాంతీయ క్షేత్రాలకు విశిష్టతను చాటారు. "వెలుగుచ్చింది" అనే నాటకంలో తెలంగాణ భాష, యాస పట్ల ఆయనకు ఉన్న మక్కువను చాటి చెప్పారు. తెలంగాణ భూమికి సంగీతార్చనంగా "జయజయహే తెలంగాణ" అనే నృత్యరూపకం ద్వారా తన చారిత్రక భావనను ప్రతిబింబించారు. ఆఖరి దశలో అనారోగ్యంతో బాధ పడుతున్న కృష్ణ హైదరాబాదులోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 2024 సెప్టెంబరు 6న మరణించారు. ఆయన మరణం తెలుగు గేయ సాహిత్య ప్రపంచానికి తీరని లోటు. కానీ ఆయన రచనలు, గీతాలు, పదాల సుగంధం పుస్తకాలుగా, ఆల్బములుగా, జ్ఞాపకాలుగా జీవించి ఉంటాయి. వడ్డేపల్లి కృష్ణ ఒక గేయ రచయితగా మాత్రమే కాక, భావ వేదనకు నిలయమైన కవిగా, సమాజ స్పందనలకు ప్రతిరూపమైన సృజన కర్తగా, సంగీతానికి సాహిత్య గంభీరతను నూరిన ప్రకాశమయమైన ప్రతిభావంతుడిగా నిలిచి పోతారు. ఆయన రచనలన్నీ భావితరాలకు శ్రావ్యమైన ఆదర్శంగా నిలవడం ఖాయం.

# పీఎం ప్రణయ్ పునరుజ్జీవం ఇచ్చేనా?

వ్యవసాయ భూములలో జీవ శక్తి తగ్గిపోతోంది, మట్టిలోని సూక్ష్మ జీవుల ఉనికి క్రమంగా క్షీణిస్తోంది, ఎరువుల ఖర్చులు రైతుకి భారం అవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రకృతికి అనుకూలమైన వ్యవసాయానికి అవసరం పెరిగింది. గత కొంతకాలంగా దేశవ్యాప్తంగా రైతులు అధికంగా రసాయన ఎరువులపై ఆధారపడుతున్నారు. దీని వల్ల పంటల్లో తాత్కాలికంగా దిగుబడి పెరిగినప్పటికీ, మట్టిలో జీవశక్తి తగ్గిపోతోంది. దీర్ఘకాలంగా ఇది మానవ ఆరోగ్యం పైనా ప్రభావం చూపిస్తోంది. అందుకే ప్రత్యామ్నాయ ఎరు వుల వైపు అడుగులు వేయాల్సిన అవసరం ఏర్పడింది. ఆ దిశగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఓ కీలకమైన నిర్ణయమే... ప్రధానమంత్రి ప్రాణమ్ పథకం. 2023 జూన్ 28న కేంద్ర వ్యవసాయ శాఖ ఈ పథకాన్ని ప్రారంభించింది. ముఖ్యంగా ఈ పథకం మూడు ప్రధాన లక్ష్యాలపై దృష్టిపెడుతోంది. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించడంతో పాటు సేంద్రియ, జీవ ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించడం, నేల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం ఈ పథకంలో ముఖ్యమైన అంశం ఇన్‌సెంటివ్ మెకానిజం. అంటే ఏ రాష్ట్రం రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గిస్తే, ఆ రాష్ట్రానికి కేంద్రం ఆదా అయిన సబ్సిడీలో 50% మళ్లీ గ్రాంట్‌గా ఇస్తుంది. అందులో 70% జీవన ఎరువుల మౌలిక సదుపాయాల అభివృద్ధికి, 30% అవగాహన కార్యక్రమాలు, రైతుల శిక్షణకు వినియోగిం చవచ్చు. అంటే దీని ద్వారా రాష్ట్రాలకు ప్రోత్సాహం, రైతులకు ప్రత్యక్ష ప్రయోజనం, ప్రకృతికి రక్షణ అన్నీ సాధ్యపడతాయి. 2024 ఆగస్టు 9 నాటికి అన్ని రాష్ట్రాలు ప్రాణమ్ పథకంలో చేరాయి. గోబర్ధన్ యూనిట్ల నుండి వచ్చే సేంద్రియ ఎరువులకు రూ.1500 టన్నుకు ప్రోత్సాహకం. 2023లో రూ.1451.84 కోట్లు మార్కెట్ అభివృద్ధి సహాయంగా కేటా యించబడ్డాయి. యూరియా గోల్డ్ (సల్ఫర్ కోటెడ్ యూరి యా) లాంటి ఉత్పత్తులు నేల పోషక లోపాలు తీర్చే లక్ష్యంతో తీసుకువచ్చారు. కానీ పథకం విజయవంతం కావాలంటే కొన్ని ప్రశ్నలు ఎదురవుతాయి. అన్ని రాష్ట్రాలు వాస్తవంగా ఎరువుల వినియోగం తగ్గించ గలవా? బయో ఎరువుల సరఫరా, నాణ్యతపై రైతులకు నమ్మ కం ఏర్పడిందా? అంతర్జాతీయ ఎరువుల దిగుమతులపై ఆధా రాన్ని దేశీయంగా తగ్గించగలమా? ఈ అంశాలపై స్పష్టమైన కార్యాచరణ లేకుంటే, ఎంత మంచి పథకం అయినా ఆశిం చిన ఫలితాలు ఇవ్వకపోవచ్చు. పురుగుమందుల వ్యవసాయం అనేది ఫలిత-ఆధారిత ఆహార ఉత్పత్తి వ్యవస్థ, ఇది నేల ఆరోగ్యాన్ని పెంపొందించి వాతావరణం, నీటి వనరులతో పాటు జీవవైవిధ్యాన్ని రక్షిస్తుంది. పొలాల ఉత్పాదకతను లాభదాయకతను పెంచుతుంది. రసాయన ఎరువులపై సబ్సిడీ భారం 2022-23 ఆర్థిక సంవత్సరానికి సుమారు ?2.25 లక్షల కోట్లు ఉండటం గమనించదగ్గ విషయం, ఇది 2021-22 ఆర్థిక సంవత్సరం (?1.62 లక్షల కోట్లు) కంటే 39 శాతం ఎక్కువ. 2012-13 నుండి 2021-22 వరకు నత్రజని ఎరువుల వినియోగం, ముఖ్యంగా యూరియా వినియోగం తగ్గలేదని చూపిస్తుంది. అయితే, సబ్సిడీ బిల్లు గణనీయంగా పెరిగింది. కాబట్టి, ప్రాణమ్‌ను ప్రోత్సహించడం వల్ల ప్రభుత్వం సబ్సిడీ బిల్లులను, ఆర్థిక లోటును తగ్గించడంలో సహాయపడుతుంది. రసాయన ఎరువులపై సబ్సిడీలను క్రమంగా తొలగించడం ప్రత్యామ్నాయ లేదా బయో-ఎరువుల స్వీకరణను ప్రేరేపిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వాలు దీన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలి, రైతులకు ప్రత్యక్ష లాభం కనబడేలా వినియోగం, అవగాహన పెరగాలి. రైతు శిక్షణ కేంద్రాలు, డెమో ప్రాజె క్టులు ఏర్పడాలి. ఐ.ఎఫ్.ఎం.ఎస్, ఈ.ఎఫ్.ఎం.ఎస్ వంటి డిజిటల్ మానిటరింగ్ వ్యవస్థలు సమర్థవంతంగా అమలు కావాలి. రైతు సంఘాలు, స్వచ్ఛంద సేవా సంస్థలు, యువ పారిశ్రామికులు భాగస్వాములుగా మారాలి. ఈ పథకం సేంద్రీయ, ప్రకృతి వ్యవసాయ పునరుజ్జీవానికి ఊపిరినిస్తుం ది. ఇది ఎరువులపై ఆధారపడే వ్యవసాయం నుంచి స్వయం సమృద్ధ వ్యవస్థల వైపు భారత వ్యవసాయం అడుగులు వేయడానికి అవకాశంగా మారాలి. ఇది కేవలం ఒక పథకం మాత్రమే కాదు ప్రకృతితో మానవుని పునఃసంబంధానికి సంకేతం. దీని వలన రైతుకు మేలు జరుగుతుంది, భవిష్యత్తు తరాలకు ఆరోగ్యం లభిస్తుంది. మట్టిలో జీవం ఉంటేనే మానవాళికి జీవితం ఉంటుందనే వాస్తవాన్ని విస్మరించవద్దు.

# మానవతావాది మండలి వెంకట కృష్ణారావు

తెలుగు ప్రజల మధ్య నిస్వార్థత, నిష్పక్షపాత, నిబద్ధత అనే మూడింటి సమ్మేళనంగా వెలిగిన మహా వ్యక్తి మండలి వెంకట కృష్ణారావు. రాజకీయ నాయకుడిగా, సాంస్కృతిక చైతన్యంగా, భాషా సేవకుడిగా, మానవతా దృక్పథంతో జీవించిన వ్యక్తిత్వం అత్యంత విలక్షణమైనది. కృష్ణా జిల్లా అవనిగడ్డ మండలంలోని భోగిరెడ్డిపల్లె గ్రామంలో 1926 ఆగస్టు 4న జన్మించిన ఆయన చిన్ననాటి నుంచే సత్యం, ధర్మం, విద్య, సేవ అనే గుణాల ప్రభావంతో నిర్మాణమైన కుటుంబంలో పెరిగారు. తండ్రి మండలి వెంకట సుబ్బయ్య గ్రామ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేయడం వల్ల విద్యతోపాటు సేవా భావన పట్ల గాఢమైన అభిరుచి పెరిగింది. గ్రామీణ వాతావరణంలో బాల్యం గడిపిన ఆయన చిన్నతనంలోనే తెలుగు భాషపై, సాహిత్యంపై, నాటక కళలపై మక్కువ పెంచుకున్నారు. ప్రాథమిక విద్య తరువాత గుంటూరులో ఆంధ్ర క్రైస్తవ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేసి, ఆంధ్ర విశ్వ విద్యాలయంలో బి.ఎ. ఆనర్స్ (తెలుగు)లో పట్టా సాధించారు. విద్యార్థి దశ నుంచే ఆదరణాత్మక భావజాలంతో సాహిత్య విమర్శ, నాటకరంగం, ప్రజా ఉద్యమాల పట్ల ఆకర్షితుడయ్యారు. స్వాతంత్ర్యానంతర కాలంలో కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజకీయ రంగంలో అడుగుపెట్టి యువ నాయకుడిగా గుర్తింపు పొందిన ఆయన పదవుల కోసం కాక, ప్రజల సంక్షేమాన్ని లక్ష్యంగా చేసుకొని ఆ రాజకీయాన్ని ఓ మార్గంగా మార్చుకున్నారు. 1962, 1967, 1972, 1978 సంవత్సరాలలో వరుసగా నాలుగు సార్లు అవనిగడ్డ శాసనసభ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలవడం ఆయన ప్రజాదరణకు నిదర్శనం. నిస్వార్థ నాయకత్వం, ప్రజల పట్ల ఉన్న అపారమైన అభిమానంతో ఆయన ఆంధ్రప్రదేశ్ శాసనసభలో విలక్షణంగా నిలిచారు. 1972 నుండి 1978 వరకు విద్యా మరియు సాంస్కృతిక శాఖల మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. విద్యాశాఖ మంత్రిగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రమాణాలు మెరుగుపర్చేలా, విద్యా నిధులను పెంచేలా, బోధనా విధానాల్లో మార్పులు చేయడంలో ఆయన గొప్ప శ్రమ చేశారు. గురుకుల విద్యాలయాల స్థాపన, అనాథ బాలబాలికల వసతి గృహాల ఏర్పాటుకు కృషి చేశారు. అంతేకాకుండా పాఠ్య పుస్తకాల్లో తెలుగు మాధుర్యాన్ని పటిష్ఠంగా నిలిపే దిశగా వ్యవస్థాపక చర్యలు చేపట్టారు. సాంస్కృతిక శాఖా మంత్రిగా ఆయన చేసిన సేవలు తెలుగు భాషా సంస్కృతికి చిరస్థాయిగా నిలిచేలా చేశాయి. తెలుగు నిఘంటువుల రూపకల్పనకు ప్రభుత్వం స్థాయిలో ప్రోత్సాహం కల్పించారు. పాఠశాలలలో తెలుగు అభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాలు, నాటక కళల ప్రోత్సాహానికి నిధుల కేటాయింపు వంటి చర్యలు ఆయన కృషిలో భాగం. తెలుగు భాషాభిమానిగా ఆయన చూపిన





తపన అసాధారణమైనది. 1975లో హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభలను విజ్ఞాన, సాంస్కృతిక మహా కార్యక్రమంగా తీర్చిదిద్దిన ఘనత ఆయనదే. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు భాషాభిమానులను ఏకతాటిపైకి తెచ్చిన ఈ మహాసభల అనంతరం స్థాపించబడిన అంతర్జాతీయ తెలుగు కేంద్రానికి ఆయన వ్యవస్థాపక అధ్యక్షుడిగా నియమితులయ్యారు. తెలుగు భాషాభివృద్ధికి ప్రభుత్వం స్థాయిలో కేంద్రాన్ని ఏర్పాటు చేయడం ఆయన దూరదృష్టికి ప్రతీకగా నిలిచింది. ఆయన స్థాపించిన "జగతి" అనే సంస్థ వేదికగా నాటక రంగానికి అపూర్వ సేవలు అందించారు. ఈ వేదికపై ప్రతిభావంతులైన కళాకారులను ప్రోత్సహిస్తూ అనేక నాటక ప్రదర్శనలు నిర్వహించారు. కళ అంటే కేవలం వినోదమేగాక, విలువల బోధనా మాధ్యమమన్న అవగాహనతో ఆయన కళారూపాలను ఎంపిక చేసుకున్నారు. వ్యక్తిగతంగా ఆయన నాటక రచయితగా, ప్రదర్శకునిగా ఎంతో క్రియాశీలకంగా వ్యవహరించారు. సాహిత్యంపై ఆయనకు ఉన్న అవగాహన, భాషాపట్ల ఉన్న ప్రేమ ఆయన రచనల్లో స్పష్టంగా ప్రతిఫలించాయి. "సాహిత్యసేవ", "మాజీమంత్రి ఆత్మకథ" వంటి రచనలు ఆయన అనుభవాల సంకలనం మాత్రమే కాదు, తెలుగు సమాజానికి ఓ దర్పణం. మహా భారతంపై ఆయనకు ఉన్న లోతైన అధ్యయనం ద్వారా ప్రజలకు నైతిక విలువలు బోధించే కార్యక్రమాలు చేపట్టడం మరో విశిష్టత. దేశంలోని అనేక ప్రాంతాల్లో మహాభారతంలోని ధర్మ సిద్ధాంతాలపై ప్రసంగాలు చేశారు. ఆయన ప్రవచనాలలో భాషా మాధుర్యం తోపాటు ప్రజల హృదయాలకు హత్తుకునే శక్తి ఉండేది. అవనిగడ్డ నియోజక వర్గానికి ఆయన చేసిన సేవలు ప్రజల గుండెల్లో చెరిగిపోని గుర్తులుగా నిలిచాయి. విద్యా, నీటి పారుదల, రహదారులు, మత్స్యకారుల అభివృద్ధి వంటి అనేక రంగాల్లో ప్రణాళికా బద్ధంగా పని చేసారు. 1977లో దివి సీమను కుదిపేసిన చాపదిపోటు తుపాను సందర్భంగా సహాయ చర్యలను సమన్వయ పరచడంలో ఆయన పాత్ర అపూర్వమైనది. శాసనసభ లోనే కాక, సహాయక కేంద్రాల్లో, బాధిత ప్రాంతాల్లో ప్రత్యక్షంగా పాల్గొని ఆయన చేసిన సహాయ చర్యలు వేలాది ప్రజల జీవితాలను ప్రభావితం చేశాయి. విపత్తు సమయంలో అధికార వ్యవస్థతో సమన్వయం, ప్రజలలో నమ్మకం, రాజకీయ పార్టీలకు అతీతంగా స్పందించడం ఆయన సేవా ధర్మానికి పరాకాష్ట.ఆయన సేవలకు గుర్తుగా దివి సీమను మెరుగు పరిచే పులిగడ్డ - పెనుమూడి వంతెనకు ఆయన పేరు పెట్టడమే కాక, భవదేవర పల్లిలో "మండలి వెంకట కృష్ణారావు ఫిషరీస్ పాలిటెక్నిక్" స్థాపన ద్వారా మత్స్యకారుల జీవితాల్లో వెలుగును నింపారు. ఆయన కుమారుడు మండలి బుద్ధప్రసాద్ కూడా తండ్రి వారసత్వాన్ని కొనసాగిస్తూ, గాంధేయ వాదంతో కూడిన రాజకీయ జీవితం గడిపారు. 1997 అక్టోబర్ 27న ఆయన పరమ పదించారు. కానీ ఆయన ఆశయాలు, కార్య పద్ధతులు, విలువలు నేటికీ ప్రజల మనసుల్లో స్పష్టంగా ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి. ఆయన జీవితం సంక్షిప్తంగా చెప్పదగినదేమీ కాదు. అది ఒక చరిత్ర, అది ఒక విద్యా పాఠం, అది ఒక సాంస్కృతిక సంజీవని. మండలి వెంకట కృష్ణారావు మనకు చూపిన మార్గం ం ప్రజాసేవ పట్ల అంకిత భావం, భాషపట్ల అభిమానం, సమాజం పట్ల నిబద్ధత కలిగిన జీవన రీతికి ప్రతీక. ఆయన ఆదర్శ జీవితం తెలుగుజాతికి ఒక విలువైన పాఠశాల. ఈ రోజుల్లో సార్థకమైన నాయకత్వం కోసం ఎదురు చూస్తున్న సమాజానికి ఆయన జీవితం ఒక పుట కథ కాదు ం ఒక చరిత్ర గ్రంథం. భావి తరాలకు సందేశం, మార్గదర్శకం.

# ఉద్యాన పంటల పెంపకంతోనే పర్యావరణం మార్పులను తట్టుకోగలం

తక్కువ నీటితో బాగా దిగుబడినిచ్చే ఉద్యాన పంటలపై దృష్టి పెట్టాలి..

పండ్ల తోట్ల సాగుతో పాటు అంతర పంటలు కచ్చితంగా సాగు చేయాలి..

తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ దండా రాజిరెడ్డి







**రాజేంద్రనగర్,ఆగస్టు 04(సూర్యరేఖ)** వేగంగా దూసుకొస్తున్న పర్యావరణ మార్పులు నేపథ్యంలో ఉద్యాన పంటలను విరివిగా పెంచాలని శ్రీకొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ దండా రాజిరెడ్డి అన్నారు. పర్యావరణ మార్పులు,పంటలు సంబంధిత అంశాలపై లోతైన పరిశోధన చేసినందుకుగాను ప్రత్యేక పరిశోధన స్థానం ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నట్టు తెలిపారు.తక్కువ నీటితో బాగా దిగుబడినిచ్చే ఉద్యాన పంటలపై దృష్టి సారించాలన్నారు.వనపర్తి జిల్లా మోజెర్లలోని ఉద్యాన కళాశాలలో పర్యటించిన అనంతరం, అనుబంధంగా ఉన్న మదనాపురంలోని విద్యార్థుల ఉద్యాన బోధన క్షేత్రాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ. పండ్ల తోట్ల సాగుతో పాటు అంతర పంటలు కచ్చితంగా సాగు చేయాలని,అలాగే ఇంకుడు గుంతలను కచ్చితంగా ఏర్పాటు చేసుకుంటే వర్షాభావ పరిస్థితుల్లో తోటలకు నీటిని అందించవచ్చని పేర్కొన్నారు. మెట్ట ఉద్యాన పంటలైన ఉసిరి చింత జామున్ సపోటా వాక్కాయ కుంకుడు దానిమ్మ సీతాఫలం మునగ వాటిపై దృష్టి సారించాలని అన్నారు. తక్కువ కాలంలో కోతకొచ్చే కూరగాయలు ఆకుకూరలు ఏక వార్షిక రకాలు ప్రాంతానికి అనువైన ఔషధ మొక్కలను సైతం సాగు చేసుకోవచ్చని తెలిపారు. సకాలంలో కత్తిరింపులు చేయడం,నీటి సంరక్షణ పద్ధతులు చేపట్టడం ముఖ్యమని తెలిపారు. అందుబాటులో స్థానికంగా లభించే వనరులతో మల్చింగ్ ఏర్పాటు చేస్తే తక్కువ నీటితోనే తోటలు ఎండిపోకుండా చూసుకోవచ్చని వైస్ చాన్సలర్ డాక్టర్ రాజిరెడ్డి అన్నారు.ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్టర్ డాక్టర్ ఏ.భగవాన్,డీన్ డాక్టర్ చీనా,కన్సల్టెంట్ డాక్టర్ కే.వీరాంజనేయులు అసోసియేట్ డీన్ డాక్టర్ పిడిగం సైదయ్య ప్రొఫెసర్లు డాక్టర్ షహనాజ్ డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ శంకర్ స్వామి,డాక్టర్ గౌతమి డాక్టర్ విద్య, భాస్కర్ నవ్య శ్వేత, విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పాయల్ శంకర్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రభు పూజారి..



**నాంపల్లి,హైద్రాబాద్,ఆగస్టు 04(సూర్యరేఖ)** ఆదిలాబాద్ నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ శాసనసభ్యులు పాయల్ శంకర్ ను ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యాలయ సహ కార్యదర్శి ప్రభు పూజారి మర్యాదపూర్వకంగా కలసి హృదయ పూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారిలో బీజేపీ నగర సీనియర్ నాయకులు అర్వన్ కాంత్,తదితరులు ఉన్నారు.

## భాజపా ఇంటింట ప్రచారం..



**కామారెడ్డి,ఆగస్టు 04(సూర్యరేఖ)** ప్రధానమంత్రి నరేంద్రమోడీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి కుటుంబానికి అందించడమే తమ లక్ష్యమని భారతీయ జనతా పార్టీ కామారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి,బిజెపి పార్టీ మాజీ కౌన్సిలర్ కాసర్ల శ్రీనివాస్,లు అన్నారు.కామారెడ్డి జిల్లా కేంద్రంలో సోమవారం భారతీయ జనతా పార్టీ ఇంటింటా ప్రచారం నిర్వహించారు.పలు వార్డుల్లో కేంద్ర ప్రభుత్వ పథకాలపై కరపత్రాలు పంపిణీ చేశారు.ప్రధానమంత్రి మోడీ పాలనలో అన్ని వర్గాల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు అవుతున్నాయని వారు తెలిపారు.ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని వారు కోరారు.రాష్ట్ర పథకాలలో కేంద్ర ప్రభుత్వ వాటా ఉందని వారు తెలిపారు.

## రక్తదానం చేసిన జనసేన కార్యకర్త..



**కామారెడ్డి,ఆగస్టు03( సూర్యరేఖ)** అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరం ఉన్న మహిళకు కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన జనసేన కార్యకర్త శ్రీకాంత్ రక్తదానం చేసి ఆదుకున్నారు. శ్రీకాంత్ ఇప్పటివరకు 10 సార్లు రక్తదానం చేసినట్లు తెలిపారు.రక్తదానం చేయడం వల్ల ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం గుండె సంబంధిత కొలెస్ట్రాల్ క్యాన్సర్ వంటి వ్యాధులు వచ్చే అవకాశాలు తక్కువగా ఉంటాయని శ్రీకాంత్ తెలిపారు.అలాగే ప్రతి మూడు నెలలకు ఒక సారి రక్తదానం చేసి ఒకరి ప్రాణాలను కాపాడాలి ఆయన రక్త దాతలకు పిలుపునిచ్చారు.

# బెల్లంపల్లిలో రేషన్ కార్డులు పంపిణీ





**బెల్లంపల్లి,ఆగస్టు04(సూర్యరేఖ)** బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో లబ్ధిదారులకు రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియను ప్రారంభించారు సోమవారం బెల్లంపల్లి పట్టణంలోని పద్మశాలి భవన్లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో తహశీల్దార్ కృష్ణ రేషన్ కార్డులను అందజేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ గత పది ఏళ్లలో రేషన్ కార్డులు లేక ప్రజలు ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో మండలాధికారులు కాంగ్రెస్ నాయకుడు పోలు శ్రీనివాస్,కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీ తరలి వెళ్లిన మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు



**నిజాంపేట,ఆగస్టు04(సూర్యరేఖ)** తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థ ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలుపడానికి హైదరాబాదులోని చెర్లపల్లి రైల్వే స్టేషన్ నుండి ప్రత్యేక రైల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు తరలి వెళ్లారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ మాట్లాడుతూ... స్థానిక సంస్థనికలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని అసెంబ్లీలో తీర్మానం చేసి పార్లమెంటుకు పంపితే,కేంద్ర ప్రభుత్వం చట్టం చేయకుండా కాలయాపన చేస్తుందని వెంటనే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఢిల్లీలో నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పల్లె రామచందర్ గౌడ్,మాజీ ఎంపీపీ సిద్ధి రాములు, మాజీ సర్పంచ్ బాలయ్య,కాంగ్రెస్ పార్టీ నిజాంపేట మండల అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్,కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు లింగంగౌడ్ బొమ్మెన శ్రీనివాస్, నాలం స్వామిగౌడ్,సుర రాములు,తదితరులు పాల్గొన్నారు

## మిషన్ భగీరథ నీరు సురక్షితం..



**నిజాంపేట,ఆగస్టు 04 (సూర్యరేఖ)** మనిషి ఆరోగ్యానికి మిషన్ భగీరథ నీరు మంచిదని మిషన్ భగీరథ ఏఈ బిక్షపతి అన్నారు. ఈ మేరకు నిజాంపేట మండల కేంద్రంలో సోమవారం మిషన్ భగీరథ తాగునీటి ప్రయోజనాలు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతివారం వాటర్ట్యాం కులను శుద్ధి చేసి బ్లీచింగ్ పౌడర్ వేసి తాగునీటిని పరీక్షిస్తామన్నారు.మిషన్ భగీరథ నీళ్లలో మంచి లవణాలు శాతం మోతాదు ఉండడంతో ఆరోగ్య సమస్యలు తలెత్తమన్నారు. మిషన్ భగీరథ నీరు శ్రేష్టకరమని తెలిపారు.ఈ కార్యక్ర మంలో మిషన్ భగీరథ హెల్పర్ సంగు పరశురాములు,వాటర్మెన్ దేవుని రాజు,తదితరులు పాల్గొన్నారు.

# నగరంలో గ్రామసభ..





**నిజాంపేట,ఆగస్టు04(సూర్యరేఖ)**మండల పరిధిలోని నగరం గ్రామంలో సోమవారం గ్రామ పంచాయతీ అడ్వాన్స్మెంట్ ఇండెక్స్ పై గ్రామ సభ నిర్వహించడం జరిగింది.ఇట్టి గ్రామ సభలో గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న అన్ని లైన్ డిపార్ట్మెంట్స్ వారు వారికి సంబంధించిన 2023-24 డేటాను గ్రామ సభలో చదివి వినిపించారు.అనంతరం వర్షాకాలం దృష్ట్యా మాన్సూన్ హెల్త్ క్యాంప్ ను ఏర్పాటుచేసి బీపీ షుగర్ జ్వరము, మోకాళ్ల నొప్పులు దగ్గు,తదితర వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు అందించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి మొహమ్మద్ ఆరీఫ్ హుస్సేన్ ఏఎన్ఎం నిర్మల ఏంఎల్ హెచ్ పీ సౌజన్య ఆశవర్కర్ స్వప్న అంగన్వాడీ టీచర్ స్వప్న ఉపాధ్యాయులు వెంకటేష్ ఏఈఓ శ్రీలత గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## మహంకాళి ఆలయంలో ఘనంగా వార్షికోత్సవ వేడుకలు..

పూర్ణాహుతి,అన్నదాన కార్యక్రమం

**ఉప్పల్,ఆగస్టు 04 (సూర్యరేఖ)** ఉప్పల్ లోని మహంకాళి ఆలయంమహంకాళి సోదరులు కాలియాల్లో మాత వార్షికోత్సవ సందర్భంగా పూర్ణహుతి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న వార్షిక వేడుకలు ముగిశాయి.వార్షిక వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మహంకాళి నరసింహ మాట్లాడుతూ...అమ్మవారి ఆశీస్సులతో ప్రతి ఏడు వార్షికోత్సవ వేడుక నిర్వహిస్తున్నామని తెలిపారు.గత 26 సంవత్సరాలుగా మహంకాళి దేవాలయ అభివృద్ధి కోసం విశేషంగా కృషి చేశామని తెలిపారు.



# ఉప్పల్ మాల బస్తీ అభివృద్ధికి రూ.కోటి 22 లక్షల నిధులు మంజూరు




**కమ్యూనిటీ హాల్,గ్రేవ్ యార్డ్ నిర్మాణాలకు నిధుల మంజూరు పత్రాలను అందచేసిన రజితాపరమేశ్వర్ రెడ్డి**

**ఉప్పల్,ఆగస్టు 04 (సూర్యరేఖ)** ఉప్పల్ డివిజన్ మాల బస్తీ అభివృద్ధికి మరో సారి భారీగా నిధులు మంజూరు చేయించానని కార్పొరేటర్ మందుముల రజితపరమేశ్వర్ రెడ్డి తెలిపారు. కమ్యూనిటీ హాల్ బ్యాలెన్స్ పనులకు కొరకు రూ.32 లక్షలు,ఎస్సీ,ఎస్టీ శ్మశాన వాటిక అభివృద్ధికి రూ. 90 లక్షల నిధులు మంజూరు అయినట్టుగా చెప్పారు.కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులకు కార్పొరేటర్ రజితరెడ్డి ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పరమేశ్వర్‌రెడ్డి నిధుల మంజూరుకు సంబంధించిన ప్రొసిడింగ్ పత్రాలను అందజేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో ఉప్పల్ డివిజన్‌కు భారీగా నిధులు మంజూరు చేయించాలని ఉప్పల్ కార్పొరేటర్ రజిత రెడ్డి,ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి తెలిపారు.సీఎం రేవంత్ రెడ్డి ఉప్పల్ నియోజకవర్గం అభివృద్ధి కోసం ప్రత్యేకంగా నిధులను కేటాయిస్తున్నట్టుగా చెప్పారు. అందులో భాగంగానే ఉప్పల్ మాలబస్తీ కమ్యూనిటీ హాల్ గ్రేవీ యార్డ్,లకు సైతం నిధుల కేటాయింపు జరిగిందన్నారు.ఇదే తరహాలో ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలలో అభివృద్ధి పనులను చేపడుతున్నట్టుగా తెలిపారు. ఈ కార్యక్రమంలో రఘు సంజీవ వెంకటేష్, రవి నవీన్ శేఖర్ బాబురావు రమేష్ హరిబాబు బాల్‌రాజ్ నర్సింగరావు పద్మారావు రాజు పద్మారావు బాలు సంతోష్ శ్రీనివాస్ నరేష్, ప్రభు వర్ధన్ సుమన్ భాబి ఎన్ఎఫ్ సి రాజు కుమార్ హరికృష్ణ కృష్ణ యాదయ్య ప్రభాకర్ ప్రశాంత్ భాను మురళి అభిలాష్ కన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీలో జరిగే బీసీ రిజర్వేషన్ మహాధర్నాకు తరలి వెళ్లిన కాంగ్రెస్ శ్రేణులు




**ఉప్పల్,ఆగస్టు04(సూర్యరేఖ)** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఢిల్లీలో రెండు శాతం బీసీ రిజర్వేషన్ కోసం బీసీ దీక్ష మహా ధర్నా కార్యక్రమంలో పాల్గొనేందుకు రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్ హైదరాబాద్ నుండి సోమవారం కాంగ్రెస్ శ్రేణులు తరలి వెళ్లారు.కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ జనరల్ సెక్రెటరీ నాగభూషణం,అడమ్ రాజు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జనంపల్లి వెంకటేశ్వర్ రెడ్డి గడ్డం రవికుమార్ బరంపేట కృష్ణ కృష్ణగౌడ్ సంతోష్ గుప్తా రాము ఇతర ముఖ్య నాయకులు ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలు మాట్లాడుతూ. రాష్ట్ర ముఖ్యమంత్రి క్యాబినెట్ నిర్ణయించిన విధంగా బీసీలకు 42శాతం కేంద్ర ప్రభుత్వం అమలు జరిగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.42శాతం బీసీ రిజర్వేషన్ అమలు జరుగుతేనే బీసీలకు సరియైన న్యాయం జరుగుతుందన్నారు. పార్టీలకతీతంగా బీసీ బీసీ వర్గాలన్నీ ముందుకు వచ్చి మహాధర్నాను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. బీసీల ఆత్మగౌరవం కోసం,రాజకీయ అవకాశాల్లో బిసిలకు న్యాయమైన వాటా కోసం కాంగ్రెస్ చేస్తున్న ఈ పోరాటానికి అన్ని వర్గాల ప్రజలు మద్దతు నివ్వాలని కోరారు.

## డివిజన్ లో నెలకొన్న మంచినీటి సమస్యలపై ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకటరావు



**ఉప్పల్,ఆగస్టు04 (సూర్యరేఖ)** ఉప్పల్ (హెచ్ఎమ్డబ్ల్యూఎస్)జలమండలి కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో డివిజన్లోని వాటర్ సమస్యలపై రామంతపూర్ డివిజన్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకటరావు,హెచ్ఎండబ్ల్యూ ఎస్ జి ఎం.సంతోష్ కుమార్ కి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ వాటర్,వాటర్ పొల్యూషన్,లో ప్రెజర్, వాటర్ టైమింగ్ సమస్యలను వారికి తెలియజేయడం జరిగింది.ఈ సందర్భంగా ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా వెంటనే సమస్యలు పరిష్కరించడం జరుగుతుందని జిఎం తెలిపారు.ఈ కార్యక్రమంలో డీజీఎం రజనీకాంత్ రెడ్డి,మేనేజర్ రవీందర్,బండారు వెంకటరావు,తాళ్ల మంగాగౌడ్, సంకూరి కుమారస్వామి ఉలుగొండ నారాయణదాసు,కల్మకళ్ళ లింగం,పడిగం నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలు పై తహసిల్దార్ కు వినతి పత్రం అందించిన బీఆర్ఎస్ నాయకులు



**బెల్లంపల్లి,ఆగస్టు04(సూర్యరేఖ)** బెల్లంపల్లి మండలం ప్రజా ఫిర్యాదుల విభాగంలో భాగంగా బెల్లంపల్లి మండలంలోని 17 గ్రామపంచాయతీలలోపలు సమస్యలపై బెల్లంపల్లి తహసిల్దార్‌కు బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఫిర్యాదు చేశారు.బెల్లంపల్లి మండల బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎంపీపీ పొట్లపల్లి సుభాష్ రావు సర్పంచ్లు తాళ్లపల్లి అశోక్ గౌడ్,కారుకూరి వెంకటేష్,పార్టీ మండల అధ్యక్షుడు సింగం గణేశ్ గౌడ్ నాయకులు రామగౌని అశోక్ గౌడ్,గాజుల వెంకటేష్ గౌడ్ వెంబడి చిరంజీవి జిల్లపల్లి వెంకటస్వామి కోట అశోక్ యాటకారి తిరుపతి,లు తహసిల్దార్‌ను కలిసిన సమస్యలు పరిష్కరించాలని కోరారు. పంచా యతీలలో పారిశుద్ధ్య పనులు జరగడంలేదని మంచినీటి పైపులు లీకై త్రాగునీరు కలుషితం అవుతుందని గ్రామ ప్రత్యేకాధికారులు గ్రామాలను సందర్శించడం లేదని మొరపె ట్టుకున్నారు. ఫాగింగ్ బయోటెక్ స్ప్రే చేయడం లేదని రోడ్లపై నీటినిల్వలు ఏర్పడి దోమలు వృద్ధి చెందుతున్నాయని,వీధి దీపాలు అమర్చడం, పిచ్చిమొక్కలను తొల గించడం పిచ్చి కుక్కల బెడదను తొలగించ డం లేదని తహసిల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. అన్ని సమస్యలు పరిష్కరించాలని ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు కోరారు.

## రూ.70 లక్షలతో బ్యాంక్ కాలనీలో నిర్మిస్తున్న స్ట్రామ్ వాటర్ డ్రైన్ పైప్ లైన్ పనులను

**పర్యవేక్షించిన కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్**



**ఉప్పల్,ఆగస్టు04 (సూర్యరేఖ)** చిల్కానగర్ డివిజన్లోని బ్యాంక్ కాలనీలో రూ.70 లక్షలతో నిర్మిస్తున్న స్ట్రామ్ వాటర్ ట్రేన్ పైప్ లైన్ పనులను డివిజన్ కార్పొరేటర్,జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ సోమవారం అధికారులతో కలిసి పర్యవేక్షించారు.అనంతరం కార్పొరేటర్,ఇంజనీరింగ్ విభాగం అధికారులతో మాట్లాడుతూ...కాంట్రాక్టర్ పనులలో నాణ్యత పాటించే విధంగా ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు దగ్గరుండి పర్యవేక్షించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో బీ ఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్,సీనియర్ నాయకులు ఎదుల కొండల్ రెడ్డి,కోకొండ జగన్ రామాంజనేయులు ముద్దం శ్రీనివాస్ యాదవ్ శ్యామ్ గడ్డ బాలు బంటి గౌడ్,కాలనీ అసోసియేషన్ సభ్యులు గఫూర్ శ్రీనివాస్ సందీప్ రమేష్ మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ నిర్లక్ష్యంతో యూరియా కోసం దుకాణాల వద్ద పడిగాపులు కాస్తున్న రైతన్నలు..

**బిజెపి అనుబంధ కిసాన్ మోర్చా తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు దేవర శ్రీనివాస్.**



**నాంపల్లి,హైద్రాబాద్, ఆగస్టు04 (సూర్యరేఖ)** తెలంగాణరాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో యూరియా కోసం రైతన్నలు దుకాణాల వద్ద పడిగాపులు కాస్తున్నారని బిజెపి అనుబంధ కిసాన్ మోర్చా తెలంగాణ రాష్ట్ర ఉపాధ్య క్షులు దేవర శ్రీనివాస్ కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు.ప్రస్తుత ప్రభుత్వ నిర్లక్ష్యం మూలంగా 70 లక్షల మంది రైతులు రాష్ట్రంలో ఇబ్బందులు పడుతున్నారన్నారు. పొలంలో ఉండాల్సిన రైతన్నలు ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఎరువుల దుకాణాల ముందు పడిగాపులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దళారీలు దాచిన ఎరువులను బహిర్గతం చేసి రైతులకు సరఫరా చెయ్యాలని దేవర శ్రీనివాస్ ప్రభుత్వానికి హితవుపలికారు.

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం ప్రత్యేక రైలులో ఢిల్లీకి..

**జెండా ఊపి రైలును ప్రారంభించిన మీనాక్షి నటరాజన్, మహేష్ కుమార్ గౌడ్,మంత్రులు**





**ఉప్పల్,ఆగస్టు04(సూర్యరేఖ)** రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్ తో కాంగ్రెస్ పార్టీ ఈనెల 7న తలపెట్టిన ఛలో ఢిల్లీ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. చర్లపల్లి రైల్వే స్టేషన్ నుంచి ఏర్పాటు చేసిన ప్రత్యేక రైలును సోమవారం ఏఐసీసీ రాష్ట్ర ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్,టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్,మంత్రులు పొన్నం ప్రభాకర్,వాకిటి శ్రీహరి,మాజీ నగర మేయర్ బొంతు రామ్మోహన్,మేడ్చల్ ఇంచార్జి వజ్రేష్ యాదవ్,లతో పాటు ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి జెండా ఊపి రైలును ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో లింగోజిగూడ,చెర్లపల్లి,కాప్రా కార్పొరేటర్లు ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి,బొంతు శ్రీదేవి స్వర్ణరాజ్ శివమణి,ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డివిజన్ అధ్యక్షులు,కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# సాయినగర్ కాలనీలో పూర్తిస్థాయి డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలి



**కార్పొరేటర్ కు వినతి పత్రం అందజేసిన కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు**

**ఉప్పల్,ఆగస్టు04(సూర్యరేఖ)** సాయినగర్ కాలనీలో పూర్తిస్థాయిలో డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని కోరుతూ సాయినగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు నాచారం కార్పొరేటర్ శాంతి సాజన్ శేఖర్,కు వినతి పత్రం అందజేశారు.సాయినగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులు పూర్తి అయ్యాయి.నాచారం మెయిన్ రోడ్డు నుండి చంద్రగ్రాండ్ హోటల్ పక్కనుండి ఇదివరకు ఉన్న ఓపెన్ నాలా గుండా సాయినగర్ కాలనీలోనికి వర్షపు నీరు మరియు డ్రైనేజీ నీరు వస్తుంది.ఇందులో సగం కంటే ఎక్కువ శాతం డ్రైనేజీ నిర్మాణం చేయడం జరిగింది.ఇంకా కొంత మిగిలి ఉండడంతో డ్రైనేజీలు నిండి ఇళ్లల్లోకి నీళు వస్తున్నాయని మిగిలిన సుమారు 50 మీటర్లు కూడా డ్రైనేజీ నిర్మించాలని కాలనీ ప్రతినిధులు సోమవారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ ను కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. సానుకూలంగా స్పందించిన కార్పొరేటర్ జలమండలి డీజీఎం సతీష్ తో మాట్లాడి మిగిలిన డ్రైనేజీ నిర్మించాలని సూచించడం జరిగింది. తప్పకుండా చేస్తానని డీజీఎం హామీ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో సాయినగర్ కాలనీప్రెసిడెంట్ ఎంఏ.రవూఫ్ జనరల్ సెక్రెటరీ శ్రీనివాస్ వైస్ ప్రెసిడెంట్ మధు కోశాధికారి రాజా వెంకటేశ్వర్రావు అక్బర్ నవీన్ సునీల్ రాజు సుధాకర్ చారీ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మల్లాపూర్ బోనాల జాతర





**పలు పలహార బండ్ల ఊరేగింపులో పాల్గొన్న నెమలి అనిల్ కుమార్**

**ఉప్పల్,ఆగస్టు04(సూర్యరేఖ)** మల్లాపూర్ లో బోనాల పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి. పలు ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీఅమ్మవారి పలహార బండ్ల ఊరేగింపు కార్యక్రమాల్లో గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఓల్డ్ మల్లాపూర్ శాంతియూత్ క్లబ్ ఎస్ వి.శశిధర్ మల్లిఖార్జున నగర్ కాలనీలో అసోసియేషన్ అధ్యక్షులు పరమేశ్వర్ రెడ్డి, అన్నపూర్ణకాలనీలో మాతా యూత్ అసోసియేషన్ సూర్య,ల ఆధ్వర్యంలో ఘనంగా పలహార బండ్ల ఊరేగింపులు నిర్వహించారు.

### సింగరేణి పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 7న తక్షణ ప్రవేశం



**మందమర్రి,ఆగస్టు 04(సూర్యరేఖ)** సిసిసి నస్పూర్ సింగరేణి కాలరీస్ పాలిటెక్నిక్ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను సింగరేణి కోటాలో మిగిలిన 66 సీట్లకు ఈ నెల 7వ తేదీన కౌన్సిలింగ్ నిర్వహించి తక్షణ ప్రవేశ అవకాశం (స్పాట్ అడ్మిషన్స్) కల్పిస్తున్నట్లు సింగరేణి కాలరీస్ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.సివిల్-27,ఎలక్ట్రికల్ ఎలక్ట్రానిక్స్ -6, మెకానికల్-23,మైనింగ్-10 సింగరేణి పాలిటెక్నిక్ కళాశాలలో సీట్లు ఖాళీగా ఉన్నాయని ప్రభుత్వ అదేశాను సారం కన్వీనర్ కోటాలో మిగిలి ఉన్న సీట్లకు గురువారం కౌన్సిలింగ్ నిర్వహించి తక్షణ ప్రవేశం కల్పిస్తామని తెలిపారు.ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరచుకోవాలని సూచించారు.ఇతర కాలేజీలలో సీటు పొందిన విద్యార్థులు సీటు రద్దు చేసుకొని రావాలని,లేని పక్షంలో సీటు కేటాయించబడదని స్పష్టం చేశారు.రిజిస్ట్రేషన్ ఇతర వివరముల కొరకు సందర్శించగలరని,స్పాట్ అడ్మిషన్స్ కు పాలిసెట్ 2025లో ఉత్తీర్ణత పొందిన విద్యార్థులతో సీట్లను భర్తీ చేయబడునని తెలిపారు.ఏమైనా అనుమానాలను నివృత్తి చేసుకునేందుకు కాలేజీ ఫోన్ నెంబర్లు 9010222161, 8332974597,8790112515గల నెంబర్లలలో ఉదయం 9 గం.ల నుండి సాయంత్రం 5 గం.ల వరకు సంప్రదించాలని సింగరేణి కాలరీస్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ తెలియజేశారు

## అసెంబ్లీకి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు





**ఎమ్మెల్యేలతో కలిసి పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**ఉప్పల్,ఆగస్టు04(సూర్యరేఖ)**ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల అంశంలో సుప్రీంకోర్టు ఆదేశాలపై అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్,ను కలిసేందుకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో పాటు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అసెంబ్లీకి వెళ్లారు.పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హతపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని స్పీకర్ ను వారు కోరనున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలను పాటించాలని స్పీకర్ కు విజ్ఞప్తి చేయనున్నారు.స్పీకర్ అందుబాటులో లేకపోవడంతో గాంధీ విగ్రహానికి లేటర్ అందజేశారు.

## చిన్న శంకర్‌పల్లి శ్రీరాజరాజేశ్వర ఆలయంలో భక్తుల ప్రత్యేక పూజలు



**శంకర్‌పల్లి,ఆగస్టు04 (సూర్య రేఖ)**శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని ఆరవ వార్డులోని శ్రీరాజరాజేశ్వర ఆలయంలో శ్రావణమాసం రెండవ సోమ వారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు చేశారు.తెల్లవారు జామున నాలుగు గంటల నుండి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం ఆలయ ఆవరణలో భజన మండలి సభ్యులచే భజన కార్యక్రమం జరిగింది.భక్తులకు బద్దం సత్తిరెడ్డి దంపతులు అన్నదానం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు మడపతి నాగరాజు మాట్లాడుతూ...ఆలయంలో ఉన్న స్వామి అమ్మవార్లు మహిమగల వారిని,కోరిన కోరికలు తీర్చే కొంగు బంగారం అని తెలియజేశారు. అన్నదానం నిర్వహించిన దంపతులకు ఆలయ నిర్వాహకులు స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి,స్వామివారి చిత్రపటాన్ని బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును అందజేసిన బీఆర్ఎస్ నేత పిల్లి నాగరాజు



**ఉప్పల్,ఆగస్టు04 (సూర్యరేఖ)** ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి ఆదేశాలమేరకు ఉప్పల్ డివిజన్ చెందిన మణికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన రూ 60 వేల చెక్ ను ఉప్పల్ డివిజన్ సీనియర్ నాయకులు పిల్లి నాగరాజు చేతుల మీదుగా చెక్ ను మణి కుటుంబ సభ్యులకు సోమవారం అందజేశారు.ముఖ్యమంత్రి సహాయ నిధికి ఎవరైనా దరఖాస్తు చేసి ఉంటే ఆలస్యమైతే ఎమ్మెల్యే బండారి లక్ష్మిరెడ్డి దృష్టికి తీసుకువస్తే వెంటనే మంజూరు చేయిస్తారని పిల్లి నాగరాజు తెలిపారు.ఆపదలో ఉండి ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకునే వారు తమ దృష్టికి తీసుకువస్తే తగిన సహాయ సహకారాలు అందజేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు భాషపల్లి నిరంజన్ చారి,కడిగే శేఖర్,ఏమండ్ల రామ్ రెడ్డి,బందారం రాఘవేందర్,లింగంపల్లి ప్రభాకర్, తదితరులు ఉన్నారు.

### వరి పొలంలో కీటకాలు,కలుపు మొక్కల నియంత్రణకు గట్లను కత్తిరించాలి..

**వ్యవసాయ విస్తరణ అధికారి ముత్యం తిరుపతి**



**మందమర్రి,ఆగస్టు04(సూర్యరేఖ)**వరి సాగులో సరైన సమయం,సరైన పద్ధతిలో గట్లను ఇరువైపులా కత్తిరించడం ద్వారా కీటకాలకు ఆశ్రయమిచ్చే కలుపు మొక్కల పెరుగుదలను నియంత్రించవచ్చని పొలంలో నాట్లు వేసే సమయంలో తగిన యాజమాన్య పద్ధతులు పాటిస్తే సిరుల పంటలు పండించవచ్చని మండల వ్యవసాయ విస్తరణ అధికారి ముత్యం తిరుపతి తెలిపారు.మందమర్రి మండలంలోని ఆదిల్ పేట గ్రామంలోని వ్యవసాయ పొలాలను సోమవారం పరిశీలించారు. అనంతరం ఆయన రైతులకు ఇరువైపులా గట్ల కత్తిరింపుపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గట్లలో కలుపు మొక్కలు,ఇతర కీటకాలు తెగుళ్లు దాగి ఉంటాయని,వాటిని ఆదిలోనే కత్తిరించడం ద్వారా కలుపు మొక్కల పెరుగుదలను తెగుళ్ల నివారణను నివారించవచ్చని తెలిపారు.పొలంలో నీరు సులభంగా ప్రవహించి పంట ఎదుగుదలకు సహాయపడుతుందని అన్నారు.పొలం గట్లు సైజులలో పెద్దగా ఉండడం ద్వారా ఎలుకలు ఆవాసం ఏర్పరచుకొని పంటకు నష్టం కలిగిస్థాయన్నారు. గట్లను కత్తిరించే సమయంలో బురద మట్టిని గట్టుపైనే వేయడం ద్వారా పొలం గట్లపై పెరిగే వివిధ రకాల కలుపు మొక్కల ఎదుగుదలను అడ్డుకొని తద్వారా చీడపీడల బెడదను పొలంలో తగ్గించుకోవచ్చని తెలిపారు.ముఖ్యంగా వరిలో గడ్డి చిలక కీటకము తన కున్న తొండం వంటి నిర్మాణాన్ని పొలం గట్టులోకి చొప్పించి గుడ్లు పెడుతుందని,గుడ్లు కీటకాలుగా మారి వరిపై ఆశించి పంట నష్టాన్ని కలుగజేస్తాయన్నారు.విత్తనాలు నాటిన తర్వాత పంట కోతకు ముందు గట్లను కత్తిరించడం ద్వారా మెరుగైన దిగుబడిని పెంచవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు కొట్రంగి శ్రీనివాస్,వ్యవసాయ కూలీలు పాల్గొన్నారు.

### పార్టీకోసం అహర్నిశలు పనిచేసిన వారిని గుర్తించి సముచిత స్థానం కల్పించండి..

**కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి జమాల్పూర్ బందులాల్ బందులాల్**



**నాంపల్లి,హైద్రాబాద్,ఆగస్టు04(సూర్యరేఖ)** తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని పటిష్ట పరచడానికి అహర్నిశలు కృషి చేసిన వారి సేవలను గుర్తించాలని కోరుతూ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు,ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్,ను పార్టీ నాయకులతో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి జమాల్పూర్ బందులాల్ మర్యాద పూర్వకంగా కలిసి కాంగ్రెస్ ప్రభుత్వంలో సముచిత స్థానం కల్పించాలని కోరుతు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా లంగర్ హౌస్ లో నిర్వహించిన సమావేశంలో జమాల్ పూర్ బందులాల్ మాట్లాడుతూ...పార్టీని నమ్ముకుని అహర్నిశలు పని చేస్తున్న నాయకులకు తగిన గుర్తింపు నిచ్చి సముచిత స్థానం (పదవులు) కేటాయించాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు శ్రీనివాస్,కృష్ణ కుమార్,తదితరులు పాల్గొన్నారు.

# అందరి చూపు కామారెడ్డి వైపు

**త్రిబుల్ ఆర్ రోడ్డు నిర్మాణానికి కేంద్రం అనుమతి..**

**జోరందుకున్న రియల్ ఎస్టేట్ వ్యాపారం..**



**కామారెడ్డి,ఆగస్టు04(సూర్యరేఖ)**భూమిని నమ్ముకుని నష్టపోయిన వాడు లేడు అనే నానుడి రాష్ట్రంలో పెద్దలు చెప్తుంటారు ఎందుకంటే ప్రపంచంలో కొత్తగా సృష్టించలేని పరిమిత వనరుల్లో భూమి కూడా ఒకటి,అందుకే సంతింటి కళ ఉన్న చాలామంది దానికోసం రాత్రింబవళ్లు కష్టపడడంతో పాటు సరైన చోట కొనుగోలు చేస్తే దాని విలువ పెరుగుతుందని చాలామంది భావిస్తుంటారు.అయితే ప్రస్తుత ఉద్యోగ,ఉపాధి అవసరాల,విద్యా ప్రయోజనాల దృష్ట్యా ఎక్కువగా నగరాల బాట పడుతున్నారు.నగరాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం కొనసాగుతుంది.అందులో కామారెడ్డి జిల్లా కేంద్రం ఒకటి,ప్రశాంతమైన వాతావరణం దీనికి తోడు రైలు మార్గం హైదరాబాద్ తరహా కార్పొరేట్ హాస్పిటల్లో కార్పొరేట్ విద్యాసంస్థలు,నాలుగు జిల్లాలు సరిహద్దు ఉండడం కామారెడ్డి జిల్లా కేంద్రం నలువైపులా విస్తరించడంతో వ్యాపారస్తులు పెట్టుబడిదారుల కన్ను కామారెడ్డి జిల్లాపై పడింది.జిల్లా కేంద్రంలో ఒకవైపు మెడికల్ కాలేజ్ ఒకవైపు దేవునిపల్లి లింగాపూర్ కృష్ణాజీవాడి వరకు కొత్త వెంచర్లు గ్రేటర్ కమ్యూనిటీ హాల్ విల్లాస్ నిర్మాణాలు జోరందుకున్నాయి.దేవునిపల్లి లింగాపూర్, కృష్ణాజివాడి గత సంవత్సరం కింద గజానికి పదివేల రూపాయలు వరకు ఉన్న రేటు ఇప్పుడు 30 నుండి 40వేలు వరకు గజానికి పలుకుతుంది. అంటే ఎంత అభివృద్ధి చెందుతుందో అర్థం చేసుకోవచ్చు.. మరోవైపు నిజామాబాద్ రోడ్ హైదరాబాద్ రోడ్డులకు ప్రభుత్వ ఇంటర్నేషనల్ స్కూల్ జంగంపల్లి వద్ద ఏర్పాటు చేయటానికి ప్రభుత్వం నిర్ణయించడంతో పాటు పారిశ్రామికంగా హిందుస్థాన్ లివర్ ఆయిల్ కంపెనీ వస్తున్నడంతో పెట్టుబడుదారులు వస్తున్నారు. కొత్తగా దేవునిపల్లి రామారెడ్డి రోడ్డు టేక్రియాల్ కలెక్టర్ ఆఫీస్ సమీపంలో కొత్త వెంచర్లు ఏర్పాటుకు హైదరాబాద్ బెంగళూరు పట్టణాల నుంచి పెట్టుబడుదారులు వచ్చి కొత్త వెంచర్లు ఏర్పాటు చేసి వ్యాపారం కొనసాగిస్తున్నారు. రామారెడ్డి రోడ్ లో కొత్తగా ఇస్కాన్ టెంపుల్ క్రేడా భవనం మరియు ఏసీ ఫంక్షన్ హాల్ పేపర్ కంపెనీ ఏర్పాటుకు పనులు ప్రారంభంకావడంతో ఆ ప్రాంతంలో వ్యాపారం జోరందుకున్నాయి. కామారెడ్డి జిల్లా కేంద్రానికి 50 కిలోమీటర్ల త్రిబుల్ ఆర్ రోడ్డు నిర్మాణానికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనుమతి ఇవ్వడంతో కామారెడ్డి ప్రాంతంలో ప్రశాంత జీవనం గడపాలని ఉద్యోగులు వ్యాపారస్తులు ఎకరం భూమి కొనుక్కొని అందులో ఫామ్ హౌస్ నిర్మించుకుంటున్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రం నుండి రాష్ట్ర రాజధానికి గంటలో వెళ్లి వచ్చి సౌకర్యం కలగనుంది కామారెడ్డి జిల్లాలో సోలార్ ప్లాంట్లు రైస్ మిల్లులు కొత్తగా ఏర్పాటు చేసి వ్యాపారాలు కొనసాగిస్తున్నారు కామారెడ్డి పట్టణం వేగంగా విస్తరించి ఉండటంతో పట్టణంలోని అపార్ట్మెంట్ ఫ్లాట్స్ 50 లక్షల నుండి కోటి రూపాయల పైనే పలుకుతున్నాయి. కామారెడ్డి రూరల్ గ్రామాలలో భూముల రేటు కోటికి పైన పలుకుతుంది.లింగాపూర్ శివారులో మూడు లక్షల గుంట ధర పలుకుతోంది. దీంతో కామారెడ్డి జిల్లాలో ఒక్కసారిగా రియల్ ఎస్టేట్ ఊపందుకుంది.భూముల విక్రయాలలో మోసాలు జరగకుండా నిఘా ఏర్పాటు చేశారు.కామారెడ్డి జిల్లా కేంద్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన వెంచర్ల మరియు వ్యవసాయ భూముల విక్రయాలలో ఎలాంటి మోసాలు జరగకుండా క్రెడా సంస్థ ఆధ్వర్యంలో నిఘా ఏర్పాటు చేశారు.క్రెడా అధ్యక్షులు లక్ష్మీ నరసింహ గౌడ్ తెలిపారు. నిబంధన ప్రకారం వెంచర్లు ఏర్పాటు అవుతున్నాయా లేదా అని నిత్యం అధికారులను కలిసి పర్యవేక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వా నిబంధనలు ప్రకారం వెంచర్ల ఏర్పాటు చేసి ఎలాంటి మోసాలు జరగకుండా క్రెడా సంస్థ అధ్యక్ష మరియు పాలకవర్గం అనునిత్యం వాస్తవాలు తెలుసుకొని ప్రజలకు న్యాయం చేస్తున్నామని వారు తెలిపారు.

## రాష్ట్ర స్థాయిలో ఉత్తమ పోలీస్ డాగ్ గా రామగుండం పోలీస్ కమీషనరేట్ నార్కోటిక్ డాగ్ "సింబా"ఎంపిక..

**బంగారు పతకం సాధించిన సింబాకు సిపి అభినందనలు..**



**రామగుండం,ఆగస్టు04(సూర్యరేఖ)**వరంగల్ జిల్లా మమునూరు పిటిసిలో జరిగిన తెలంగాణ రాష్ట్ర రెండవ పోలీస్ డ్యూటీ మీట్ లో కాళేశ్వరం జోన్ నుండి నార్కోటిక్ డాగ్ విభాగం పోటీలో పాల్గొనీ గంజాయి,మత్తు పదార్థాలను గుర్తించడంలో పోలీసు జాగిలం సింబా,డాగ్ హ్యాండ్లర్ ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ ఎం.వేణుగోపాల్ కృష్ణ గోల్డ్ మెడల్ సాధించడం జరిగింది.అదేవిదంగా రాష్ట్ర స్థాయిలో ఉత్తమ పోలీస్ డాగ్ గా "సింబా" ఎంపిక కావడం జరిగింది.సోమవారం రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా తమ కార్యాలయం లో నార్కోటిక్ డాగ్ సింబా,డాగ్ హాండ్లర్,ను అభినందనచడం జరిగింది.2026 సంవత్సరం ఫిబ్రవరిలో పూణేలో జరిగే నేషనల్ పోలీసు డ్యూటీ మీట్ లో పాల్గొని మరిన్ని పతకాలు సాధించాలని తెలంగాణ రాష్ట్రానికి,రామగుండం పోలీస్ కమీషనరేట్,కి మంచి పేరు తీసుకురావాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మంచిర్యాల డిసిపి ఏ. భాస్కర్,పెద్దపల్లి డిసిపి పి.కరుణాకర్,ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాస్,ఏఆర్ ఏ.సిపి.ప్రతాప్,ఆర్ఐ,లు దామోదర్, శ్రీనివాస్ వామన మూర్తి సంపత్,మల్లేశం,తదితరులు పాల్గొన్నారు.

## అర్జీల పరిష్కారం సత్వరమే పూర్తి చేయాలి..

**అదనపు కలెక్టర్ డి.వేణు**



**పెద్దపల్లి,ఆగస్టు 04(సూర్యరేఖ)** అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ డి.వేణు సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని సమికృత జిల్లా కలెక్టరేట్లో ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా కలెక్టర్ దరఖాస్తులను స్వీకరించారు.ఈ ప్రజావాణిలో జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

## ప్రజల భద్రతే లక్ష్యం..నేరాల నియంత్రణే ధ్యేయం

**ముత్తారం ఎస్సై ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ఫోగ్రాం..**

**ఎస్సై గోపతి నరేష్**



**ముత్తారం,ఆగస్టు04(సూర్యరేఖ)** పౌరుల రక్షణ భద్రతే పోలీసుల ప్రథమ కర్తవ్యమని, శాంతి భద్రతల పరిరక్షణ,నేరాల నిర్మూలనే ధ్యేయంగా పనిచేస్తున్నామని ముత్తారం ఎస్సై గోపతి నరేష్ అన్నారు.ముత్తారం మండల కేంద్రంలోని చౌరస్తాలో ఎస్సై నరేష్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్సై ప్రజలతో మాట్లాడుతూ...గ్రామంలో ఉన్న శాంతి భద్రతల గురించి తెలుసుకున్నారు..ప్రజలకు అత్యవసర సమయంలో పోలీస్ సహాయం పొందాలని భావించినప్పుడు డయల్ 100కు కాల్ చేయలని,దగ్గరలో ఉన్న బ్లూ కోల్ట్స్ సిబ్బంది నిమిషాల వ్యవధిలోని వచ్చి తగు చర్యలు తీసుకోవటం జరుగుతుందని తెలిపారు. వాహన దారులు తప్పని సరిగా ట్రాఫిక్ నియమాలు పాటించాలని,చిన్న చిన్న రోడ్డు సేఫ్టీ నియమాలు పాటించకపోవడం వల్ల చాలా మంది ప్రాణాలు కోల్పోయి కుటుంబాలను చిన్నాభిన్నం చేసుకుంటున్నాని తెలిపారు.ఎవరైనా సైబర్ నేరాలకు గురైనప్పుడు వెంటనే 1930కు సమచారం అందించాలని సూచించారు.దేశ భవిష్యత్తును నిర్ణయించే యువత గంజాయి మాదక ద్రవ్యాలకు అలవాటు పడి తమ విలువైన భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు అని ఈత బోధ చేశారు.వాటికి అలవాటు పడిన యువత డబ్బు కోసం నేరాల వైపు వెళ్ళి విలువైన భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని వెల్లడించారు. గ్రామంలో ఎవరైనా గంజా,ఇతర మాదక ద్రవ్యాలు వాడుతున్న,సరపరా చేస్తున్నట్లు గుర్తించిన పోలీస్ వారికి సమచారం అందించాలని సూచించారు.ఈకార్యక్రమంలో కానిస్టేబుల్ అశోక్,రాజా కుమార్ సుమంత్ రెడ్డి,హోమ్ గార్డ్ గోపాల్ పాల్గొన్నారు.

# మెదక్ ఎంపీ రఘునందన్ రావు చొరవతో పున:ప్రారంభమైన రోడ్డు విస్తరణ పనులు



**శివంపేట,ఆగస్టు04(సూర్యరేఖ)**శివంపేట మండలంలోని చండి,రెడ్యా తాండ,భోజ్యా తాండ గోమారం లచ్చిరెడ్డిగూడెం నవాబ్ పేట్ గ్రామాలకు మన దేశ ప్రధానమంత్రి నరేంద్రమోడీ కేంద్ర ప్రభుత్వం సెంట్రల్ రోడ్ ఫండ్ ద్వారా నిధులను విడుదల చేయడం జరిగింది.గత రెండు సంవత్సరాల క్రితమే ఈ రోడ్డుకు శంకుస్థాపన చేయడం జరిగింది. ఈ రోడ్డు మొదటి దశలో ఉసిరికపల్లి,భీమ్లా తాండ, శంకర్ తాండ పాంబండ పోతులబోగూడ వరకు పూర్తయింది. రెండవ దశలో చండి,రెడ్యా తాండ, భోజ్యా తాండ,గోమారం,లచ్చిరెడ్డిగూడెం,నవాబ్ పేట్ గ్రామాలకు రోడ్డు విస్తరణ పనులు ప్రారంభమై రాష్ట్ర ప్రభుత్వం,రోడ్డు కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్ల మధ్యలోనే నిలిచిపోవడం జరిగింది. ఈ విషయమై భారతీయ జనతా పార్టీ యువ నాయకులు వెల్దుర్తి మండల ఇన్చార్జి అశోక్ సాదుల గత పదిహేను రోజుల క్రిందట మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావుని కలిసి ఆగిపోయిన రోడ్డు పరిస్థితి గురించి వివరించడం జరిగింది.దానికి స్పందించిన ఎంపీ రోడ్డు సంబంధిత అధికారులకు, కాంట్రాక్టర్లకు ఫోన్ చేసి వీలైనంత త్వరగా రోడ్డు విస్తరణ పనులను పూర్తి చేయాలని హెచ్చరించారు. దీంతో ఈ రోడ్డు విస్తరణ పనులు పున:ప్రారంభమయ్యాయి.అనంతరం అశోక్ సాదుల మాట్లాడుతూ. గత పదిహేను సంవత్సరాలు కాంగ్రెస్ ప్రభుత్వంలో నర్సాపూర్ నియోజకవర్గానికి రెండుసార్లు ఎమ్మెల్యేగా మంత్రిగా ప్రాతినిధ్యం వహించిన సునితాలక్ష్మారెడ్డి తన స్వగ్రామానికి రోడ్డు తీసుకురాలేని ఘనత ఆమెకు దక్కిందని ఎద్దేవా చేశారు.గతంలో పది సంవత్సరాలు బీఆర్ఎస్ ప్రభుత్వంలో నర్సాపూర్ ఎమ్మెల్యేగా చిలుముల మదన్ రెడ్డి ఉన్నప్పటికీ ఆయన ఈ రోడ్ల గురించి పట్టించుకోలేదని తెలియజేశారు.రాష్ట్రంలో ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం పరిస్థితి అభివృద్ధి పైన ఊసే లేదని,దున్నపోతు మీద వాన పడ్డట్టే ఉందని అన్నారు.శివ్వంపేట మండలంలో రోడ్ల గురించి మరియు ఏ ఇతర సమస్యల గురించైనా ప్రజల పక్షాన కొట్లాడే పార్టీ భారతీయ జనతా పార్టీ అని సందర్భంగా చెప్పుకొచ్చారు.


## యువత స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి

**మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజ**



**మంథని,ఆగస్టు04( సూర్యరేఖ)**యువత స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకొని ఆర్థికంగా ఎదగాలని మంథని మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ పుట్ట శైలజ పేర్కొన్నారు. సోమవారం మంథని పట్టణం శ్రీరామకాలనీలో శ్రీమంజునాథ పూజ స్టోర్ ను ఆమె ప్రారంభించారు.అనంతరం ఆమె మాట్లాడుతూ యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకొని ఆర్థికంగా ఎదగాలని ఆమె తెలిపారు.పూజా సామాగ్రిని మరెక్కడ లేనివిధంగా ర్యాక్స్ సిస్టం ద్వారా ఏర్పాటు చేయడం చాలా బాగుందని ఆమె పేర్కొన్నారు .శ్రీమంజునాథ పూజ స్టోర్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో మళ్ళీ గులాబీ జెండా ఎగరవేస్తాం..జీవన్ సింగ్.



**నాంపల్లి,హైద్రాబాద్,ఆగస్టు 04(సూర్యరేఖ)** తెలంగాణ రాష్ట్ర తోలి ముఖ్యమంత్రి కేసీఆర్ హైదరాబాద్ లో చేసిన అభివృద్ధికి,అందించిన సేవలకు గాను జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి జరిగే ఉప ఎన్నికల్లో మళ్ళీ గులాబీ జెండా ఎగరవేసేందుకు కృషి చెందామని నాయకులకు,కార్యకర్తలకు తెలంగాణ ఉద్యమ నాయకులు,బీఆర్ఎస్ పార్టీ కార్వాన్ నియోజకవర్గం కాంటెస్టెడ్ ఎమ్మెల్యే ఠాకూర్ జీవన్ సింగ్ పిలుపునిచ్చారు.బీఆర్ఎస్ పార్టీకి 50 వేల మంది కార్యకర్తల సభ్యత్వం ఉన్న నియోజకవర్గం జూబ్లీ హిల్స్ అని జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల్లో మళ్ళీ గులాబీ జెండా ఎగరాలని సూచించారు కాంగ్రెస్ వచ్చాక అనేక సంక్షేమ పథకాలు ఆగిపోయాయని అబద్ధపు హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని అన్నారు.కాంగ్రెస్ బూటక పు హామీలను ప్రజల ముందు ఉంచి,దోషిగా నిలబెడుతూ చిత్తుగా ఓడిం చాలని నాయకులకు,కార్యకర్తలకు హితవుపలికారు.ఈ కార్యక్రమంలో బీ ఆర్ఎస్ పార్టీ కార్వాన్ నియోజకవర్గం సీనియర్ నాయకులు గున్నాలరం గారెడ్డి కార్వాన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ ముత్యాల భాస్కర్,కార్వాన్ డివిజన్ అధ్యక్షులు పట్లూరఘు,జ్యోతిరాజ్ సత్యనారాయణగౌడ్, దీపక్, శ్రీకాంత్ సాగర్ రాకేష్ చారి సయ్యద్ ఖాదర్ శిరీషింగ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# నూతన గృహప్రవేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు నాతరి స్వామి





**బెల్లంపల్లి,ఆగస్టు04(సూర్యరేఖ)**యూత్ కాంగ్రెస్ బెల్లంపల్లి పట్టణ ప్రధాన కార్యదర్శి ఆసం అఖిల్ నూతన గృహ ప్రవేశం కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మత్త మారి సూరిబాబు, టిపి సిసి రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి లు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.పట్టణ అధ్యక్షులు ముచ్చర్ల మల్లయ్య జిల్లా జనరల్ సెక్రటరీ సిలివేరు సత్యనారాయణ మాజీ కౌన్సిలర్లు కటకం సతీష్ టీపీసీసీ,మీడియా జిల్లా కన్వీనర్ దేవసాని ఆనంద్ ఓబిసి,కో చైర్మెన్ బండి లక్ష్మణ్,సమ్మయ్య, కిషన్ తదితర కాంగ్రెస్ సీనియర్ నాయకులు, తదితరులు ఉన్నారు.

# ఉచిత మెగా హెల్త్ క్యాంప్ ను సద్వినియోగించుకోవాలి

**డాక్టర్ హిదయతుల్లా ఖాన్,**
**డాక్టర్ సోహెబా షుకూర్లు**

**రాజేంద్రనగర్,ఆగస్టు04(సూర్యరేఖ)**
అత్తాపూర్‌లోని మీనా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్లో ఉచిత మెగా హెల్త్ క్యాంప్‌ను ఆగస్టు 31 వరకు పొడిగించినట్లు డాక్టర్ హిదయతుల్లా ఖాన్,డాక్టర్ సోహెబా షుకూర్,లు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఈ శిభిరం అన్ని ప్రధాన విభాగాలలో నిపుణుల సంప్రదింపులు,వైద్య సేవలను అందిస్తోందన్నారు.ఈ నెల రోజుల పాటు జరిగే చొరవలో డాక్టర్ మొహమ్మద్ జావాద్ నేతృత్వంలోని జనరల్ మెడిసిన్‌లో ప్రత్యేక సంరక్షణ ఉంటుందని ఇదిడయాబెటిస్ హైపర్‌టెన్షన్ థైరాయిడ్ రుగ్మతలు ఉబ్బసం ఆర్థరైటిస్ ఇన్‌ఫెక్షన్లు క్రిటికల్ కేర్‌లకు చికిత్స అందిస్తుందన్నారు.డాక్టర్ మొహమ్మద్ నకీ జైన్ ఆధ్వర్యంలోని జనరల్ సర్జరీ లాపరోస్కోపిక్ సర్జరీలు హెర్నియా పిత్తాశయం థైరాయిడ్ రొమ్ము పైల్స్ ఫిస్టులా ఫిషర్ సున్తీ బారియాట్రిక్ విధానాలను కవర్ చేస్తుందన్నారు.గర్భధారణ సంరక్షణ పీసీఓఎస్ వంధ్యత్వం,మహిళల ఆరోగ్యాన్ని పరిష్కరిస్తూ ఓబీజీ సేవలు 24/7 అందుబాటులో ఉంటాయని వెల్లడించారు.డాక్టర్ ఉజైర్



మసూద్,డాక్టర్ రోయిష్ ఉద్దీన్ నేతృత్వంలోని ఆర్థోపెడిక్స్ ఫ్రాక్చర్ మేనేజ్‌మెంట్ ఆర్థ్రోస్కోపీ జాయింట్ రీప్లేస్‌మెంట్స్ కాంప్లెక్స్ ఆర్థోపెడిక్ ఇన్ఫెక్షన్‌లను అందిస్తుందని వెల్లడించారు. యూరాలజీలో డాక్టర్ వివి రెడ్డి సిస్టోస్కోపీ యూఆర్ఎస్ఎల్ టీయూఆర్పీ పీసీఎన్ఎల్ వంటి విధానాలను రాళ్లు కణితులు ఇన్‌ఫెక్షన్లు వంధ్యత్వం ప్రోస్టేట్ సమస్యలకు చికిత్సను అందిస్తారన్నారు. డాక్టర్ మజీద్ అలీ అఫ్రోజ్‌తో కలిసి పీడియాట్రిక్స్ ఎన్ఐసీయూ నవజాత శిశువుల సంరక్షణ రోగనిరోధకత పెరుగుదల ట్రాకింగ్,అంటూ వ్యాధి చికిత్స పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్‌ను అందిస్తుందన్నారు.డాక్టర్ అజ్మత్ నేతృత్వంలోని ఈఎన్టీ చెవి శస్త్రచికిత్సలు,సైనస్ విధానాలు సెప్టోప్లాస్టీ టాన్సిలెక్టమీ థైరాయిడ్ శస్త్రచికిత్సలను కలిగి ఉంటుందన్నారు.డాక్టర్ హిదాయతుల్లా ఖాన్ నేతృత్వంలోని ఆప్తాల్మాలజీ కంటి పరీక్షలు కంటిశుక్లం స్క్రీనింగ్,కళ్ళజోడుపై 25% తగ్గింపును అందిస్తుందన్నారు.డాక్టర్ మొహమ్మద్ ఒమర్ ఫరూక్ నేతృత్వంలోని డెర్మటాలజీ మొటిమలు పిగ్మెంటేషన్,సోరియాసిస్ విటిలిగో పీఆర్పీ బోటాక్స్ ఫిల్లర్లు,కాస్మెటిక్ డెర్మటాలజీ విధానాలను అందిస్తుందన్నారు. నెఫ్రాలజీ విభాగం డయాలసిస్ మార్పిడి సంరక్షణ మూత్రపిండ బయాప్సీలు కాథెటర్ ఇన్సర్షన్‌లను అందిస్తుందని డాక్టర్ మహమ్మద్ నవాజ్ నేతృత్వంలోని దంతవైద్యంలోశుభ్రపరచడం తెల్లబడటం ఫిల్లింగ్‌లు రూట్ కెనాల్స్,బ్రేసెస్ దంతాలు ఇంప్లాంట్లు పీడియాట్రిక్ దంత సంరక్షణ ఉన్నాయన్నారు.ఈ శిభిరం ఫార్మసీపై 10శాతం ల్యాబ్ పరిశోధనలు శస్త్రచికిత్సలపై 20శాతం.కళ్ళద్దాలపై 25 శాతం తగ్గింపును కూడా అందిస్తుందన్నారు.ఈ చొరవ రోగులు అన్ని ప్రత్యేకతలలో అధిక-నాణ్యత సరసమైన సంరక్షణను పొందేలా చేస్తుందని ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలన్నారు. అపాయింట్‌మెంట్‌లు,మరిన్ని వివరాల కోసం దయచేసి 040-35262700,040-35262701, 7396084445, 7396084446 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసింది

**బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పోరెడ్డి ధర్మారెడ్డి,నియోజకవర్గం**
**బీఆర్ఎస్వీ అధ్యక్షులు కట్టెల మండి గౌతమ్,లు**




**రాజేంద్రనగర్,ఆగస్టు04(సూర్యరేఖ)** నిరుద్యోగుల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను నిలువునా మోసం చేస్తోందని రాజేంద్రనగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పోరెడ్డి ధర్మారెడ్డి నియోజకవర్గం బీఆర్ఎస్వీ అధ్యక్షులు కట్టెల మండి గౌతమ్,లు అన్నారు. బీఆర్ఎస్,బిఆర్ఎస్వీ పార్టీ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ లోని డైరీ ఫామ్ చౌరస్తా వద్ద ప్రభుత్వ తీరును ఎండగడుతూ ధర్నా చేశారు. ప్రధానంగా ఫీజు రియంబర్స్ మెంట్,నిరుద్యోగ భృతి రూ.4 వేలు సంవత్సరంలో 2 లక్షల ఉద్యోగాల భర్తీ చేస్తామని చెప్పి విద్యార్థులను మభ్యపెడుతున్నారని మండిపడ్డారు.ఇచ్చిన హామీలను నెరవేర్చాలని లేదంటే పార్టీ తరపున ఉద్యమాలను ఉధృతం చేస్తామన్నారు.మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వంతో ప్రజలు విసుగు చెందారని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు అవుతున్న నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదన్నారు.ఇప్పటి వరకు జాబ్ క్యాలెండర్ ఇవ్వలేదని మండిపడ్డారు. నిరుద్యోగులకు 4వేల భృతి ఇస్తామని..ఇలా ఎన్నో అనేక హామీలు ఇచ్చారని తెలిపారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ నరేష్ ధోని నియోజకవర్గ జనరల్ సెక్రెటరీ అఖిరానందన్ డివిజన్ బీఆర్ఎస్ ప్రెసిడెంట్ నిష్కల్ రెడ్డి,శివ అభినవ్ ప్రతీక్,తదితర నాయకులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ







**మందమర్రి,ఆగస్టు04 (సూర్యరేఖ)** అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చికిత్సలు పొందిన బాధితులకు పట్టణ కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. కార్మిక గనులు ఉపాధిశాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి ఆదేశాల మేరకు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నోముల ఉపేందర్ గౌడ్,ఉమ్మడి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి సొత్కు సుదర్శన్,లు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఎవరైనా అనారోగ్యంతో ఇబ్బందులు పడుతూ ఖర్చు చేస్తున్న వారు సంబంధిత ధ్రువపత్రాలతో సంప్రదిస్తే తప్పక సీఎం సహాయ నిధి చెక్కులను మంజూరు చేపిస్తామన్నారు. ఇంతకు మునుపు ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్న వారికి నిధులు మంజూరయ్యాయని మంజూరైన చెక్కులు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అందుబాటులో ఉంటాయని,అలాగే పట్టణంలోని 24 వార్డుల బాధ్యులు లబ్ధిదారులకు సమాచారం అందిస్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు కడారి జీవన్ కుమార్,సేవాదళ్ జిల్లా అధ్యక్షులు ఎండి ఆఫిజ్,పైడిమల్ల నర్సింగ్, పట్టణ సేవాదళ్ అధ్యక్షులు ఉదయ్,యువజన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు మాయ తిరుపతి, పట్టణ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బుర్ర ఆంజనేయగౌడ్, ఎండి ఖలీల్,ఆడెపు వేణు,జలీల్ గజ్జల నరేష్, తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాలు దేవుడిచ్చిన వరం..

**పాలు ఇవ్వడం తల్లీబిడ్డకు ఆరోగ్యం..**
**లైన్స్ క్లబ్ మగువ శ్రీకారం అధ్యక్షురాలు పోగుల వకుళ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవ వేడుకలు..**



**గోదావరిఖని,ఆగస్టు04(సూర్యరేఖ)**తల్లిపాలు దేవుడిచ్చిన వరమని,తల్లిపాల ప్రాముఖ్యతను చాటి చెప్పాల్సిన అవసరం ఉందని లైన్స్ క్లబ్ మగువ శ్రీకారం అధ్యక్షురాలు పోగుల వకుళ అన్నారు.గోదావరిఖనిలోని హనుమాన్ నగర్ లో లైన్స్ క్లబ్ మగువ శ్రీకారం అధ్యక్షురాలు పోగుల వకుళ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవం సందర్భంగా గర్భిణీ స్త్రీలకు శ్రీమంతం కార్యక్రమం,పిల్లలకు అక్షరాభ్యాసం,అన్న ప్రసన్న కార్యక్రమం నిర్వహించారు.అనంతరం తల్లిపాల విశిష్టతను,పాల వల్ల పిల్లలకు జరిగే లాభాలను గురించి తల్లులకు అవగాహన కల్పించడం జరిగింది.గర్భిణీ స్త్రీలకు శ్రీమంతం కార్యక్రమము సందర్భంగా చీరే,పసుపు, కుంకుమ గాజులు పండ్లు,స్వీట్లను వారికి అందజేసి శ్రీమంతం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ మెంబర్ అరకాల సునీత శ్రీనివాస్ అంగన్వాడి టీచర్లు సువర్ణ,స్వప్థలత, సంధ్యారాణి,అఫెసర్ సుల్తాన రమాదేవి,అధిక సంఖ్యలో విద్యార్థుల తల్లిదండ్రులు,ఆశ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

## పంట పొలాలలో సంతరిస్తున్న ఊర పందులు..




**నిజాంపేట,ఆగస్టు04(సూర్యరేఖ)**మండల పరిధిలోని చల్మెడ గ్రామంలో పంట పొలాలలో ఊర పందులు సంచరిస్తున్నాయని రైతు ఆరోపిస్తున్నారు. సర్పంచు పదవీకాలం ఉన్న సమయంలో గ్రామంలో గ్రామస్తులంతా సమావేశం నిర్వహించుకుని,గ్రామంలో పందులు తిరగకుండా ఏకగ్రీవ తీర్మానం చేసిన తర్వాత గ్రామంలో పందులు తిరిగేవి కావని,సర్పంచుల పదవీకాలం ముగియడంతో మళ్లీ విచ్చలవిడిగా ఊరపందులు సంచరించడం పంట పొలాలను నాశనం చేస్తున్నాయని పలుమార్లు గ్రామపంచాయతీ అధికారులకు విన్నవించుకున్న పట్టించుకునే వారే కరువయ్యారని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ఇకనైనా గ్రామపంచాయతీ అధికారులు స్పందించి పందులు పంట పొలాల్లో తిరగకుండా చూడాలని, ఊరపందల నుండి విముక్తి కల్పించాలని గ్రామ రైతులు కోరుతున్నారు.

## జీవితంపై విరక్తి చెంది ఉరివేసుకుని యువతి ఆత్మహత్య..




**నిజాంపేట,ఆగస్టు04 (సూర్యరేఖ)**మండల పరిధిలోని నార్లపూర్ గ్రామానికి చెందిన గాలం లక్ష్మణ్,పెద్ద కూతురు జ్యోతి (24) సంవత్సరం క్రితం ఉప్పరిపల్లికి చెందిన బొడ్డు స్వామితో వివాహం జరిగింది.వివాహం జరిగి 3 నెలల క్రితం తన తండ్రి లక్ష్మణ్,కు పక్షవాతం వచ్చి అనారోగ్యంతో ఉండగా అప్పటి నుండి జ్యోతి తన తల్లిగారి ఇంటి వద్దే ఉంటూ తన తండ్రి బాగోగులు చూసుకుంటూ ఉండేది.తన తండ్రి ఆరోగ్యం విషయంలో బాధపడుతూ,జీవితంపై విరక్తి చెంది సోమవారం మధ్యాహ్నం తల్లిదండ్రులు ఇంట్లో లేని సమయంలో ఇంట్లోనే చీరతో ఉరివేసుకొని మరణించడం జరిగింది.శవపంచనామ నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.మృతురాలి తండ్రి తన కూతురుకి తన భర్త కానీ భర్త కుటుంబ సభ్యులు ఎవరు ఏలాంటి ఇబ్బంది పెట్టలేదని,తన తండ్రి ఆరోగ్య విషయంలో బాధపడుతూ మనస్థాపంతో చనిపోయిందని మృతురాలి తండ్రి లక్ష్మణ్ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు.

# పెరేడ్ లతో ప్రైవేటు సెక్యూరిటీ గార్డులను ఇబ్బందులకు గురి చెయ్యొద్దు



**పెరేడ్ అలవెన్సులు చెల్లించాలి**
**ఎస్సీ కేఎస్ సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు దూలం శ్రీనివాస్**

**మందమర్రి,ఆగస్టు04(సూర్యరేఖ)** మందమర్రి డివిజన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ప్రైవేటు సెక్యూరిటీ గార్డుల జీవన ప్రమాణాలను,పని తీరును మెరుగు పరచడానికి పెరేడ్ అలవెన్సు చెల్లించాలని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు దూలం శ్రీనివాస్ డిమాండ్ చేశారు.సోమవారం పట్టణంలోని సింగరేణి పాఠశాల మైదానంలో ప్రైవేటు సెక్యూరిటీ గార్డుల పెరేడ్ అనంతరం వారి సమస్యలను అడిగి తీసుకున్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ..సింగరేణి సంస్థలో దొంగతనం విధ్వంసం హింస నుండి కాపాడేందుకు ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు ముఖ్య పాత్ర పోషిస్తున్నారని తెలిపారు.నెలకు 6 పెరేడ్ లు చేయాలని,చేయని పక్షంలో విధుల్లోకి తీసుకోవద్దని అధికారులు చెప్పడం సరైన పద్ధతి కాదని,పెరేడ్ లు చేసే సెక్యూరిటీ సిబ్బందికి పెరేడ్ అలవెన్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు.సింగరేణి యాజమాన్యం ప్రైవేటు సెక్యూరిటీ గార్డుల టెండర్ లో పెరేడ్ చేయించాలనే నిబంధనే లేదని,కానీ సెక్యూరిటీ గార్డులకు కనీస పెరేడ్ అవగాహన ఖచ్చితంగా ఉండాలి కాబట్టి కొంత ట్రైనింగ్ ఇవ్వాల్సిందేనని,పర్మినెంటు సెక్యూరిటీ గార్డులు పెరేడ్ చేస్తే వారికి పెరేడ్ అలవెన్సులు యాజమాన్యం చెల్లిస్తుందనీ,కానీ ప్రైవేటు సెక్యూరిటీ గార్డులకు మాత్రం ఒక్క రూపాయి కూడా చెల్లించకపోవడం దుర్మార్గం అని అన్నారు. సింగరేణి యాజమాన్యం సానుకూలంగా స్పందించి ప్రైవేటు సెక్యూరిటీ గార్డుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రైవేటు సెక్యూరిటీ గార్డులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ అభివృద్ధికి కృషి..





**ఏడాదిన్నరలో ఎంతో అభివృద్ధి చేశా..**
**నియోజకవర్గంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీని పటిష్ఠంగా నిర్మిస్తాం..**
**అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్**

**శంషాబాద్,ఆగస్టు04(సూర్యరేఖ)** రాజేంద్రనగర్ నియోజకవర్గంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను పటిష్టం చేస్తామని శాసనసభ్యులు టి.ప్రకాష్ గౌడ్ అన్నారు.శంషాబాద్ మండలం కవెలిగూడ గ్రామ చౌరస్తా నుంచి వెంకటాపూర్ వరకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ..నియోజకవర్గంలో ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలను కల్పించడం జరుగుతుందని తెలిపారు.నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషిచేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించడంతో పాటు. నియోజకవర్గంలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తానన్నారు. మంచినీరు రోడ్లు వీధిదీపాలు డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాల కల్పనలో వెనక్కు తగ్గకుండా పనిచేయడం జరుగు తుందని వివరించారు. ఎక్కడ ఎలాంటి సమస్యలు ఎదురైనా తన దృష్టికి తీసుకురావాలన్నారు. వాటి పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు



# పేద విద్యార్థులకు అండగా ఉంటాం





**పేదల విద్యాభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు సహకరించాలి..**
**సమాజాభివృద్ధిలో స్వచ్ఛంద సంస్థలు ముందుండాలి..**
**విద్యార్థులకు బ్యాగులు,మెడల్స్ పంపిణీలో పాల్గొన్న ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్**

**రాజేంద్రనగర్,ఆగస్టు04(సూర్యరేఖ)** పేదలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వాలు చేస్తున్న కృషికి తోడుగా స్వచ్ఛంద సేవా సంస్థలు కూడా ముందుకు వచ్చి సహాయ సహకారాలు అందించాలని రాజేంద్రనగర్ శాసనసభ్యులు టి.ప్రకాష్ గౌడ్ అన్నారు. ఉప్పర్‌పల్లి ప్రైమరీ స్కూల్‌లో విద్యార్థులకు బ్యాగులు,మెడల్స్ పంపిణీ చేశారు.ఉప్పర్‌పల్లి ప్రైమరీ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.క్లేపాట్ ఫౌండేషన్



ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన విద్యార్థులకు స్కూల్ బ్యాగులు అందజేశారు.ఈ సందర్భంగా చదువులో మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ అభినందించారు.విద్యార్థులను ప్రోత్సహించే ఉద్దేశంతో ఆయన తన చేతుల మీదుగా వారికి మెడల్స్ బహూకరించారు. చదువుతో పాటు అన్ని రంగాల్లోనూ రాణించాలని విద్యార్థులకు సూచించారు.రాజేంద్రనగర్ నియోజకవర్గంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు పేద విద్యార్థుల చదువుకు సంబంధించి ఎలాంటి ఇబ్బంది ఉన్నా తనను కలిస్తే అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సామ ఇంద్రపాల్ రెడ్డి,పాఠశాల ఉపాధ్యాయులు,క్లే పాట్ ఫౌండేషన్ సభ్యులు,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## టీచర్ కు పదవి విరమణ శుభాకాంక్షలు తెలిపిన పూర్వ విద్యార్థులు



**బెల్లంపల్లి,ఆగస్టు04(సూర్యరేఖ)** కన్నెపల్లి హైస్కూల్ ఎస్ఏ బయో సైన్స్ టీచరుగా విధులు నిర్వహించి పదవి విరమణ పొందిన ఎర్ర సువర్ణ-ఆదిత్య వర్ధన్ రాజుకి పదవి విరమణ శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో సత్కరించారు.జడ్పిహెచ్ఎస్ 1997-98 బ్రాంచి స్కూల్ బజార్ ఏరియా బెల్లంపల్లి పూర్వ విద్యార్థులు పట్టణ ప్రజా ప్రతినిధులు మున్సిపల్ కౌన్సిలర్స్ పట్టణ ప్రముఖులు పోలు శ్రీనివాస్,గోషిక రమేష్,ఎండి ముజ్జు అశోక్,మహేనందర్ సలీం నారాయణ రాజకుమార్,అఫ్జల్ వెంకటేష్ కాజా మల్లారెడ్డి తదితరులు హాజరై పదవి విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఏరియాలో అద్దె వాహనాలకు సింగరేణి దరఖాస్తుల ఆహ్వానం

**మందమర్రి,ఆగస్టు04(సూర్యరేఖ)** మందమర్రి ఏరియా పరిధిలోని కేకే ఓసిపి,రామకృష్ణాపూర్ ఏరియా హాస్పిటల్ లో అద్దె ప్రాతి పదికన వాహనాలు నడుపుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సింగరేణి యాజమాన్యం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.3 నుంచి 5 సంవత్సరాల పాటు యూనిట్ విధానం కింద అద్దె ప్రాతిపదికన 2డబ్లూడి పూర్తిగా అమర్చిన ఏసీ అంబులెన్స్,4 డబ్ల్యూడి నాన్ ఏసీ క్యాంపర్/1.0 టన్ అంతకంటే ఎక్కువ కెపాసిటీ పికప్ వ్యాన్ వాహన యాజమానుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.మంగళవారం 4 గంటల లోపు టెండర్ పత్రాల దరఖాస్తులను మందమర్రి జీఎం కార్యాలయంలోని పర్చేస్ డిపార్ట్మెంట్ లో సమర్పించాలని సింగరేణి యాజమాన్యం కోరింది.

## ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరిస్తాం..

**బాధ్యతలు చేపట్టిన సర్కిల్ డిప్యూటీ కమిషనర్ బి.సురేందర్ రెడ్డి**





**రాజేంద్రనగర్,ఆగస్టు04(సూర్యరేఖ)**రాజేంద్రనగర్ సర్కిల్ నూతన డిప్యూటీ కమిషనర్గా బి.సురేందర్ రెడ్డి సోమవారం ఉదయం పదవీ బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా సర్కిల్ అధికారులు,సిబ్బంది ఆయనకు ఘనంగా స్వాగతం పలికి పూల బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం కాంగ్రెస్ పార్టీ సర్కిల్ సీనియర్ నాయకులు కోలన్ సుభాష్ రెడ్డి,జాలిగం చిత్తారి చిట్టిగారి నరేందర్,లు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ బి.సురేందర్ రెడ్డి మాట్లాడుతూ. ప్రజల సమన్వయంతో క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.క్షేత్రస్థాయిలో ప్రతిరోజు పర్యటించి ప్రజా సమస్యల పరిష్కారంలో తన వంతు కృషి చేస్తానని తెలిపారు ప్రధానంగా వర్షాకాలంలో ప్రజలు వరదనీటికి ముంపు కాకుండా పనులు చేపట్టడంతో పాటు,పరిశుద్ధ పనులను సక్రమంగా చేపట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు స్థానికంగా ఉన్న సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులు పరిశీలించి సాధ్యమైనంత వరకు పరిష్కరించేందుకు కృషి చేస్తారన్నారు.డిప్యూటీ కమిషనర్ సురేందర్ రెడ్డిని సన్మానించిన వారిలో స్థానిక నాయకులు కోలన్ సుధాకర్ రెడ్డి,రామ్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

## గ్రీవెన్స్ డే.. బాధితుల సమస్యల పరిష్కారానికి చర్యలు

**జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**

**జగిత్యాల :** జిల్లాలో ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో భాగంగా, ఈ రోజు జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 19 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి, వారి సమస్యలను పరిశీలించారు.ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, సమస్యల పూర్తి వివరాలను సమర్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు.బాధితుల సమస్యలు తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

# మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే, ఎంతటి వారినైనా వదిలిపెట్టం





**ప్రజల సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తా..**
**టీఎన్జీఓఎస్ లో పేదలకు చెందాల్సిన భూమి ఎవరు కబ్జా చేసినా ఉపేక్షించేది లేదు..**
**ప్రజాదర్బార్ లో బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకుడు పట్లోళ్ల కార్తీక్ రెడ్డి**

**రాజేంద్రనగర్,ఆగస్టు04(సూర్య రేఖ) :** ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా బీఆర్ఎస్ పార్టీ తరపున పని చేయడం జరుగుతుందని రాజేంద్రనగర్ పార్టీ ఇంచార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి అన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పోరేషన్ లో కాలనీలలో,జనవాసాల మధ్యలో ఎస్టీపీ ప్లాంట్ పెట్టకూడదని సోమవారం స్థానికులతో కలిసి కొంగరకలాన్ లోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజా దర్బార్ లో ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా మైలార్ దేవ్ పల్లిలోని ఎస్టీల ఇళ్ల పట్టాలకు సంబంధించిన అంశంలో కూడా ఫిర్యాదు చేసి వారికి కార్తీక్ రెడ్డి భరోసా ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...కార్పోరేషన్ లో కాలనీల మధ్యలో ఎస్టీపీ ప్లాంట్ పెట్టకూడదని,కాలనీవాసులు అనేక రోజులుగా ధర్నా చేసినా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణంగా ఉందన్నారు. అదేవిధంగా టీఎన్జీఓఎస్ లోని పేదలకు చెందాల్సిన భూమి ఎవరు కబ్జా చేసినా ఉపేక్షించేది లేదన్నారు. వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వం కాబట్టి ఎంతటి వారినైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. కబ్జా చేసి దొంగ సర్టిఫికెట్లు తయారు చేసి అమ్మే వారి దగ్గర ఎవరు కొని నష్ట పోవద్దని ప్రజలకు పి.కార్తీక్ రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో మైలార్ దేవ్ పల్లి డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు ఎస్.వెంకటేష్,అక్కెం రాఘవేందర్ యాదవ్,విద్య విభాగం అధ్యక్షులు మధుచారి,మైసిరెడ్డి,సోమ శ్రీనివాస్ గుప్త కాంతు దుర్గేష్ భూదేవి సరిత అరుణ రెడ్డి,శంకర్ నాయక్ గుమ్మడి కుమార్ రాజేష్ యాదవ్ జగన్‌బాలరాజు యాదవ్ సునీల్ సింహాద్రి బొంబాయి రవి అశోక్ కుమార్,సందీప్ గుప్తా,దుర్గాప్రసాద్,శ్రీకాంత్, బిక్షు వెంకటేష్ చందు కిరణ్ పరమేష్ భామిని మల్లేష్,పట్టియా నాయక్,పెద్ద ఎత్తున బీఆర్ఎస్ నాయకులు బంజారావీకర్ సెక్షన్ కాలనీకి చెందిన మహిళలు ఎస్టీ బంజారా నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల జాప్యం.. సంక్షోభంలోకి గ్రామాలలో పరిపాలన

**హైదరాబాద్ :** స్థానిక సంస్థల ఎన్నికల జాప్యం.. గ్రామాలలో పరిపాలన సంక్షోభంలోకి నెట్టివేయబదిందని,రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్లక్షం వళ్ళ రూ.2300 కోట్లు కేంద్ర ఆర్థిక సంఘం నిధులు ఆగిపోయాయని జీతాలు లేక పారిశుద్ధ్య కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని బిజెపి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. కాసం వెంకటేశ్వర్లు అన్నారు. సోమ వారం బిజెపి తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో పార్టీ ఎస్ సి మోర్చా రాష్ట్ర అద్యక్షులు కొల్లేటి శ్రీధర్, కిసాన్ మోర్చా నేత కొండపల్లి శ్రీదర్ రెడ్డిట్ తో కలిసి మాట్లాడారు. తెలంగాణలో సర్పంచ్‌ల పదవీకాలం 2024 ఫిబ్రవరిలో, జెడ్పీటీసీ, ఎంపీటీసీల పదవీకాలం 2024 జూన్‌లో, మున్సిపాలిటీల పదవీకాలం 2024 సెప్టెంబర్‌లో ముగిసినప్పటికీ, ప్రభుత్వం ఇప్పటికీ స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించలేదు. ఈ ఎన్నికల జాప్యం వల్ల గ్రామాలలో పరిపాలన పూర్తిగా సంక్షోభంలోకి వెళ్లిపోయింది. ఏడాదిన్నర కాలంగా ఎన్నికలు నిర్వహించని కారణంగా కేంద్ర ఆర్థిక సంఘం నుంచి వస్తున్న రూ.2300 కోట్లు నిధులు తెలంగాణకు ఆగిపోయాయి. ప్రతి గ్రామానికీ వెళ్లినా పారిశుద్ధ్య కార్మికులు జీతాలు లేక ఇబ్బందులు పడుతున్న దురవస్థలు కనిపిస్తున్నాయి. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలన వైఫల్యానికి నిదర్శనమన్నారు. రాహుల్ గాంధీ నుంచి మొదలు రేవంత్ రెడ్డి వరకు రాజ్యాంగ పుస్తకాన్ని చూపిస్తూ మాట్లాడే నాయకులు స్థానిక సంస్థల విషయంలో మాత్రం రాజ్యాంగ స్ఫూర్తిని ఎందుకు పాటించడంలేదు ఎన్నికల హామీలతో గాలిమాటలు మాట్లాడి గద్దెనెక్కిన సీఎం రేవంత్ రెడ్డి, వాటి అమలులో పూర్తిగా విఫలమయ్యారు.

ప్రజలకు మొహం చూపించలేని స్థితికి చేరడంతో? మళ్లీ మళ్లీ ఢిల్లీ టూర్లను మొదలుపెట్టారు. ప్రజలకు లాభం లేని విధంగా వందల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని టూర్ల పేరిట ఖర్చు చేస్తూ, ఇటలీ కుటుంబానికి వంచిన మెట్టు అవుతున్నారు. ఇటలీ కుటుంబాన్ని ప్రాధేయపడతూ..తన కుర్చీని కాపాడుకోవడం కోసం మాత్రమే ఢిల్లీకి పోతున్నడని ఆరోపించారు. ఇప్పటిదాకా 50 సార్లు ఢిల్లీకి వెళ్లిన రేవంత్ రెడ్డి? టూరిస్ట్ సీఎం అన్న పేరుతో ప్రజల్లో నవ్వుల పాలయ్యారు. ఈ టూర్లలో ఉన్న జోష్.. ఆరు గ్యారెంటీలు, హామీల అమలులో లేదు. రేవంత్ ఇప్పటికైనా దుబారా ప్రయాణాలు బంద్ పెట్టి పాలనపై దృష్టిపెట్టాలి. ప్రజలకు జవాబుదారీగా ఉండాలన్నారు. 10 ఏండ్ల అవినీతి, అరాచక, కుటుంబ పాలన పోయింది.. ప్రజల ఇబ్బందులు తొలగిపోతాయనుకుంటే... పెనంమీద నుంచి పొయ్యిలో పడ్డ చందంగా మారింది. ఇప్పుడు చేతగాని కాంగ్రెస్ పరిపాలన కారణంగా వందలరెట్లు ఇబ్బంది పడుతున్నరు. రాష్ట్రంలో అసమర్థ కాంగ్రెస్ పాలనలో యూరియా బ్లాక్ మార్కెట్ బారిన పడి రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. కానీ సీఎం సహా మంత్రులు ప్రజల సమస్యలను పక్కనబెట్టి ఢిల్లీ టూర్లలో మునిగిపోయారు. రేవంత్...! ఇప్పటికైనా తెలంగాణ ప్రజల



ఆత్మగౌరవాన్ని ఢిల్లీలో ఇటలీ కుటుంబం దగ్గర పడిగాపులు కాసి తాకట్టుపెట్టకు. ఇది మంచిది కాదని కాచం హెచ్చరించారు..తెలంగాణ హైకోర్టు స్పష్టంగా చెప్పింది.. సెప్టెంబర్ 30లోపు ఎన్నికలు నిర్వహించాలనీ, జూలై 25లోపు రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తిచేయాలని. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికీ ఆ ప్రక్రియను పూర్తిచేయలేదు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే చిత్తశుద్ధి కాంగ్రెస్ పార్టీకి లేదు. రాష్ట్ర శాసనసభలో కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పంచాయతీరాజ్ చట్టాన్ని సవరించకుండా.. ఢిల్లీబాట పట్టడంలో ఔచిత్యం ఏంటి? రాజ్యాంగంలోని 243-ఆ(6) ప్రకారం బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను నిర్ణయించే పూర్తి అధికారమూ రాష్ట్ర ప్రభుత్వానికే ఉంది. అసలు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇయ్యలేక కాంగ్రెస్ కేవలం ప్రజలను మభ్యపెట్టేందుకు ఢిల్లీ బాట పట్టింది. ఇదంతా డ్రామా.. పైగా ప్రజల దృష్టి మరల్చేలా బిజెపిపై, బిజెపి నాయకులపై విమర్శలు చేస్తున్నరు. అందులో భాగంగానే టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ విమర్శలు చేశారు. ఈ రాష్ట్రానికి 10 మంది ముఖ్యమంత్రులున్నరు.. ఆ ముఖ్యమంత్రుల్లో తాను ఒక్కడినని నిరూపించుకోవాలని మహేశ్ కుమార్ గౌడ్ పడరాని పాట్లు పడుతున్నరు. అవసరం లేని పాదయాత్ర చేస్తూ తిప్పలపడ్తున్నరు. తెలంగాణకు బిజెపి నాయకులు శకునిలా దాపురించారని మహేశ్ కుమార్ గాడ్ ఆరోపణలు చేశారు. నిజానికి తెలంగాణ అభివృద్ధికి పట్టిన అసలైన రాహువు మాత్రం రేవంత్ రెడ్డే. రెవంత్ రెడ్డి ఒక శని లాగా తెలంగాణకు పట్టుకున్నడు. ఆయన సీఎం అయిన తర్వాతే రాష్ట్రవ్యాప్తంగా అభద్రత ముసురు కమ్మింది, అభివృద్ధి దారితప్పింది. నిధుల కొరత, పరిపాలనలో అయోమయం, కలుషిత రాజకీయాలు పెరిగాయి. కేంద్రం మంజూరు చేసిన ప్రాజెక్టులకు భూములు కేటాయించకుండా అభివృద్ధిని ఆటంకపరిచారు. ప్రజల్లో తిరిగేందుకు ధైర్యం లేక ప్రతిపక్ష నాయకులపై తిట్లు, విమర్శలతోనే కాలం వెల్లదీస్తున్న దరిద్రపు పాలన కాంగ్రెస్ పార్టీది. ఇవన్నీ రేవంత్ రెడ్డి రాష్ట్రానికి పట్టిన రాహు గ్రహణ ప్రభావమే. రాముడు బీజేపీకి ఏమైనా సొంతమా? అని మహేశ్ కుమార్ గౌడ్ అడుగుతున్నారు... తెలుసుకోండి... అవును! బిజెపి రాముడికీ సంబంధం ఉంది. భారతదేశానికీ రాముడికీ, జాతీయతకూ రాముడికీ సంబంధం ఉంది. బిజెపి డీఎన్ఏ, భారతదేశ డీఎన్ఏ ? రెండింటిలోనూ శ్రీరామచంద్రుడే ప్రతిబింబంగా నిలుస్తారు. అయితే... కాంగ్రెస్ పార్టీ డీఎన్ఏ ఏమిటి? ఇటలీ డీఎన్ఏనా? లేక రావణాసురుడి డీఎన్ఏ కావొచ్చేమో... ఓసారి పరీక్షించుకోవాలి. కాంగ్రెస్ వారసత్వం రావణాసురునిదైతే, దాన్ని పాటించండి. కానీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో నడిపిస్తున్నది రాక్షస పాలన కాదా? తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ అసమర్థ, నిరంకుశ పాలనను చూసి 'అయ్యో రామా!' ఏడుస్తున్నారు. పుట్టెడు దు:ఖంతో చలించిపోతున్నరు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆఖరికి రాముడిని కూడా రాజకీయాల్లోకి తీసుకురావడం సిగ్గుచేటు. అయోధ్యలో రామమందిరం కోసం ఉద్యమించింది బిజెపి.. వందల ఏండ్ల భారతీయుల కలను సాకారం చేసింది. కాంగ్రెస్ పార్టీ రామమందిర ఉద్యమాన్ని వ్యతిరేకించింది. సుప్రీంకోర్టులో వ్యతిరేకంగా కేసులు పెట్టింది. రాముడి ఆనవాళ్లను కాంగ్రెస్ పార్టీ ప్రశ్నించింది. శ్రీరాముడు ఈ దేశానికి ఆదర్శమూర్తి. ఆయన భారతీయుల, హిందువుల ఆరాధ్యదైవం. పరిపాలన అంటే ఏమిటో, కుటుంబ వ్యవస్థ ఎలా ఉండాలో, అన్నదమ్ముల మధ్య ఐక్యత ఎలా ఉండాలో ఆయన జీవితం ద్వారా నేర్పించారు. ఈ విలువలు కాంగ్రెస్ పార్టీకి లేకపోవడం వాళ్ల దురదృష్టం. అందుకే మహేశ్ కుమార్ గౌడ్ గారు ఆలోచించుకోవాలి. రాముడిని వ్యతిరేకించడమేనా వారి రాజకీయ ధోరణి? రాజకీయాల్లో ఆరోపణలు సహజం. వ్యక్తుల గురించి, పార్టీల గురించి మాట్లాడుకోవచ్చు. కాని దేవుళ్ల గురించి, ధర్మం గురించి జాగ్రత్తగా మాట్లాడాలని కాంగ్రెస్ పార్టీని హెచ్చరిస్తున్నాం. ధర్మం గురించి, రాముడి గురించి ఇష్టానుసారంగా మాట్లాడితే దేశ ప్రజలు చూస్తూ ఊరుకోరు. కాంగ్రెస్ పార్టీలో పది మంది ముఖ్యమంత్రులు.. మంత్రులు ప్రతి వంద కిలోమీటర్లకు హెలికాప్టర్ వాడుతూ ప్రజల సొమ్ము దుర్వినియోగం చేస్తున్నరు. హెలీకాప్టర్ లో పోవడం కోసం కొట్లాడుతున్నరు. హెలీకాప్టర్లు.. ఢిల్లీ టూర్లు.. స్పెషల్ ట్రైన్లు.. ఇది కాంగ్రెస్ పాలన. దమ్ముంటే కామారెడ్డి బీసీ డిక్లరేషన్ లో పేర్కొన్న హామీలు, 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి. ఆ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉంది. లేకుంటే చేతగాకపోతే తప్పు ఒప్పుకొని ప్రజలకు క్షమాపణలు చెప్పి ముక్కు నేలకు రాయాలని హెచ్చరిస్తున్నాం. ఎమ్మెల్సీ కవిత.. ఇంట్లో కుటుంబమే రానియ్యడం లేదు. ఏకాకిగా మారారు. సొంత పార్టీ నాయకులే కవితపై విమర్శలు చేస్తున్నరు. ఎంపీగా, ఎమ్మెల్సీగా పనిచేసిన కవిత ఏనాడు బీసీల కోసం పనిచేయలేదు. బీసీల రిజర్వేషన్లు 34 నుంచి 22 శాతానికి తగ్గించింది కేసీఆర్ పాలనలోనే.. ఇప్పుడు బీసీల పట్ల కపట ప్రేమ చూపించడం సిగ్గుచేటు. ఎమ్మెల్సీ కవిత తన కుటుంబంలో ఆస్తుల గొడవ జరుగుతోంది. దాంతో ప్రస్టేషన్ లో ఆమె ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారన్నారు. 52

## బెల్లంపల్లి 21వ వార్డులో సిసి కెమెరాల ఏర్పాటుకు ఆర్థిక సహాయం..




**బెల్లంపల్లి,ఆగస్టు04(సూర్యరేఖ)**బెల్లంపల్లి 21వ వార్డు బూడిదగడ్డబస్తీలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ఎన్ఆర్ఐ తోడే వెంకటా కృష్ణారెడ్డి రూ.30 వేల ఆర్థిక సహాయం అందజేశారు. 1వ టౌన్ సీఐ శ్రీనివాసరావుకు న్యాయవాది రాకేష్, కాంగ్రెస్ నాయకుడు లక్ష్మణ్ ఆధ్వర్యంలో అందజేశారు. వార్డు మాజీ కౌన్సిలర్ వంశీకృష్ణారెడ్డి జ్ఞాపకార్థంగా నేరాల నియంత్రణ,శాంతి భద్రతల పరిరక్షణకు సిసి కెమెరాలకు నగదు అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ...ప్రతి ఒక్కరూ తమవంతుగా తమ తమ బస్తీ వార్డులలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని అప్పుడే నేరాలు అదుపులో పెట్టవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరు తమ బాధ్యతగా సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకొని పోలీసు వారికి సహకరించగలరని వారు ఈ సందర్భంగా కోరారు.

## భారతీయ సంస్కృతి,సాంప్రదాయాలు గొప్పవి..

**మాతృ శక్తి ప్రాంతీయ సంయోజిత పద్మశ్రీ**




**రాజేంద్రనగర్, ఆగస్టు04 (సూర్య రేఖ)** భారతీయ సంస్కృతి సాంప్రదాయాలు ప్రపంచంలోనే ఎంత గొప్పవని,మాతృశక్తి ప్రాంతీయ సంయోజిత పద్మశ్రీ అన్నారు. మన సంస్కృతి,సాంప్రదాయాలను భావితరాలకు తెలియజేయా ల్సిన బాధ్యత అందరిపై ఉందని వ్యాఖ్యానించారు. శ్రావణమాసం పూజ ల్లో భాగంగా శ్రీలలిత సహస్ర పారాయణ కార్యక్రమం నిర్వహించారు. సర్కిల్ పరిధిలోని చైతన్య విలాస్ కాలనీ (మారుతిఎంక్లేవ్)లో బిజెపి మహిళా మోర్చా రంగారెడ్డి జిల్లా కార్యదర్శి మేకల వనితారెడ్డి స్వగృహంలో మహిళలు భక్తి పరవశ్యంతో చేపట్టారు. ప్రతి మహిళ తమ ఇంట్లో తత్సంగ్ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. భవిష్యత్ తరాలకు మన సంస్కృతి సాంప్రదాయాలు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని మహిళలు తోటి మహిళలకు సూచించారు. శ్రీలలితా సహస్రనామ స్తోత్రం వింటే అంతా మంచి జరుగుతుందని..కోరిక కోరికలు అన్నీ నెరవేరుతాయని పురాణ గ్రంథాలు చెబుతున్నాయని తెలిపారు. శ్రీలలిత సహస్ర పారాయణ కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి

**మాజీమంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి**

**జగిత్యాల :** జగిత్యాల పట్టణంలోని అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి సోమవారం కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ బి.సత్య ప్రసాద్ కు కలసి వినతి పత్రం అందచేశారు.. ఈ సందర్భంగా మాజీ మంత్రి జీవన్ రెడ్డి మాట్లాడుతూ 2004 లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుపేదలకు ఇండ్లు నిర్మించాలని సంకల్పంతో దాదాపు 80 గజాల విస్తీర్ణం లో అర్హులైన లబ్ధిదారులకు ఎంపిక చేసి నూకపెల్లి అర్బన్ కాలనీలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని ప్రారంభించిందని జీవన్ రెడ్డి అన్నారు. ఆ తర్వాత జరిగిన పరిణామాల నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రం విడిపోవడం టిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దాదాపు 2,000 ఇందిరమ్మ ఇండ్లను కూల్చివేసి వాటి స్థానంలో 4,520 డబులు బెడ్ రూమ్ లను నిర్మించారని,మిగతా 1611 ఇందిరమ్మ ఇండ్లు వివిధ దశ లలో ఉండగా వాటి నిర్మాణానికి 52 కోట్ల రూపాయలు అవసరమని కలెక్టర్ నివేదించారు. కానీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు మౌలిక సదుపాయాల కల్పన పేరుతో అందులో నుండి 100 ఇండ్లను తొలగించారని అన్నారు. దీంతో చాలామంది ఇందిరమ్మ ఇండ్లను కోల్పోవడం జరిగిందని జీవన్ రెడ్డి అన్నారు. ప్రస్తుతం ఇక్కడ ఉన్న ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలని ప్రభుత్వానికి కోరారు,..3,500 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో కేవలం 500 మంది మాత్రమే ప్రస్తుతం నివాసం ఉంటున్నారని,మిగతా 3000 మంది ఎందుకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు రావడం లేదు వాళ్ళు నిజంగా అర్హులా ? కాదా? అని జీవన్ రెడ్డి ప్రశ్నించారు. నూతనంగా ఇండ్లు నిర్మించినప్పుడు వెంటనే అన్ని రకాల సదుపాయాలు ఏర్పడడం అనేది సాధ్యం కాదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఇందిరమ్మ ఇండ్లు కోల్పోయిన బాధితులు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ మల్లు రవికి వ్యతిరేకంగా పెద్దకొత్తపల్లిలో కుల సంఘాల నాయకుల నిరసన

**నాగర్ కర్నూలు :** పెద్దకొత్తపల్లి లో ఎంపి మల్లు రవికి వ్యతిరేకంగా కుల సంఘాల నాయకులు నిరసన కు దిగారు. మండల మార్కెట్ కమిటీ చైర్మన్ దండు నరసింహా పై ఎంపీ మల్లురవి చేసిన వాఖ్యలు వెనక్కి తీసుకోవాలని, క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేసారు. ప్రధాన రహదారిపై రాస్తారోకొ చేపట్టారు. .ఈ నెల 2న జరిగిన డిప్యూటీ సిఎం మల్లు.భట్టి విక్రమార్క పాల్గొన్న బహిరంగ సభలో తనపై నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు.రవి చేసిన అనుచిత వ్యాఖ్యలను మార్కెట్ కమిటీ ఛైర్మన్ దండు నర్సింహ ఖండించారు. పీ మల్లు రవి వెంటనే తనకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసారు. ఆయనకు మద్దతుగా కుల సంఘాలు పలు ఏకమయ్యాయి...




# వంద కోట్ల మార్క్‌ని అవలీలగా దాటేసిన యానిమేటెడ్ మూవీ.. మహావతార్ నరసింహకి కలెక్షన్ల వర్షం

ఒక సినిమా విజయం సాధించాలంటే భారీ బడ్జెట్, స్టార్ హీరోలు, రొంటిక్ సీన్లు, ఐటెం పాటలు అవసరం లేదని 'మహావతార్ నరసింహ' యానిమేషన్ చిత్రంతో రుజువైంది. స్టార్ కాస్టింగ్ లేని ఈ సినిమా ప్రేక్షకుల హృదయాలను హత్తుకుంటుంది.. రొటీన్ కమర్షియల్ ఫార్ములాలకు దూరంగా, కథకే ప్రధానంగా నిలిచిన ఈ చిత్రం భారత బాక్సాఫీస్‌ను షేక్ చేస్తోంది. హొంబలే ఫిల్మ్స్ (కేజీఎఫ్, కాంతార, సలార్ ఫేమ్) మరియు క్లీమ్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా రూపొందించిన ఈ చిత్రం, జూలై 25న దేశవ్యాప్తంగా పరిమిత థియేటర్లలో విడుదలైంది. ఇప్పటికీ ప్రేక్షకుల నుంచి భారీ ఆదరణ లభిస్తోంది. దేవతల – రాక్షసుల మధ్య మహా సంగ్రామాన్ని ఆధారంగా తీసుకొని, ప్రహ్లాదుని చరిత్ర, హిరణ్యకశిపుడితో విష్ణువు రూపమైన నరసింహుడు పోరాటం వంటి పౌరాణిక అంశాల ఆధారంగా ఈ చిత్రాన్ని దర్శకుడు అశ్విన్ కుమార్ తెరకెక్కించారు. ?15 కోట్ల బడ్జెట్‌తో రూపొందిన ఈ చిత్రం తొలి రోజు ?1.75 కోట్లు మాత్రమే వసూలు చేసింది. కానీ మౌత్ టాక్ బలంగా ఉండటంతో కలెక్షన్లు భారీగా పెరిగాయి. 10 రోజులకు గాను ?105 కోట్లు వసూలు చేసి భారత చరిత్రలో అత్యధికంగా వసూలు చేసిన యానిమేటెడ్ సినిమాగా నిలిచింది. 'మహావతార్ నరసింహ' విజయం ద్వారా మరోపక్క పవన్ కళ్యాణ్ నటిస్తున్న 'హరిహర వీరమల్లు' సినిమాకు గట్టి ఎదురుదెబ్బ తగిలిందని ఇండస్ట్రీ వర్గాలు భావిస్తున్నాయి. హిందూ సంస్థలు, స్వామీజీలు కూడా ఈ చిత్రాన్ని స్వయంగా ప్రమోట్ చేయడమే కాక, ప్రత్యేక ప్రదర్శనలకు హాజరవుతున్నారు. హైదరాబాద్‌లో 200 మంది స్వామీజీలు కలిసి ఓ థియేటర్‌లో ఈ సినిమా ప్రత్యేకంగా వీక్షించడం, ఈ చిత్రం ప్రాచుర్యం ఏ స్థాయిలో ఉందో తెలియజేస్తుంది. ఈ విజయం 'మహావతార్ సినిమాటిక్ యూనివర్స్'పై భారీ అంచనాలను నెలకొల్పుతోంది. రాబోయే రోజుల్లో మరిన్ని పౌరాణిక కథల ఆధారంగా యానిమేషన్ సినిమాలు వెలుగు చూడబోతున్నాయి. రానున్న రోజులలో మరిన్ని భారతీయ యానిమేషన్ సినిమాలకు దారి తీసే మార్గదర్శక చిత్రంగా మహావతార్ నరసింహ నిలవబోతోందని విశ్లేషకులు భావిస్తున్నారు.



# ఇండస్ట్రీని ఊపేయడానికి రెడీ అవుతున్న మరో క్రేజీ హీరోయిన్


ఈ మధ్యకాలంలో ఓటీటీ కంటెంట్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటుంది. థియేటర్స్ లో వచ్చే సినిమాలతో పాటు ఓటీటీలో విడుదలయ్యే సిరీస్లు , సినిమాల కోసం ప్రేక్షకులు రెట్టింపు ఆసక్తితో ఎదురుచూస్తున్నారు. దాంతో ఓటీటీలో సినిమాలకు, వెబ్ సిరీస్ లకు విపరీతమైన రెస్పాన్స్ వస్తుంది. ప్రతి వారం పదుల సంఖ్యలో సినిమాలు, సిరీస్ లు రిలీజ్ అవుతున్నాయి. థియేటర్స్ లో సినిమాలు చూస్తున్న ఆడియన్స్ ఓటీటీలోనూ సినిమాలు సినిమాలను ఆదరిస్తున్నారు. ఇప్పటికే చాలా వెబ్ సిరీస్ లు ప్రేక్షకులను అలరిస్తున్నాయి. చాలా మంది సినీ సెలబ్రెటీలు కూడా వెబ్ సిరీస్ లకు మొగ్గుచూపుతున్నారు. ఒకప్పుడు సినిమాల్లో రాణించిన వారు ఇప్పుడు వెబ్ సిరీస్ లోకి అడుగుపెడుతున్నారు. ఈ క్రమంలోనే ఒకప్పుడు హీరోగా ప్రేక్షకులను ఆకట్టుకొని. ఆతర్వాత బిగ్ బాస్ తో మంచి పేరుతెచ్చుకున్న హీరో శివాజీ కూడా మొన్నామధ్య ఓ వెబ్ సిరీస్ తో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. అదే 90'%o% మిడిల్ క్లాస్ బయోపిక్ . 1990 కాలం జనరేషన్ పిల్లలు, తల్లి తండ్రులు, అప్పటి పరిస్థితులు ఈ వెబ్ సిరీస్లో చూపించారు. చక్కటి ఎమోషన్స్, ఆకట్టుకునే సంభాషణలు, చక్కటి మ్యూజిక్ ఆకట్టుకున్నాయి.సురేష్ బొబ్బిలి కంపోజ్ చేసిన ఈ సిరీస్ ఓ తెలుగు ఓటిటి మాధ్యమం స్ట్రీమింగ్ అవుతుంది. ఈ సిరీస్ వచ్చి చాలా రోజులు అవుతున్నా.. ఇప్పటికీ దీన్ని రిపీట్ గా చూసే ఆడియన్స్ ఉన్నారు. ఇక ఈ సిరీస్ లో నటించిన అందరూ ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. అలాగే ఈ సిరీస్ లో సుచితా డేవిడ్ పాల్ అనే పాత్రలో కనిపించిన చిన్నది గుర్తుందా.? ఈ చిన్నదాని పేరు స్నేహాల్ కామత్. ఈ బ్యూటీ పలు సినిమాల్లో నటించింది. కాగా 90'%o% మిడిల్ క్లాస్ బయోపిక్ సిరీస్ లో తన నటనతో క్యూట్ నెస్ తో కట్టిపడేసింది. ఈ సిరీస్ తో స్నేహాల్ కామత్ కు మంచి పేరు వచ్చింది. అంతే కాదు అరవింద సమేతసినిమాలో పూజా హెగ్డే ఫ్రెండ్ పాత్రలో కూడా నటించింది స్నేహాల్. అలాగే కైలాసపురం అనే వెబ్ సిరీస్ లోనూ నటించింది. 90'%o% మిడిల్ క్లాస్ బయోపిక్ తర్వాత ఈ అమ్మడు కోసం ఆడియన్స్ గూగుల్ ను గాలించారు. ఇక ఈ భామ సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతున్నాయి.



# హైప్ పెంచేస్తున్న సుధీర్ బాబు జటాధర టీజర్ అప్‌డేట్ లుక్

టాలీవుడ్ యాక్టర్ సుధీర్ బాబు నటిస్తోన్న చిత్రం జటాధర వెంకట్ కల్యాణ్ కథనందిస్తూ దర్శకత్వం వహిస్తున్న తెలుగు, హిందీ బైలింగ్యువల్ ప్రాజెక్ట్‌గా వస్తోంది. ఇప్పటికే విడుదల చేసిన పోస్టర్లు నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి. ఈ మూవీ టీజర్‌ను ఆగస్టు 8న గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు కొత్త లుక్ షేర్ చేశారు. ఓ వైపు శివుడు మరోవైపు చేతిలో త్రిశూలాన్ని పట్టుకున్న సుధీర్‌బాబు, ఇంకోవైపు ఉగ్రరూపంలో కనిపిస్తున్న సోనాక్షి సిన్హా లుక్స్ సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తున్నాయి. సూపర్ న్యాచురల్ థ్రిల్లర్‌గా వస్తోన్న ఈ చిత్రాన్ని శివన్ నారంగ్, ప్రేర్నా అరోరా, నిఖిల్ నందా, ఉజ్వల్ ఆనంద్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. పాపులర్ జీ స్టూడియోస్ భాగస్వామ్యంలో రాబోతున్న ఈ చిత్రంలో యాక్షన్‌తో కూడిన ఉత్కంఠభరితమైన సన్నివేశాలు అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ అందించబోతున్న టీజర్ అప్‌డేట్ లుక్ హింట్ ఇచ్చేస్తుంది.. సూపర్ న్యాచురల్ థ్రిల్లర్‌గా రాబోతున్న ఈ సినిమా షూటింగ్ త్వరలోనే మొదలు కానుంది. సుధీర్ బాబు నటించిన హరోం హర, మా నాన్న సూపర్ హీరో సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో ఇంప్రెస్ చేయలేకపోయాయి. దీంతో తన ఆశలన్నీ జటాధరపైనే పెట్టుకున్నాడు.

# బైక్ మెకానిక్ నుంచి ఇప్పుడు ఇలా.. ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నా..



సినిమా ఇండస్ట్రీలోనే అతను టాప్ హీరో. ఆయన సినిమా వస్తుందంటే చాలు అభిమానులు పూనకాలతో ఊగిపోతుంటారు. ఎలాంటి బ్యాగ్రౌండ్ లేని ఓ సాధారణ సికింద్రాబాద్ కుర్రాడు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా అభిమానులను సొంతం చేసుకున్నాడు. హీరోగా ఒకొక్క మెట్టు ఎక్కుతూ స్టార్ హీరోగా మారాడు. ఎన్నో సవాళ్లు, అవమానాలను ఎదుర్కొని స్టార్ హీరోగా ఎదిగాడు. తెలుగు, తమిళంలో ఎన్నో హిట్ చిత్రాల్లో నటించి మెప్పించాడు. హిట్లు, ప్లాపులతో సంబంధం లేకుండా బ్యాక్ టూ బ్యాక్ సినిమాలతో ప్రేక్షకులను అలరిస్తున్నాడు. దక్షిణాదిలో అత్యధిక ఫ్యాన్ బేస్ హీరో అతను. రీసెంట్ డేస్‌లో వరుసగా హిట్స్ అందుకున్నాడు. ఇంతకీ అతడు ఎవరో తెలుసా.. ? తమిళ్ హీరోలకు తెలుగులోనూ మంచి క్రేజ్ ఉంటుంది. తెలుగులో విపరీతమైన ఫ్యాన్ బేస్ ఉన్న హీరోల్లో అజిత్ ఒకరు. 1971 మే 1న సికింద్రాబాద్ లో జన్మించారు అజిత్. తండ్రి పి.సుబ్రమణ్యం కేరళకు చెందిన వ్యక్తి. చిన్నప్పటి నుంచి చదువుపై అంతగా ఆసక్తి లేని అజిత్.. కేవలం 10వ తరగతి వరకు మాత్రమే చదువుకున్నారు. ఆ తర్వాత బైక్ మెకానిక్ గా పనిచేశాడు. చదువులో ప్రావీణ్యం లేకపోయినా తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, ఇంగ్లీష్ భాషలు అనర్గళంగా మాట్లాడతాడు. తెలుగు, తమిళంలో అనేక హిట్ చిత్రాల్లో నటించి టాప్ హీరోగా ఎదిగాడు అజిత్. తాజాగా అజిత్ ఓ ఎమోషనల్ నోట్ షేర్ చేశాడు. సినిమా ఇండస్ట్రీలో నేను 33 ఏళ్లు పూర్తి చేసుకున్నా%౯% ఈ సందర్భంగా మీతో కొన్ని విషయాలు పంచుకోవాలనుకుంటున్నా.. గడిచిన ప్రతి సంవత్సరం నాకు ఓ మైలు రాయి. మరెన్నో మైలు రాళ్ళకోసం ఎదురుచూస్తున్నా.. ఈ అందరి ప్రేమకు కృతజ్ఞతలు తెలుపుతున్నా.. నా ఈ ప్రయాణం అంత ఈజీగా సాగలేదు. నేను సినిమా బ్యాగ్రౌండ్ ఉన్న ఫ్యామిలీ నుంచి రాలేదు. ఎన్నో సవాళ్లు , అవమానాలు ఎదుర్కున్నా..జీవితంలో ఎన్నో మానసిక ఒత్తిడిలు, ఎదురుదెబ్బలు, వైఫల్యాలు నిరంతరం పరీక్షించాయి. కానీ నేను ఎప్పుడూ ఆగిపోలేదు. అన్నింటిని ఎదుర్కొన్నా.. సినిమాల్లో ఊహించని ఫ్లాపులు చూశా.. ఇక నేను ముందుకు సాగలేను అనుకున్న ప్రతిసారి మీరు ప్రేమతో నన్ను ప్రోత్సహించారు. నా దగ్గర ఏమీ లేనప్పుడు కూడా మీరు నాతో ఉన్నారు. నేను ఇప్పుడు ఈ స్థాయిలో ఉన్నానంటే మీ ప్రేమే అందుకు కారణం.. ఇలాంటి గొప్ప అభిమానులు దొరకడం నా అదృష్టం. నా భార్య షాలిని లేకపోతే ఇదంతా సాధ్యమయ్యేది కాదు. ఇక రేసింగ్ లోనూ నన్ను చాలా మంది అవమానించారు, నన్ను ఆడుకోవాలని చూశారు. రేసింగ్‌లోనూ మనదేశం గర్వపడేలా చేస్తానని మాటిస్తున్నాను అంటూ అజిత్ రాసుకొచ్చారు.

Ediited Printed & Published Mekkonda Premraj on behalf MPR publications and Printed RNI NO:TELTEL/ 2023/89546 Cell No.9397303326,